నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

ఆగస్టు 1958

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం
గాంధీనగరం ★ విజయవాడ-2

విషయ సూచిక

చిత్రములు




రంజలరాట్నం

★

చిత్ర శిల్పి

శ్రీ కళ్యాణ ప్రసాదశర్మ

★



అంతర్ముఖుడు

★

చిత్ర శిల్పి

శ్రీ ఆర్. బి. రాజు

★

న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 1 | విజయవాడ ★ ఆగస్టు 1958 | సంచిక 3

స్వాతంత్ర్య దినోత్సవం

అగస్టు 15 భారతీయులందరికీ పర్వదినం దేశమంతటా స్వాతంత్ర్య దినోత్సవం జరుపబడుతుంది. పదోకొండేండ్లు నిండి పన్నెండవయేట ప్రారంభోత్సవం జరుపుకొంటున్నప్పుడు, ప్రజలందరూ ఆనందమగ్నులై ఉండాలి ఉత్సాహంతో పొంగిపోవాలి. దేశంలో ఏదిక్కు చూచినా, కళాకాంతులు నిండివుండాలి. ఎవరినోట విన్నా, భారతదేశ భవిష్యత్తంతా సుఖప్రదం అవుతుందనే ఆశ ప్రతిధ్వనించాలి. ఇది ఈనాడు మనం జరుపుకొనే స్వాతంత్ర్య జన్మదినోత్సవంలో వ్యక్తం అవుతుందా? కాదా ? అన్న ప్రశ్న ప్రతి ఒక్కరికీ ఉదయిస్తుంది కారణం ఏమిటి?

మన దేశంలో విద్యావిధానం మార్చివేస్తామని కలలుగన్నాం. స్వాతంత్ర్యం వస్తూనే మాతృభాషలలో విద్య నేర్పటం, మాతృభాషలలో పరిపాలన జరపటం, భాషా ప్రయుక్తంగా రాష్ట్రాలను విభజించటం, పరభాష స్థానే జాతీయభాషను నెలకొల్పటం - మొదలైనవి ఎన్నో చేస్తామని వాగ్దానాలు చేయటం జరిగింది. ఇంతేకాదు. ప్రాంతీయ కళా సంస్కృతుల పరిపుష్టికి జాతీయ జీవన విధానాన్ని ప్రవేశపెట్టి, ప్రజాజీవితం కళామయం కావటానికి తోడ్పడుతామని చెప్పటం కూడా జరిగింది.

ఇవి తప్పక కార్యరూపంపొంది ప్రజాభ్యుదయానికి దోహదం చేస్తాయని ఆశించిన వారందరూ ఆగి నిదానించి, ఆలోచించుకోవలసిన అవసరం వచ్చినట్లుగా అనిపిస్తుంది

ఈనాడు దేశంలో ఏవేవో మార్పులు జరిగిపోతున్నాయని చెప్పటం మాత్రం వింటున్నాం. నిజంగా మార్పులు జరుగుతున్నాయా? లేదా? అన్న సమస్య అందర్నీ సందిగ్ధావస్థలో ముంచేస్తుంది. అయితే ఈస్థితి ఈనాడు ఎందుకు ఏర్పడి వుందని వివేకం గలవారు కొందరు యోచించటం లేదని మాత్రం మేమనటంలేదు. బాధ్యతగల కార్య నిర్వహణలో నున్నవారు తాము సక్రమ పరిపాలనా వ్యవస్థను ఏర్పరచేందుకు కృషి చేస్తున్నామా, లేదా - అని ప్రశ్నించుకొని, సమాధానం మాత్రం చెప్పుకోమని కోరుతున్నాము.

ప్రాజెక్టులు కొత్తవి కట్టాం నూతనంగా వ్యవసాయం చేసుకొనే వారికి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటుచేసాం. కొత్త పరిశ్రమలను కొన్నింటిని వ్యక్తులు నెలకొల్పుకోటానికీ, మరికొన్నింటిని ప్రభుత్వమే నిర్వహించటానికీ ప్రాతిపదిక వేసాం. ఇంకా చిన్నవి ఏవేవో స్వల్పమైనవి కొన్ని చేయలేదని ఎవరూ అనటంలేదు. పదోకొండేండ్లపాటు యావద్భారత దేశాన్నీ తమ చెప్పు చేతలలో పెట్టుకొన్న

పెద్దలుమాత్రం చైనాలో, రష్యాలో ఏదో గొప్పగా జరిగిపోతూందని చెప్పటం చేస్తున్నారేగాని, మన దేశానికి ఈ ఉత్తమపద్ధతులు నిర్వహించబడటానికి సదుపాయం కలిగించ గలిగామని విశ్వాసంతో చెప్పగలిగిన స్థితిలో లేరని చెప్పవలసి వస్తున్నందుకు విచారిస్తున్నాము

ఎందరెందరో ఈ దేశ పురోభివృద్ధిని ఆశించి ఎన్నెన్నో త్యాగాలుచేసిన ఫలితంగా ప్రజాప్రభుత్వం అనేది ఏర్పడి ఈనాడు ప్రజా ప్రతినిధులుగా ఇప్పుడున్నవారు అధికారాన్ని స్వీకరించటానికి మార్గం ఏర్పడిందని గ్రహించగలిగివుంటే, ఇప్పటికన్న మనదేశం మరెంతో పురోభివృద్ధిచెంది ఉండి ఉండేదనిమాత్రం చెప్పక తప్పటంలేదు

ఏ దేశమైనా సర్వసంపన్నమైనది కావాలన్నపుడు ~~అందుకు~~ ఏ ఏ మార్గాలలో ఎలాంటి కృషి జరిగితే ఫలితం సమకూడుతుందో గ్రహించగలిగిన నేర్పు, ఓర్పు దేశాన్ని నడిపేవారికి ఉండాలి. దేశాన్ని నడిపేవారే తమలో తాము కలహించుకొంటూ, ఒకరిని మరొకరు నిందించుకొంటూ, ప్రజాభిమానాన్ని వీలైనంత తగ్గించుకొనేందుకు ప్రయత్నంచేస్తూ వుంటే తెలివైన పని అని ఎవరనగలరు? అంతేకాదు నిత్యం వార్తా ప్రచురణలో బాధ్యులైనవారు వ్యక్తిగత మైన నీలాపనిందలతో వాదోపవాదాలు పెంచుకొనే ప్రకటనలు చేసుకొంటూ వుంటే విజ్ఞత ఉన్నదని ఎవరు మెచ్చగలరు? దేశంలో విభిన్నాభిప్రాయాలుగల రాజకీయప్రచారం జరిగి ప్రజలలో విజ్ఞతా వివేకాలను పెంపొందించేదానికి బదులుగా, ఉద్రేకాలను, ఉక్రోషాలను రెచ్చగొట్టేందుకు తోడ్పడుతూవుంటే దేశానికి హితవుకలిగించే మార్గమిదే నని ఎవరు అంగీకరించగలరు ?

మన రాష్ట్రాలన్నింటిలో ఒక్కరాష్ట్రంమాత్రం కమ్యూనిస్టుల పరిపాలనలో ఉంది ఆ రాష్ట్రంలోని పరిపాలనకన్న మిగిలిన రాష్ట్రాల పరిపాలన హుందాతనం కలిగివుందని సగర్వంగా చెప్పుకోగలిగిన స్థితి ఈనాడు మనకున్నదోలేదో ప్రశ్నించుకొని, సమాధానం చెప్పుకోవలసిన అవసరం ప్రజాహితం కోరేవారందరికీ వుంది. ఈనాడు మనం గత చరిత్రను సింహావలోకనంచేసి, భవిష్యత్తుకు ఆశాజనకమైన పరిష్కార మార్గాన్ని సూచించగలిగితేనే, ప్రజాభిమానం పరిపాలకుల యెడల వుండి, సుపరిపాలన ఏర్పడటానికి దోహదం జరుగుతుంది

కాని ఈనాడు దేశంలో అశాంతి, అసంతృప్తి అన్ని తరగతుల వారిలో నిండి నిబిడీకృతమైవుండి, ఏఒక్క ప్రజాహితకార్యమూ జయప్రదంగా నిర్వహించబడటానికి వీలులేని పరిస్థితులను కల్పిస్తూవున్న మాటమాత్రం నిజం. ఎప్పటికప్పుడు కులతత్వాన్ని తగ్గించుకోమనీ, స్వార్థపరత్వాన్ని కుంచించుకోమనీ ఎవరికివారు ఏవేవో నీతులు ఇతరులకు ఉపదేశించటం మాత్రం జరుగుతూంది. కాని తమకు తాము ఆత్మపరిశీలన చేసుకోగలిగిన ఉత్తమ మానవ స్వాయమ్యాత్రాన్ని అనుసరించే ప్రయత్నం మాత్రం చేయటంలేదు. ఇది ఎవరిలోప [illegible] ప్రశ్నకు సమాధానం చెప్పుకోవటం సామాన్యం మాత్రం కాదని [illegible] ఇది తెలి

కూడా చర్చించటం ఎందుకంటే, ఎవరైనా కొందరుయోగ్యులు. మహాత్మాగాంధీ వంటి త్యాగులు, వివేకవంతులై మంచిమార్గంలో పయనించాలంటే కొద్దో గొప్పో యోచన చేసుకోవటానికి వివేకించుకొని విజ్ఞతతో ప్రవర్తించి, దేశహితంకోసం కృషి చేయటానికి తోడ్పడుతుందని మా విశ్వాసం.

ఈ నాడు పంచవర్ష ప్రణాళికాప్రచారం పేరుతో కోట్లకొలది ధనం వెచ్చించటంమాత్రం జరుగుతున్నది. ఎంత వ్యయం జరుగుతున్నదో, అందుకు తగిన ఫలితం మాత్రం ప్రజలు పొందటంలేదని ప్రతి ఒక్కరికీ తెలుసు ఐనా ఆత్మవంచన ఎందుకు చేసుకుంటున్నారో ఎంతయోచించినా బోధపడటంలేదు. ఒకరోజు ఒక పద్ధతిలో ఒక నిర్ణయం చేయటం, మరొకరోజు మరొక పద్ధతిలో మరొక నిర్ణయం చేసి, అంతకన్నా ఇది [illegible] తోచిందని తాఖీదులపై తాఖీదులు పంపి, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉక్కిరి బిక్కిరిచేసేస్తున్నారు. ఇది పరిపాలనానుభవం లేనివారు మాత్రం చేయగలపద్ధతిగా తోస్తుంది. ఈ కొద్దికాలంలో మేము మాశక్తి కొలది చేసామని మనకు మనం సంతృప్తిపడినా, బాధ్యతగలవారిపై ప్రజాభిమానం కలగడంలేదు. అది అంతకంతకూ పరిపాలనలో నున్న వారిపై అసంతృప్తిని పెంపొందించి, పరిపాలనా వ్యవస్థపైనే ఏవగింపు కలిగించేలా చేస్తుంది. ఇది ఇకముందు ఇలా జరగకుండా ఉంటేనే దేశానికి హితవు కలుగుతుంది

పాలకులు పాలితులకు తమ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంగా- గతంలోని లోపాలను గ్రహించి వివేకవంతులై విజ్ఞతగలిగి ప్రవర్తిస్తే - దేశానికి మంచి భవిష్యత్తు వుంటుంది

దేశం సర్వసంపన్నం కావాలి. ఇదిఅందరికోరిక. దేశం సర్వసంపన్నం కావాలంటే, అందుకు ఏవేవి మనకు కావాలోకూడా గ్రహించాలి. ఆ గ్రహింపే ఈ నాడు మన పాలకులకు తక్కువగా ఉన్నదని ప్రజలనుకొంటున్నారు. దేశహితానికి ధనం కావాలి ప్రకృతి సంపద ఎంతగా మనకు లభ్యమవుతుందో తెలుసుకోవాలి. ఈ ధనాన్నీ, ఈ ప్రకృతి సంపదనూ వినియోగించుకోడానికి మరొకశక్తి వుంది. అదే మానవశక్తి. అంటే మనిషిలో ఉన్న మేధా సంపత్తియొక్కనైపుణ్య శక్తి. ఇది ఎంత హెచ్చుగా వుంటె దేశం అంత నిర్మాణయుతంగా, అంత సస్యశ్యామలంగా, అంత కళానిలయంగా, అంత సుఖితంగా పెంపొందుతుంది.

ఈనాడు మనకున్న శక్తు లన్నింటిలోను మానవ నిర్మాణ శక్తే తక్కువగా వుంది. దీనిని ఎలా పెంపొందించుకోవాలి? అన్న ప్రశ్నకు మన పంచవర్ష ప్రణాళికలో సమాధానం దొరకదు పంచవర్ష ప్రణాళికకు కొన్ని కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నాము. కొంత ప్రకృతి సంపదను వినియోగించు కోవాలని భావిస్తున్నాం. ఈ పెట్టిన పెట్టుబడితో మనకున్న ప్రకృతి సంపత్తి మన కెంతవరకు వినియోగ పడుతుందో తెలుపగలిగిన పద్ధతి లేనంతవరకు మన ప్రణాళికయొక్క ప్రయోజనంఏమాత్రం కలుగదని చెప్పవచ్చు అయితే విద్యావంతులైన నిరుద్యోగులకు కొన్ని వసతులుచూపిస్తున్నామని, కొంత నిరుద్యోగం నిర్మూలన మవుతుందని

చెప్పుకొని సంతృప్తిపడటానికి ప్రయత్నం చేయటం నిష్ప్రయోజనమని చెప్పక తప్పదు

ప్రణాళికా నిర్వహణ భావిభారత జాతి పురోభివృద్ధికి దోహదకారిగా మాత్రం లేదు ప్రణాళికా నిర్వహణ ప్రజోపయోగం కాకపోవటానికి కారణం మానవశక్తి లోపమేనని స్పష్టంగా చెప్పగలము మానవశక్తిని అంచనా వేయకుండా ప్రణాళికా రచయితలు ప్లానులుమాత్రం వేస్తే అవి కాగితపు ప్లానులు కావటం తథ్యం. ఇది ఈ నాడు జరుగుతున్న సత్యం. దీనినుంచి మనం మన ప్రజలను ఉత్తమ పద్ధతిలో ఉత్తమ కార్యనిర్వాహకులుగా తయారు చేయగలనున్న విశ్వాసం మాకు కలగటంలేదు నిత్య జీవితంలోని అనుభవమూ, విద్యా వ్యాసంగములోని వివేకానుభవమూ కలిగి, పౌరధర్మం నిర్వహించ టంలో నేర్పరులైన వారు దొరికినప్పుడే ఈ సమస్య పరిష్కరించ బడుతుందని మా విశ్వాసం.

స్వాతంత్ర్య దినోత్సవాలు మనం ఎన్ని జరుపుకున్నా, మన ప్రజలలో నిర్మాణపూరితమైన పౌరధర్మ నిర్వహణ జ్ఞానాన్ని పెంపొందించలేనంత వరకు, భారత భాగ్యోదయం కలగటం కల్ల

ప్రజా ప్రతినిధులూ, ప్రజానాయకులూ, ప్రజాహిత సంస్థలూ, ప్రభుత్వ నిర్వాహకులూ పరస్పర గౌరవంతో స్నేహసహకారాలతో, కార్యనిర్వహణయందు భక్తివిశ్వాసాలు కలిగి, నిరంతరకృషి చేద్దామనే సత్సంకల్పంతో దీక్షవహిస్తే ఈ స్వాతంత్ర్య దినోత్సవం సార్థకంకాగలదు.

ప్రపంచం అల్లకల్లోలంగా వుంది. మన దేశంలోని పరిస్థితులు అస్థిమితంగా వున్నాయి. అయినా, మన జాతీయ నాయకులు తమ శక్తి వంచన లేకుండా దేశ భవిష్యత్తుకు రూపురేఖలు తీర్చిదిద్దటానికి నిరంతరం కృషిచేస్తూనే వున్నారు. ఈ కృషి ఇంకా విస్తృతంగా, ప్రజా ప్రాతిపదికపై జరిగితేనే దేశపురోభివృద్ధి సాధ్యమవుతుంది. ఇది గమనించి ఈస్వాతంత్ర్యదినోత్సవం జయప్రదంకావటానికి మనమందరమూ సమష్టిగా కృషి చేయటం ఒక్కటే పరిష్కార మార్గమని మా అభిప్రాయం మనలో మనకు ఎన్ని అభిప్రాయ భేదాలున్నా, ఎన్ని విమర్శనలు చేసుకొన్నా, అవి సహృదయంతో స్వీకరించి, దేశహితంకోసం జరిగే కృషిలో పరస్పర సహకారంతో ప్రవర్తిస్తే, దేశం సర్వసంపన్నం కావటానికి మనం తోడ్పడ గలం. ఇది ఆయా వ్యక్తుల విజ్ఞతా సంస్కృతులపై ఆధారపడి వుంటుంది.

జాతీయాభివృద్ధినీ, జాతీయ ధర్మాన్నీ జాతీయ జీవనాన్ని గౌరవించి, ఆదరించి, అభిమానించి, ఉత్తమమార్గ మవలంబించే వారందరూ ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుభప్రదంగా జయప్రదంగా నిర్వహించేందుకు తోడ్పడితే, మన జాతీయ వీరుల త్యాగ సాఫల్యానికై తమ కర్తవ్యాన్ని నిర్వర్తించినట్లవుతుంది. ఇది ప్రతి దేశభక్తుడూ గమనించి, ప్రవర్తించాలని మా మనవి.

శ్రీ లల్ల

శ్రీ వేలూరి శివరామ శాస్త్రి

౧౪ వ శతాబ్ది కాశ్మీరాలలో లల్ల పుట్టింది. పుట్టింది మొదలు ఆత్మాన్వేషణే పని. ప్రాచీన కాశ్మీరిలో కవిత్వం కట్టింది. ఈమె కవితలో శివాద్వైతం అద్వైతం తంత్రం ప్రత్యభిజ్ఞ సుఫీసంప్రదాయం మొ. వానిలో చిలికిన వెన్నా గీయని సున్నా కనిపిస్తవి తత్త్వద్వేషులు వీనినే లల్లాయి పదాలని అన్నారా లేక తెలుగువారిలో ల (లొ)ల్లయ్య పదాలనే ఇలా అన్నారా అనేసంశయం కలుగుతుంది.

శ్రీ మదభినవగుప్తుని ఈశ్వర ప్రత్యభిజ్ఞావ్యాఖ్యాత భాస్కరుడు 'లల్లేశ్వరీ వాక్యాని' అనే పేరుతో ఈమె పద్యాలు కొన్ని సంస్కృత శ్లోకాలుగా మార్చాడు వీనిలో కొలది లోపాలు కనబగతవి. అన్నీ అచ్చులోపాలై యుండాలి।

ఈమెకు హిందువులలో లల్ల లల్లాదేవి లల్లేశ్వరి లల్లాయోగిని అనిన్నీ ముస్లింలలో లల్లా అరీఫా అనిన్నీ ప్రసిద్ధి.

(నేను ఈక్రిందివానిని అర్థక్రమంకోసం, పారక్రమాన్ని అతిక్రమించి, తెలుగువాక్యాలు వ్రాస్తున్నాను. భాష ఎలా ఉంటుందో అనే కౌతుకం తీర్చడానికి ఒక పద్యంమాత్రం కాశ్మీరీ భాషలోది ఉదాహరిస్తాను)

శివ్ వా కేశవ్ వా జిన్ వా కమలజ నాథ్ నామ్ దారిన్ యుస్
మ్య అబలి కాసితన్ భవ రుజ్ సుహ్ వా సుహ్ వా సుహ్ వా సుహ్.

నేను అబలను. నన్ను భవరోగం పట్టుకొని పీక్కు తింటూంది. శివుడు కేశవుడు
[1] జినుడు - బ్రహ్మ, వీరిలో ఎవరు నాకు చికిత్స చేసినా సరే। (౮) ౧

నేను విభునికోసం దేశదేశాలు తిరిగి వేసారిపోయాను పొరపాటు పడ్డాను. ఊపిరి నిలిపి, జ్ఞానదీపం వెలిగించి, చూతునుగదా తీరా ఇంట్లోనే చిత్ స్వరూపుడు కనబడ్డాడు (౩-౪) ౨

విభుదర్శనంకోసం ఎన్నో తీర్థాలు తిరిగాను. అతని గుణాలు కీర్తించి కీర్తించి నోరు నొచ్చింది, దానికంటె ఎక్కువ మనస్సు మలమల మరిగింది. అతని విమర్శచేస్తూ మనస్సులోపలికి వెళ్లా (౪౮)

అక్కడ అన్నీ ఆవరణాలే. వాని లోపలనే ఉంటాడని నిశ్చయించా. వానిని దూసుకుని లోపలికి వెళ్లా. అపుడందరూ నన్ను లల్లా లల్లా అని అన్నారు. (౪౯) 3

సంసారంలో కుమిలి దిక్కులేనిదాననైనాను ఇపుడు సహజమైనప్రబోధం కలిగింది. ఒకళ్ళకోసం నే నిహ చావనక్కరలేదు నాకోసం ఇంకొకళ్ళు చావనక్కరలేదు. నాకిపుడు చావూ బ్రతుకూ ఒకటే. (౩౪) ౪

---

1. కాశ్మీరీలకు సామరస్యం చాలా ఉన్నట్లు కనబడుతుంది. అభినవుడు జైనాచార్యుల కడా, బౌద్ధాచార్యులకడా జైనం బౌద్ధం చదువుకొని - 'శాస్త్రాలలో కుతూహలంవల్ల నాస్తిక ఆర్హత బౌద్ధాదులైన గురువులను సేవించాను' - అని తంత్రాలోకంలో (౮-౨౦౬) చెప్పుకొన్నాడు.

ముక్తికోసం, పాపం! ఈ సన్న్యాసులు తీర్థాలు పోతారు. ముక్తి చిత్త సాధ్యంకాని తీర్థసాధ్యం కాదు. దూరపుకొండలు నునుపు! (౩౬) ౫

చిత్తం అనే అద్దం నిర్మలం ఐంది. ప్రత్యభిజ్ఞ కలిగింది. దైవం నా స్వరూపంగానే కనిపించింది. నేనూ హుళాక్, నీవూ హుళాక్, ఈ ప్రపంచమూ హుళాక్. (౩౭) ౬

అమ్మలక్కలు నన్ను వేవిధాల తిట్టనీ, ఉదాసీనమైంది నా మనసు. దానికి మకిల పట్టదు ఉదాసీనమైన (పైన వేలదీసిన) అద్దాన్ని (నేలమీది) దుమ్ము ఏం చేస్తుంది? (౧౮) ౭

నన్ను తిట్టుకోండి తిమ్ముకోండి, పూలతో పూజించుకోండి రాలతో కొట్టుకోండి. నాకు దుఃఖమూ లేదు, సంతోషమూ లేదు. బోధామృతం తాగి నాలో నే నున్నా! (౨౧) ౮

(ఒకతె) శీలాన్నీ మానాన్నీ కాపాడటానికి శీల మానాలే భటులు(కాని, నీవా?, నేనా?.) గాలిని ఏ మొనగాడైనా పట్టుకుంటాడా; ఏనుఁగు నెవడయినా దారంతో కట్టివేస్తాడా? (౨౪) ౯

అంతా తెలిసీ మొద్దులా ఉండు! అంతా వినీ చెవిటివి కా! అంతా చూచీ గ్రుడ్డి వవు! ఇదే తత్త్వాభ్యాసం. (౨౦) ౧౦

అభ్యాసంచేత దృశ్యం శూన్యమైతే సాక్షిరూపం మిగులుతుంది. శాంతమైన ఆసాక్షీన్ని శూన్యమైతే ఇక అనామయం. (౧) ౧౧

వాక్కూ మనస్సూ శివుడూ శక్తీ-సమస్తమూ దేంట్లో లయమైతే అదే-అభ్యాసం! (౨) ౧౨

తంత్రమంతా మంత్రంలో, నాదమూలమైన మంత్రమంతా చిత్తంలో లయమవుతుంది. చిత్తం లయం అయితే దృశ్యమూ ద్రష్టాకూడ చిత్ స్వరూపంగా శేషిస్తుంది. ౧౩

సూర్యుడస్తమిస్తే చంద్రుని వెలుగు. చంద్రుడస్తమిస్తే చిత్తం వెలుగు. చిత్తం అస్తమిస్తే దృశ్య జాతమంతా ఎందో లీనమవుతుంది. ౧౪

లే లే, శక్తి పూజచేసే ఓ అమ్మా! లే! కల్లూ గిల్లూ పోసి పూజ చెయ్! దాంతో అక్షరలబ్ధి కలిగితే చెరుపా? ౧౫

శ్రీమద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

పరశురామ వృత్తాంతము

★

ఈ కల్పవృక్షములో సీతారామ వివాహమునకుఁ బూర్వము పరశురామ కథ జరిగినది. అట్లెందుకు వ్రాయఁబడినదో హేతువులు కూడ ఇందులోఁ జెప్పఁబడినవి. వివాహ సమయమునందు వశిష్ఠుడు జనక శతానందులతో కన్నులందు నవ్వుచు నిట్లనియె.

మిథిలా శృంగాటకములఁ
బృథులంబగు విషయ మట్లు వినఁబడియెడు శ్రీ
మధురాకృతి సీత ధరకు
మధుసూదను రాణి వచ్చి మన్నించినటుల్
మధురాకృతి మా రాముఁడు
మధుసూదనుఁ డౌనొ కాదొ మధుసూదను నం
శ ధురాఖ్యాతుని భార్గవు
నధరీకృత తేజుఁ జేయుటది యద్భుతమే.

మది నీధైర్యము చేత మీ గృహములన్ మన్నించు లక్ష్మిన్ రమా
స్పదుఁడౌ మా పసివాని కోసమయి యభ్యర్థింతు మిల్లాలుగన్"

అని చెప్పుటలో రాముఁడు సాక్షాద్విష్ణువని చెప్పుటయున్నది. సీత శ్రీ మధురాకృతి, మధుసూదను రాణి, జనకుల యిండ్ల యందున్న లక్ష్మి. ఆమె భర్త కాఁదగినవాఁడు సర్వ విష్ణ్వంశ కలవాఁడు కావలయును. కొంతయంశ భార్గవునిలోనున్నది. అదియుఁగూడ రామునియందు సంక్రమించి నప్పుడుగాని సీతాకరగ్రహణ యోగ్యత రామునియందు సిద్ధించదు.

మఱియును వివాహవేళ జనక రాజు వశిష్ఠునితో నిట్లనెను:

"...కోరి పణంబిడి నట్టిదాదిగా
నెంజిలిఁ గాంతు విల్విఱుచు నేరము వెట్టి మృథార్ధమేగుదెం
చుం జమదగ్ని సూతియనుచున్ మది నానెగులుం దొలంగెఁబో.
ఆదిగులులోనఁ బరిణయ
మోదంబునఁ గొంత తరుగు పుట్టకయుండన్
జోదు పరశ్వథ రాముని
ప్రోదియుఁ జెడె మున్నుమున్న పొంగెడు శుభమై"

ఈ రెండు హేతువులు పరశురామ కథను పూర్వమునందుఁ జెప్పించినవి. పరశురాముఁడు మహాభయంకరుఁడు. వచ్చినాఁడు. ఆయన వచ్చినంతటనే, అందఱి పైప్రాణములు పైననే పోయినవి. ఆయన యర్ఘ్యపాద్యములను స్వీకరించి, 'జనకదత్త మాణిక్య పీఠికాస్థలిని' నిషణ్ణుడైనాడు. అందఱి ప్రాణములును శిథిలమై చెడినచోట్లు చేరుకొన్నవి. అంతమట్టుకే సంతోషించిరి. కొంత మాటాడుట, తర్కించుట, జరుగఁ గలదు గదా! • అదికూడ లేకుండ విరుచుకు పడలేదని.

కూర్చున్న యప్పుడు కూడ భార్గవు దేహ
యష్టి రత్నాసనమాను పీట
శిఖరస్థమగా కీర్తి ముఖమును మకరతో
రణ మంటుచున్న దీర్ఘ తను వొప్పె

భార్గవుడు దీర్ఘ తనువు ఆ రత్నాసన మాను పీటపై భాగమున కీర్తి ముఖమును మకర తోరణమును జెక్కఁబడియున్నవి. కీర్తి ముఖము అయశో హేతువు. మకర తోరణము యశో హేతువు. ఆయన శిరసు మీరెంటిని దాకుచున్న దనఁగా ఆయన రాముని ముందు నిలువ లేఁడనియు, రాముఁడాయనను మిక్కిలి గౌరవించుననియు స్ఫూర్తులు.

భార్గవుడు రాముని కోడిపోయి, తిరిగి పోయిన తర్వాత బంధువులు రాముని చుట్టుఁజేరి' నీ వంతవాఁడ, వింత వాఁడవు. "ఆయన నీముందట నిల్వఁ జాలక కదా యారీతి జేజేలు వెట్టెను. నీ హేతువుగాగ నేడు పొడగట్టెన్ క్షత్ర శౌర్యంబు పోయిన యా గౌరవ మెల్లయున్ మఱలఁ గంటే! యెంతయౌన్నత్యమో!"

లోకంబునందు రాజన్య లోకంబు లోకువై పోయె
నీకతమ్మున నింకను దలయెత్తి యెందేనియుఁ దిరుగ
మాకయ్యె......"

నని ప్రశంసించిరి. రాముఁడు వారితో నిట్లనెను :

......భార్గవుని నేనుగాని గెలిచి నా
డనెద్వంద్వ యుద్ధ మాడెద
నని యాడెనే? యాడెనేని నపుడు గెలుతునే?
ఆయన సర్వాస్త్ర విదుం
డాయన పటుబాహుశాలి యాయమ్మున కే
లో యొదిగినట్లు చూపెను
శ్రీయుతుఁ డాపగాని యేమి చేతము కలఁడో?

ఈ మాటలచేత రామునకు పరశురాముని యందున్న గౌరవము సువ్యక్త మగుచున్నది. ఇంత గౌరవము పరశురాముని యందు రామున కెట్లు కలిగినది?

పరశురాముని యందున్న విష్ణ్వంశ సర్వము ఆయన చేతిలోని ధనువు శ్రీరాముఁడు తీసి కొన్నప్పుడు—

'ధనువు తుదంబడి యొకండు తాదీపితమై' 'ధనుః పుంఖంబుంబడి తేజమొండు వెలిగెన్ మున్నంచి వెన్నంచియై'

పరశురామ శరీర గత వైష్ణవ శక్తియంతయు శ్రీరామ చంద్రుని యందుఁ బ్రవేశించి నది. అందుకనియే—

'ధనువు కొనినంత రామున
కు నసంతానంత కల్ప ఘోర తపస్సం
జనితమగు శక్తి తన దగు
తనువునఁ గల్గినటులొప్పెఁ దత్కాలమునన్'

తన సంపాదించిన పు
ణ్యా నితాంతాభి నవజగము లన్నియు వడి జా
ఱిన రీతిఁ దోచె భార్గవు
తనువున...

ఇది లోకములో చెప్పికొను కథ. దీని నిట్లు పొసగించుటచేత కథకు కొంత రమ్యత యేర్పడిన దనవచ్చును. ఇది కథ నతుకుపటులోని నేర్పు. ఇంక—

పరశురాముఁడు విజృంభించు చున్నాడు. ఆ విల్లు విఱిచినవాఁడెవఁడని గద్దించు చుండఁగా రాముఁడు 'నేను' అన్నాడు.

అన గంభీర మనోజ్ఞ మేఘ నినద
వ్యాహారమై కర్ణ రం
ధ్ర నితాంతామృత సేచనం బయి హ్లాదం
తః ప్రాణ సంతోషణ
స్వనమై భార్గవ రాముఁ డున్నత
భుజా స్తంభ ప్రమాణా కృతిన్
గని శ్రీరాముని దృప్త నేత్ర హిమ రు
క్కల్పాభి రామాకృతిన్

అంతమైన యౌద్ధత్యంబు నంతమైన
వికట చంక్రమణంబును విరిసిపోవ
మరల నాసీనుఁడై —

భార్గవుఁడు పీఠికాస్థలిని గూర్చున్నట్లు పూర్వము చెప్పఁబడినది. ఇచ్చట మరల నాసీనుఁడై యని వ్రాయఁబడినది. అనఁగా ధనుస్సు విఱిచిన దెవఁడురా? యని యాయన కేకలు వేయుచున్న ప్పుడు కోపావేశములో లేచి చిందులుత్రొక్కెననుట యనుమానమగుచున్నది.

ఆ రాముని కంఠధ్వని విననంతనే పరశురాముని ప్రాణములు లేచివచ్చినవి. తనయందు నిష్ప్రయోజనముగా నున్న విష్ణ్వంశము బహుపు తగ్గిన దనిపించినది. దానిని స్వీకరించువాఁడు వచ్చినాడని తెలిసినది. ఈ రాముఁడు ఉన్నత భుజాస్తంభ ప్రమాణాకృతి. భుజములు స్తంభముల వలె నున్నవి, ఉన్నతములుగా నున్నవి. ఆ ప్రమాణములో నున్నది రాముని యాకృతి. బలిష్ఠులై కొందఱు పొట్టి వారుండవచ్చును. ఆ బలమునకు తగిన యెత్తున్నప్పుడుగాని వాని సౌందర్యము ప్రకాశించదు. శ్రీరామ చంద్రుఁడట్లున్నాడని యర్థము. పరశురాముని దృప్త నేత్రములకు, అనఁగా అతని కన్నులలో గర్వమున్నది. రాముఁడు హిమరుగాకృతి. చంద్రాకృతి. ఆగర్వము తగ్గిపోయిన దని యర్థము. రామునిఁ జూచినంతనే, అతని యౌద్ధత్యము, వికట చంక్రమము విరిసిపోయినవి. మరల కూర్చున్నాడు. ఆ రాము నేమి చేయవలయునో తెలియలేదు. అంత ముద్దైన బిడ్డ. వైఁగా చూచినంతనే సాక్షాద్విష్ణువు వచ్చినాఁడని తెలిసికొన్నాఁడు. తరువాత పరశురాముని ప్రసంగ మంతయు శ్రీ రామచంద్రుఁడు విష్ణ్వవతార మన్న యభిజ్ఞతోడనే జరిగినట్లు రచించుటలోననే ఈ కథలోని గూఢశిల్ప మిమిడి యున్నది. పాఠకుఁడు దానిని జాగ్రత్తగా చూడవలయును.

రాముఁడు – 'అది చెట్టంత విల్లు. చేతితో పుచ్చుకొనుట యెట్లు? కోటి బిగించుటయెట్లు? పెట్టెలోననే యల్లెత్రాడు బిగించుటకు ప్రయత్నించితిని కాబోలు. అందులోననే విరిగిపోయె' నన్నాఁడు.

పరశురాముఁడు – 'ఏమి? ఏమి? అట్లు విరిగినదా ?

"ఇది యచింత్యమ్ము సుమ్మీ బాల కాకుత్స్థ
నీ వీర్యము జగత్త్రయీ విభేది"

అని రాము నాక్షేపించినట్లు, రాముఁడు విష్ణ్వవతారమని చెప్పుచు మాట్లాడినాఁడు. పైఁగా 'నీవు నేత్రగోళ తర్పణమవు' అన్నాఁడు.

ఈ మాట ప్రత్యక్ష ప్రశంస. మఱియు ధనుస్సు విచ్చిపోయినది. దాని సంగతి యెందుకు? నేను వేఱే ధనువు తెచ్చితిని. దీని నెక్కువెట్టి శరము నింపుము. 'భవదీయ శౌర్యవిభవానేక క్రియావైఖరుల్' నేను చూతునన్నాడు.

రాముఁడు విల్లెక్కువెట్టఁగా 'శౌర్య విభవానేక క్రియావైఖరు' లెట్లు చూతును? విష్ణ్వవతారమైననే విల్లెక్కువెట్టఁగలఁడు. విల్లు ఎక్కువెట్టినంతనే పరమేశ్వరుని శౌర్య విభవానేక క్రియ వైఖరులు పరశురామునకుఁ దెలియును. ఈ బహువచనములో నున్న సారస్యమిది.

అప్పుడు నీకు ద్వంద్వ యుద్ధ మొసఁగెద నన్నాఁడు. ఈ పరశురాముని మాట లెవ్వనికి నర్థము కాలేదు. దశరథుఁడు, వశిష్ఠుఁడు, జనకుఁడు కోప ముపసంహరింపుమని ప్రార్థించిరి. అపుడు లక్ష్మణుఁ డిట్లన్నాఁడు

"ఈ విల్లు విఱిచిన వానికిఁ గూఁతు నిత్తునన్నాఁడు జనకుఁడు. నీకు కోపము వచ్చినచో అప్పుడే రావలయును. విఱిచిన తర్వాత కోప మెందుకు?"

ఈ కుఱ్ఱతనపు మాటకు పరశురామున కెంతయైనను కోపము గావలయును. పరశురామునకు కోపము రాలేదు. రాలేదు సరికదా, రామచంద్రుని పల్కరించి,

"ఓయి శిశువ, కాద, ఓయి దుర్ధర్షుఁడా,
శైవ మిదియు రెండు జంట విండ్లు"

అని తన చేతికి విష్ణు ధనుస్సు వచ్చిన కథను చెప్పినాఁడు. తొలుత 'శిశువా' యని పిలిచి తర్వాత 'దుర్ధర్షుఁడా' యని. రామచంద్రుఁ డన్నచో పరశురాముని గుండెలో నుండి ప్రేమ యుబికి వచ్చుచున్నది.

మఱియు 'దుర్ధర్షుఁడా'యని పిలుచుచున్నాడు. అతనిని తాను గెలువలేనని చెప్పుటయేగదా! ఆ కథ చెప్పుచుఁ జెప్పుచు,

"నే నచ్చముగాఁ బాఱుఁడ
గాను సుమీ క్షత్ర రక్త కాండమ్ములు నా
మై నరములఁ బ్రవహించున్
శ్రీ నిభృత మనోజ్ఞ హాస చిత్రిత వదనా!"

ఈ సంబోధన యొక విలక్షణమైనది. పరశురాముఁడు తన గొప్పదనమునట్లు చెప్పుకొనుచుండఁగా ఏ క్షత్రియులను తానిరువది యొక్క మారు నరకెనో, ఆ క్షత్రియుల రక్తము తన నరములలో బ్రవహించుట గొప్పగా చెప్పికొనెను. దానికి రామునకు నవ్వువచ్చెను. ఆ నవ్వును పురస్కరించుకొని పరశురాముఁడిట్లు సంబోధించెను. ఆ నవ్వు చాల నిభృతమైనది. ఆ నవ్వుం

కరించినంత శ్రీరామచంద్రుని మొగము మిక్కిలి నందముగా నున్నది.

తరువాత తాను కార్తవీర్యుని చంపిన కథ పరశురాముఁడు చెప్ప నెంచెను :

'నీవా కథ చెప్పుమందువేని చెప్పెద' ననెను. పరమేశ్వరుఁడైన శ్రీరామచంద్రుని యనుజ్ఞను వేడుకొనుట యది. రామచంద్రుఁడు మందహాసమున ననుమతించెను. ఆ రామ పరశు రాముల కొకరి కథ యొకరికిఁ దెలియును.

పరశురాముఁడు తన కథయంతయుఁ జెప్పెను. ఈ చెప్పిన పద్ధతి జాగ్రత్తగా చదివినచో తప్పంతయు కార్త వీర్యునిది, తనదేమియు కాదన్నట్లు ఈ సంగతి నిరూపించుటకు చెప్పికొన్న ట్లుండును. ప్రతిమాటయు తదభిముఖముగా నే నడుచును. ఒక పసివాఁడు తనవల్ల తప్పులేదని చెప్పి కొన్నట్లు కథ నడిచినది.

కార్త వీర్యుఁడు తమ యావును దోలికొని పోయెను.

"నేనప్పు డింటి దగ్గఱ
లే నడవికి నేగితిన్ మలీమసకృత్య
స్థానమున నేన యుండినఁ
బోనిత్తునె యింటియావు పోగులం గంచున్."

తమ యాస్తి యెవఁడో యెత్తుకొనిపోవుట, తనకు బాధగా నుండుట - ఇందులోనున్నది. ఇంటికి వచ్చిన తర్వాత తన తల్లి యంతయు చెప్పినది.

"అనుచు మా తల్లి యేడ్చిన యపుడు నాకు
నెంత కోపము రానచ్చు నీవె చెపుమ !
నన్ను అళ యెల్లఁ గోపిష్ఠుఁ డన్నమాట
ఆడెదరగాని ఆ ద్రోహ మగునె చెపుమ."

ఈ రీతిగా శ్రీరామునితో పరశురాముఁడు తన చేసిన పనిలోని దోషము లేమి చెప్పికొను చున్నాఁడు.

మరల కార్త వీర్యుని కొడుకులు తాను లేనప్పుడు వచ్చి తన తండ్రి మెడ కోసిరి. పరశు రాముఁడు చెప్పుచున్నాడు :

"మాగిడ్డిఁ దోలికొని చన
సాగసుఁడగు తండ్రి నేను జంపితివానిన్
మా గురువు వారి గిడ్డిని
లాగి బలిమి తెచ్చెనా బలంబు మదమునన్"

పరశురాముఁడు తనకథ చెప్పికొనుట యీరీతిగా నడిచినది.

ఈకథ యంతయు విన్నతర్వాత శ్రీరామచంద్రుం డిట్లనియె:

'నీకర్మ లోకాద్భుతంబు, ఇంతపని యెవ్వరుం జేయలేరు. కాక నీకింత కోపంబు కలిగించు కారణంబుండె'

అపుడు పరశురాముఁడు తన ధనువిచ్చుటకు ముందు, ఈ ధనువు నీవెక్కుపెట్టెదవేని నీక్రింద నేనోడినట్లె' 'నీవిశ్వమోహన కరము నిగిడించు నీరదాకార!' అనెను.

ఈ చరణములో రామునిది విశ్వమోహనకరమని, రాముడు నీరదాకారుడని పరశు రాముడు చెప్పుటయే, పరశురాముని రామావతార రహస్య మెఱుగుటను సూచించుచున్నది. తరువాతకూడ—

"నీవు చే విల్లంది నపుడె నీవు శార్ఙ్గి వటంచు నేను
భావ మందెఱింగితిఁ బద్మపత్ర శోభానేత్రయుగళ ?"
"నీచేత నోటువడుటఁ బ్రద
పాచపలత లేదునాకుఁబద్మ దళాక్షా !"

అన్నాడు.

ఈ రామ పరశురామ సమాగమములో చేసిన కల్పనయిది. పరశురామున కాదినుండియు రాముడు విష్ణ్వంశ సంభూతుడని సంశయము కలిగినది. ఆయన హృదయమునకుఁ దెలియును. ధనుస్సు చేతికిచ్చి నప్పుడు స్పష్టముగాఁ దెలిసెను.

ఆ పరశురాముఁ డన్నచో రామునకంత గౌరవము. ఇది యంతయు పాత్ర చిత్రణము నందలి యుదాత్తత.

★


పై సంచికలో — సీతారాముల శృంగార వర్ణన



శ బ రి

చిత్రశిల్పి :

శ్రీ పి. ఎల్. నరసింహామూర్తి



కుమ్మరి

*

చిత్రశిల్పి :
శ్రీ కళ్యాణ ప్రసాదశర్మ

కొత్త బాన

పిరాండెల్లో

★

అనువాదం : ప్రయాగ

ఆసంవత్సరం ఆలివ్ పంట మూడుపూవులారుకాయలుగా వుంది. అంతకు ముందు చెట్లన్నీ విరగబూచిన తరుణంలో చాలాకాలం చలిగాలులు తోలినప్పటికీ కాపు బాగానేపడ్డది. లల్లా జిరాఫాకు ప్రిమోసోల్‌వద్ద మంచి ఆలివ్ తోపు వుంది ఆ ఏటి పంటలో వచ్చే ఆలివ్ నూనె పోయటానికి, తన నేల మాళిగలో వున్న ఐదు పాతబానలు చాలవనే ఉద్దేశ్యంతో లల్లా జిరాఫా మరో బానకోసం ముందుగానే ఆర్డరిచ్చాడు ఈ కొత్త బాన చాలా పెద్దది రొమ్ములవరకూ వస్తుంది పెద్దబాన కడుపు. తన దగ్గరవున్న ఐదు బానలకు ఇది తలిబాన కావాలి

ఈ బాన చేసినవాడితో లల్లా జిరాఫాకు పేచీ వచ్చిందన్న సంగతి నేను చెప్పనక్కర లేదు. అతను తగాదాపడని మనిషి ఒకడున్నాడని చెప్పడం చాలా కష్టం చిన్న చిన్న వాటికి, చివరకు తన ప్రహరీగోడనుండి ఊడిపడిన రాయికోసం, సందెడు గడ్డికోసం, పేచీలు పెట్టుకుంటాడు. వాటికోసం దావాలు వేసేందుకు బస్తీకి పోవటానికి గుర్రాన్ని సిద్ధం చెయ్యమని పనివాళ్ళమీద కేకలు వేస్తుంటాడు కోర్టు ఫీజుక్రిందా, ప్లీడరు ఫీజుక్రిందా ఎవడో ఒకడిమీద ఏదో దావావేసి పర్యవసానంలో ఉభయ ఖర్చుల క్రిందా ఎంతో డబ్బు తగలేసి, తన్నుతాను నాశనం చేసుకున్నాడు ప్రతివారం రెండుమూడు సార్లు వచ్చి పడుతుంటే, ఆ దెబ్బ తట్టుకోలేక, అతని ప్లీడరు అతను మాటిమాటికీ రాకుండా వుండటానికి గాను, అతనికి ఒక ప్రార్థన గ్రంథం లాంటిది బహూకరించి పంపించాడని లోకంలో ప్రతీతి. ఆ గ్రంథం న్యాయశాస్త్రం దావాకోసం పరుగెత్తేముందు ఆ విషయంలో తప్పొప్పులు అతనే స్వయంగా చదివి తెలుసుకోవచ్చుననే వుద్దేశంతో ఆ ప్లీడరు అలా చేసాడని చెప్పుకుంటారు.

అంతకు ముందల్లా ఎవరికైనా అతనితో పేచీ వచ్చి, అతన్ని ఏడిపించాలనుకొన్నప్పుడు "ఎక్కవయ్యా గుర్రం!" అని కేకలు పెట్టి ఆటలు పట్టించేవారు ఇప్పుడు ఆమాట మార్చి "పోవయ్యా, ఇంటికిపోయి పుస్తకం చూసుకో." అనటం మొదలుపెట్టారు

"అదే చూస్తాను, గాడిదల్లారా, ఉండండి మీపొగరణుస్తాను!" అనేవాడు లల్లా.

కొద్ది రోజుల్లోనే ఆరు రూపాయలు పెట్టి కొన్న ఆ కొత్తబాన రానేవచ్చింది. కాని దాన్ని పెట్టేచోటు లేదు. నేలమాళిగ ఖాళీ చేసేదాకా తాత్కాలికంగా, కొన్నాళ్ళపాటు దాన్ని కొట్టంలో పెట్టారు అంత చక్కని బాన ఎన్నడూ కన్నదీ విన్నదీ కాదు. గరీ వెలుతురూ లేక మాగిన ద్రాక్షరసపు కంపుకొట్టే ఆ రూపంలో అలాంటిబాన పెట్టటమంటే లల్లాకు బాధగానే వుంది

అప్పుడే రెణ్ణాళ్ళుగా ఆలివ్‌కోత ఆరంభించారు. అతను వచ్చే సంవత్సరం చిక్కుడు తోట వెయ్యాలనుకొన్న గట్టుప్రక్క చేనికి గుర్రాలమీద ఎరువు తోలటంకూడా ఆరంభమైంది. లల్లా ఒక వంక చెట్లనుండి పండ్లు కొట్టేవాళ్ళనుకనిపెట్టి వుండాలి, అటు ఆ ఎరువు తోలేవాళ్ళనూ కనిపెట్టి వుండాలి, ఇదంతా ఒక్క మనిషి చేయగలిగింది కాదని అతనికి తెలిసివచ్చింది. ఏది ఎలా అజమాయిషి చేయాలో తోచక, "ఒక్క ఆలివ్‌కాయ పోయిందంటే చూడు నిన్ను చంపిపారేస్తాను-నిన్ను చంపేస్తాను" అంటూ అందరిమీదా విరుచుకపడ్డాడు అక్కడ ఆ చెట్లమీద ఉన్న ఆలివ్‌కాయల నన్నిటినీ తాను లెక్కపెట్టినట్టు! ఇంక అటు ఎరువు తోలేవాళ్ళ దగ్గరకు వెళ్ళి "చూడండి, ఏ ప్రోగైనా తక్కిన వాటికంటె తక్కువగా వున్నదా అంటే, మిమ్ముల్ని ఏం చేస్తానో?" అని వెర్రి కేకలు వేసాడు.

నెత్తిన ఒక చిన్న తెల్లటోపీ పెట్టుకొని చేతులపై కెగదీసి, గుండీలు పెట్టక తెరచుకున్న చొక్కాతో అటూ ఇటూ పరుగులు పెట్టాడు. అతని ముఖం ఎఱ్ఱగా కందిపోయి చెమట వోడుతూ వుంది. కళ్లతోడేలు కళ్ళలాగా మిట్టి పడుతున్నాయి. సున్నగా క్షౌరము చేసుకొన్న గడ్డం వ్రేళ్ళతో గీరుకుంటున్నాడు. క్షవరం చేసిన కత్తి తీసీ తీయకముందే ఎక్కడనుంచో ఆ గడ్డం మొలుచుకొస్తుంది.

మూడవనాడు పని కాగానే, మకిలపట్టి మొరటుగా ఉన్న ముఖాలతో ముగ్గురు పనివాళ్ళు సావిట్లోకి వచ్చారు. వాళ్లు అంతవరదాకా ఆలివ్ చెట్లమీద కాయలు కొట్టి నిచ్చెనలు, బొంగులు సావిట్లో పెట్టి పోదామని అందులో అడుగు పెట్టగానే ఆ చక్కని కొత్త బాన బ్రద్దలై ఉండటం చూచి వివ్వెరపోయి నిలబడ్డారు. ఎవడో పట్టుకొని పదునైన కత్తితో ఒక్క దెబ్బకు బయటకు పొడుచుకు వచ్చిన ఆ బాన పొట్ట తెగగొట్టినట్లుంది.

"అయ్యో దేవుడా చూడు, చూడు!"

"ఇది ఎట్లా జరిగిందిరా."

"లల్లా వింటే ఏమవుతుందో! కొత్తబాన! అయ్యో పాపం!"

వారిలో మొదటివాడు తక్కిన వాళ్ళకంటె ఎక్కువ భయపడ్డాడు. వెంటనే తలుపు వేసి నిచ్చెనలు, బొంగులు బయట గోడకు ఆనించి మెల్లిగా జారుకుందామని సలహా చెప్పాడు. కాని రెండవవాడు ఒప్పుకోలేదు.

"అది మతిలేని ఆలోచన! ఈ పప్పులేమీ లల్లా దగ్గర ఉడకవు. మనం ఈ బాన పగలగొట్టామంటే, ఆయన నమ్మవచ్చు, నమ్మకపోవచ్చు. ఏమైనా సరే మనం ఇక్కడే ఉందాం!"

అతను బయటకు వెళ్ళి రెండుచేతులతో చప్పట్లు చరుస్తూ, "దొరా లల్లా! దొరా లల్లా! లల్లా, లల్లా"అని కేకలు పెట్టాడు. ఆ ఆసామీ వచ్చి బాన పగిలింది చూచి అంతులేని ఆలోచనలో పడ్డాడు. తన కోపమంతా మొదట ముగ్గురిమీదా చూపాడు, వారిలో - ఒకణ్ని గొంతు పట్టుకొని గోడకు నొక్కిపట్టి "భగవంతుని సాక్షిగా ఆ బానకయిన డబ్బు నీవు కట్టుకోవాలి!" అన్నాడు.

తక్కిన ఇద్దరు తీవ్రమైన ఆవేశంతో లల్లా మీదపడి అతన్ని దూరంగా నెట్టివేసారు. అంతటితో లల్లా ఆ కోపమంతా తనమీదే చూపుతున్నాడు నేలమీద కాళ్లు బాదుకున్నాడు, టోపీ విసిరి నేలకు కొట్టాడు. చెంపలు వేసుకున్నాడు. ఎవరో దగ్గరి బంధువు చచ్చిపోయినట్లు కేకలూ బొబ్బలూ పెట్టాడు.

"కొత్తబాన! ఆరు రూపాయల బాన! సరి కొత్తది."

"దాన్ని ఎవరు పగులగొట్టి ఉంటారు? దానంతట అదే పగిలి ఉంటుందా? అంత చక్కనిబాన తన దగ్గర ఉన్నందుకు ఓర్వలేక దుర్బుద్ధితో ఎవరో పగులగొట్టిఉంటారు. తప్పకుండా అంతే! అయితే ఎప్పుడు? ఎలా? దాన్ని దేనితోనూ కొట్టినట్లు లేదే! అసలు కుమ్మరి ఆవంలోనుంచి అది వచ్చినప్పుడే పగిలి ఉందా? లేదే. అప్పుడది రాగానే కంచు మోగినట్లు మోగింది!

తమ యజమానికి వచ్చిన ప్రథమకోపం తగ్గిపోవడం చూచి, దాన్ని మళ్ళీ బాగుచెయ్యవచ్చునని, అంత విచారం పెట్టుకోవద్దని పనివాళ్లు ఓదార్చటం మొదలు పెట్టారు. నిజానికి ఆ పగులు అంత చెడ్డదేమీకాదు. ఎదుటి ముక్క ముక్క ఒక్కటిగా ఊడివచ్చింది. దాన్ని అతుకులు వేసేవాడు జాగ్రతగా రివెట్లు వేస్తే అది మళ్ళీ కొత్తబాన అవుతుందిజీ. డీమా లికాసీ ఈ పనిలో మొనగాడు. ఏవేవో కలిపి అతను ఈ మధ్య ఒక కొత్తసిమెంటు తయారుచేసాడు. దానిసంగతి యింకాగోప్యంగా అద్భుతంగా ఉంది. ఆ సిమెంటుతో ఒక్కసారి అతికితే మళ్ళీ సమ్మెటపెట్టి కొట్టినా ఆ అతుకు జారదు. అందువల్ల లల్లా ఒప్పుకుంటామన్నాడు తెల్లవారేసరికి తాము అతన్ని తీసుకొస్తామనీ అతను బాగుచేస్తే ఆ బాన సరి కొత్తదానికంటే బాగా ఉంటుందనీ పనివాళ్ళు చెప్పారు

లల్లా బాలాసేపు పనివాళ్ళ సలహా వినిపించుకోలేదు. అతుకు పెట్టటం కేవలం పనికి మాలిన పని! ఆ పగిలింది ఇంకా ఏం బాగు పడుతుంది? కాని చివరకు లల్లా మెల్లిగా మెత్తపడ్డాడు సరిగ్గా తెల్లవారేసరికల్లా లికాసీ

తన సరంజామా అంతా పెట్టిన బుట్ట బుజాన వేసికొని అక్కడికి రానేవచ్చాడు. అతను పెద్ద వాడైపోయాడు. కీళ్లు సడలిపోయి, కీలు పట్లు ఉబ్బి, బుడిపలు తేరి ముసలిచెట్టు బోదెలాగా వున్నాడు. అతని నోటినుంచి ఒక మాట బయటికి రావలెనంటే, పట్కారు పెట్టి నోరు పగలదీయ వలెనేమో అనిపిస్తుంది. ముడుచుకుపోయిన అతని ఆకృతిలో అసంతృప్తి దుఃఖం గోచరిస్తాయి. బహుశః తాను ఒక కొత్త విషయం కనిపెట్టినట్లు ఒక్కరు కూడా గమనించలేదనే నిస్పృహవల్లనేమో ! తాను కనిపెట్టిన సిమెంటు మిశ్రమాన్ని అతను వ్యాపార రీత్యా ఇంకా పేటెంటు చేసుకోలేదు. ముందు దాన్ని జయప్రదంగా ప్రయోగించి, దానికి పేరు ప్రతిష్ఠలు సంపాదించా లనుకొన్నాడు. ఈ లోపుగా ఆ మిశ్రమ పద్ధతిని ఇతరులు సంగ్రహించకుండా, ఆ రహస్యాన్ని వెయికళ్ళతో కనిపెట్టి వుండాలి.

లల్లా ఒకక్షణం అతన్ని ఆపాద మస్తకం పరీక్షించి, అవిశ్వాసపు గొంతుతో, "నీ సిమెంటు ఏదో నన్ను చూడనీ !" అన్నాడు.

అలా వీలు లేదన్నట్లుగా, లికాసీ తల ఊపాడు

"అది ఎలాపనిచేస్తుందో చూద్దురు గాని ..." అన్నాడు.

"అయితే అది అతుకుతుందంటావా?"

లికాసీ తన బుట్ట క్రిందపెట్టి, అందులో నుంచి, ఒక పెద్ద జేబురుమాలలో చుట్టిన చిన్న మూట బయటికి తీసాడు. అందులో ఏమి ఉందోనని అందరూ ఆదుర్దాగా చూస్తూ చుట్టూ నిలబడ్డారు. తీరా ఆ చుట్లన్నీ విప్పగా విప్పగా ఆ లోపల ఉన్న కళ్ళజోడు కన్పించింది. అది ప్రక్కలా మధ్యా అంతా విరిగి, దారంతో బిగించబడి వుంది! దాన్ని చూడగానే అంతా విరగబడి నవ్వారు. లికాసీ అదేమీ గమనించకుండానే, శుభ్రంగా చేతులు తుడుచుకొని, అతి జాగ్రత్తగా అజోడు పెట్టుకొని, బైటి వసారాలో పెట్టివున్న ఆ బానను పరీక్షించటం మొదలు పెట్టాడు.

"ఇది అతుక్కుంటుం"దని చివరకు తేల్చి చెప్పాడు.

"కాని ఒక్క సిమెంటు అయితే నాకు నమ్మకంలేదు, రివెట్లుకూడా కావాలి!" అన్నాడు లల్లా.

"అయితే నేను వెళ్లిపోతాను" అని వెంటనే అన్నాడు లికాసీ లేచి బుట్ట బుజానికి తగిలించుకుంటూ.

లల్లా అతని చేయి పట్టుకుని ఆపాడు.

"వెళ్తావు? ఎక్కడికి? నీకు బొత్తిగా మర్యాద తెలియదే! .కూటికి లేనివాడి అరాజకీయ చూడు! బుద్ధిలేని వెధవా! అందులో నేను ఆలివ్‌నూనె పోసుకోవాలి. నూనెకారిపోతుందని నీకు తెలియదా ఏమిటి ? ఆ బాన గజాల పొడుగున అతుక్కో వలసి వుందె ! నీవేమో సిమెంటు మాత్రమే వాడుతా నంటావు ! నాకు రివెట్లు కావాలి ! సిమెంటు రివెట్లు ! ...నాకేది కావలెనో, నిర్ణయించవలసింది నేను !"

లికాసీ కళ్లు మూసుకొని, పెదవులు బిగించి తల ఊపాడు .అందరూ అంతే ! తాను కనిపెట్టిన సిమెంటు నందలి అద్భుత గుణాలను నిరూపిస్తూ, చక్కగా ఒక పని చేసాను గదా అనే సంతృప్తి అతని కెవ్వరూ కలగనివ్వటం లేదు.

"ఆ బాన కంచుమ్రోగినట్లు మళ్ళీ మ్రోగకపోతే ." అని ఏదో చెప్ప నారంభించాడు.

"నేను ఒక్క మాట వినను. నాకు రివెట్లు కావాలి. నీకు సిమెంటుకూ రివెట్లకూ కూడా డబ్బిస్తాను, ఎంతవుతుందో చెప్పు!" అన్నాడు లల్లా.

"నేను సిమెంటు మాత్రమే వాడినట్లయితే ..."

"ఓ దేవుడా ! ఎంత మూర్ఖంరా, బాబూ ! ఏమి చెప్పాను నేను ? నాకు రివెట్లు కావాలని చెప్పానుగదా ! పని అయినాక బేరం కుదుర్చుకుందాంలే నీతో ఇంకా కాలక్షేపం చెయ్యటానికి నాకు తీరిక లేదు." అంటూ తన కూలీలను చూసుకోటానికి వెళ్ళిపోయాడు లల్లా

లికాసీకి బాగా కోపం వచ్చింది. కోపంతోనే పని ప్రారంభించాడు. ఇనుప రివెట్లు వేయటానికి బానకూ పగిలిన ముక్కకూ బెజ్జాలు

తొలుస్తున్న కొద్దీ అతని ఆవేశం పెరిగిపోతు వ్నది. అతని బరమా తొలుచుకుపోతున్నది. అతను మరీ మరీ కొరకొర లాడుతున్నాడు. ఆ కోపంతో ఎఱ్ఱబడి, కళ్లు మందుకు పొడుచుకొచ్చినట్లున్నాయి. పైత్యంతో ముఖం పచ్చ బారింది. బెజ్జాలు వెయ్యటం పూర్తి కాగానే, ఆ బరమాను కోపంతో బుట్టలో పడేసాడు. పగిలిన ముక్కను తెచ్చి దానిచోట పెట్టి, కోసిన బెజ్జాలు ఒకదాని కొకటి సమమైన దూరాలలో అతకటానికి అనువుగా ఉన్నాయో లేదో పరిచూసు కున్నాడు. ఎన్ని రివెట్లు వెయ్యాలో, అన్ని తీగలూ కత్తిరించుకున్నాడు ఆ తర్వాత ఆలివ్‌కాయలు కొడుతున్న ఒక పనివాణ్ని తనకు సాయితా రమ్మని పిలిచాడు.

"సరదాగా వుండవయ్యా, లికాసీ!" అన్నాడు ఆ పనివాడు, ఆ ముసలివాడి హడావుడి చూసి.

లికాసీ ఏదో రాక్షసుడిలాగా చేయి పైకెత్తాడు. తన దగ్గిరున్న సిమెంటు డబ్బా తీసి, మనుష్యులు దాని విలువను గుర్తించకపోవటంవల్ల, దాన్ని భగవంతుడికి అర్పిస్తున్న విధంగా, ఆకాశంవంక ఎత్తిపట్టి ఒక్క క్షణం ఉంచాడు. తర్వాత ఆసిమెంటు ఆ పగిలిన భాగమంతటా పూసి, రివెట్లకు గాను కోసివుంచిన తీగలు పట్కారు తీసికొని ఆబాన కడుపులోకి వెళ్లాడు. ఆ పగిలిన ముక్కను ఇంతవరకూ తాను పట్టుకున్న విధంగా అతికించి కదలకుండా పట్టుకొమ్మని ఆపనివాడికి చెప్పాడు పనివాడు అలా చేయగానే, సిమెంటు పూసిన ఆ ముక్క అతుక్కుంది. లికాసీ బానలో ఉండే అన్నాడు.

"లాగవోయ్, ఇప్పుడు దాన్ని లాగు! నీ బలంకొద్దీ లాగు! అది జారిపోవడం లేదు చూసావా? నన్ను నమ్మనివాళ్లు నశించిపోతారు. కొట్టు, దానిమీద! కొట్టవోయ్! నేను లోపలున్నప్పటికీ కంచులాగా మ్రోగటంలా? వెళ్ళి ఈ సంగతి మీ యజమానితో చెప్పు!"

"ఇదంతా ఎందుకయ్యా, చెప్పవలసింది పైవాడూ, చెయ్యవలసింది క్రిందివాడూ! ఆ రివెట్లు వెయ్యవయ్యా, వెయ్యి!" అన్నాడు నిటూరుస్తూ ఆ పనివాడు.

లికాసీ ప్రక్క ప్రక్కనే వున్న ఆ బెజ్జాలలోనుంచి తీగలు దోసి, తన పట్కారుతో మెలిత్రిప్పి బిగించసాగాడు. వీటి నన్నింటినీ బిగించటం గంట పట్టింది. ఆ బానలో అతనికి చెమట కారిపోతున్నది పని చేస్తూ చేస్తూ లికాసీ తన దురదృష్టం గూర్చి లేమార్లు చెప్పుకున్నాడు. ఆ పనివాడు దగ్గరగా వుండి ఓదారుస్తూ వచ్చాడు,

పని అంతా కాగానే "ఇప్పుడు నన్ను బైటికి లాగు!" అన్నాడు పనివాడితో. ఆబాన కడుపు ఎంత పెద్దదైనప్పటికీ దాని మూతి మాత్రం చాలా సన్నం. తన హడావుడిలో తానుండటంవల్ల లికాసీ ఈ సంగతే పరికించ లేదు ఇప్పుడో, ఎంత ప్రయత్నం చేసినా బయటపడే మార్గమే కన్పించటంలేదు. అతనికి సహాయం చెయ్యటం పోయి, ఆ పనివాడు పనిలేకుండా నిలబడి, కడుపుబ్బ నవ్వుతున్నాడు. ఈ విధంగా పాపం, లికాసీ తాను అతికించిన బానలో తానే చిక్కుకున్నాడు, జరిగినదాన్ని ఉపేక్షించి ప్రయోజనంలేదు. ఆ బాన పగిలిపోనిదే అతను బయటకు రాడు, అయితే ఈసారి ఆబాన ఒక మంచికోసం పగలవలసివుంది,

ఆ నవ్వులూ కేకలూ వినిపించి లల్లా పరుగెత్తుకుంటూ వచ్చాడు. బానలో వున్న లికాసీ పిచ్చికోపం వచ్చిన పిల్లిలాగా, ఉమ్మి వేస్తున్నాడు.

"దేవుడిమీద ఆన! నన్ను బయటికి తీయండి. నేను బయటికి రావాలి! త్వరగా సహాయం చెయ్యండి!" అని లికాసీ కేకలు పెడుతున్నాడు

లల్లా ఇదంతా చూసి నివ్వెరపోయి, తన చెవులనే తానునమ్మలేక పోయాడు.

"ఏమిటి! బానలోనా? లోపల తన్నుతాను బిగించుకు కూచున్నాడా?"

అతను బానదగ్గిరికిపోయి, లికాసీవంక చూసి గద్దించాడు· "నీకు సహాయమా? నేను ఏం సహాయం చెయ్యగల ననుకొంటున్నావు? ఓ బుద్ధిలేని ముసలిపక్షీ. నీ ఉద్దేశ్యం ఏమిటి? ముందుగానే దాన్ని ఎందుకు కొలుచుకో

"ఔను, నేను దాన్ని ఎందుకు పోగొట్టుకోవాలి?" అన్నాడు లల్లా పిడికిలి బిగించి "నేను నా డబ్బు పోగొట్టుకొని ఎందుకు నవ్వులపాలు కావాలి?"

"దాన్ని ఏమంటారో తెలియదా? అక్రమ నిర్బంధం అంటారు!" అని చెప్పాడు ప్లీడరు చివరకు.

"నిర్బంధమా? సరే. అయితే అతన్ని ఎవరు నిర్బంధించారు? తనను తానే నిర్బంధించుకున్నాడు! ఇందులో నాతప్పు ఏముంది?"

ఈ విషయంలో రెండు సమస్యలు వస్తాయి. అందులో మొదటిది అక్రమంగా నిర్బంధించినందుకు తనమీద కేసురాకుండా వుండాలంటే లల్లాగారు ఆ బంధితుని వెంటనే విడుదలచేయాలి. రెండవది - తెలివితేటలు లేకుండా ఆ బానలో ఇరుక్కొని అందువల్ల బాన పోగొట్టినందుకు దాని విలువ ఆ బంధితుడు ఇచ్చుకోవాలి! అంటూ ప్లీడరు లల్లాకు వివరించిచెప్పాడు.

లల్లా ముఖం కొంచెం వికసించింది. ఒక్క నిట్టూర్పు పుచ్చాడు "ఆఁ. అలా చెప్పండి. వాడు నాకు బాన ఖరీదు ఇచ్చుకోవాలి!" అన్నాడు.

"ఆగు కాస్త. ఆ ఖరీదుమాత్రం కొత్త దాని లెక్కన రాదు. గుర్తించుకో!"

"ఎందుకని?"

"ఎందుకంటే అదపగిలిపోయిందికాబట్టి!".

"పగిలిందా? లేదండీ! ఇప్పుడే అది ఇది వరకు కంటేకూడా బాగుందని అతనే చెప్పాడు. ఇప్పుడు నేను పగులగొట్టవలసివస్తే మళ్లీ అతికించటానికి వీలుండదు. బాన నాశనమై పోతుందండీ!" అన్నాడు లల్లా.

అతని వాదనను అంగీకరిస్తారనీ, ఆ బాన ఇప్పటి పరిస్థితినిబట్టి ఎంత విలువచేస్తుందో అంతా లికాసీ చెల్లించవలసి వుంటుందనీ ప్లీడరుగారు అతనికి నొక్కి చెప్పారు.

"అందువల్ల ఆ మనిషి చేతనే దాని విలువ ఎంత వుంటుందో ముందుగా చెప్పించు" అని సలహా ఇచ్చారు.

తర్వాత సంతోషంతో వెళ్లివస్తానని చెప్పి, లల్లా గబగబా సాగిపోయాడు. సాయంకాలం ఇంటికి వచ్చేసరికి ఆ మనిషి ఉన్న బానచుట్టూ తన పనిమనుషులంతా కోలాహలంగా మూగి వుండటం చూసాడు. కావలి కుక్కలుకూడా ఈ గొడవలో చేరిపోయాయి. లికాసీ అప్పటికి చల్లబడిపోవటమే కాదు. తాను చేసిన పనికి తానే ఆనంద పడేస్థితికి వచ్చి, తన సాహసానికి తానే నవ్వుకుంటున్నాడు. అది దురదృష్టవంతుడిముఖంమీదవిచారగ్రస్తమైననవ్వు!

లల్లా ఆ జనాన్ని అందరినీ ఆవలకు తోలి, బానలోకి వంగిచూస్తూ అన్నాడు.

"ఏం లికాసీ, సుఖంగా వున్నావా?"

"అద్భుతంగా వుంది. గాలి పోసుకొంటున్నాను. మా యింట్లోకంటె ఇక్కడే బాగుంది" అన్నాడు జీడీమా.

"చాలా సంతోషం కాని ఈ బాన కొన్నప్పుడు ఆరు రూపాయలైంది. ఇప్పుడెంత చేస్తుందంటావు?"

"లోపల వున్న నాతోకూడానా?" అన్నాడు జీడీమా

చుట్టూ వున్న పనివాళ్ళందరూ నవ్వారు.

"ఉష్! నీ సిమెంటు ఉపయోగపడి అయినా వుండాలి. లేకపోతే ఎందుకూ పనికిరాకపోయి అయినా వుండాలి మరోమార్గం లేదు. అది ఏమైనా ఉపయోగించివుంటే, ఇప్పటిపరిస్థితిలో ఈ బానకు ఎంతో కొంత విలువ అంటూ ఉండాలి! ఆ విలువ ఎంత వుంటుంది? నీ లెక్క ప్రకారం ఎంత వుంటుందో చెప్పు."

లికాసీ కొంచెంసేపు ఆలోచించి చెప్పాడు:

"నేను మొదట చెప్పినట్టు నన్ను దీన్ని సిమెంటులో బాగుచేయనిచ్చినట్లయితే అసలు నేను ఇందులో ఇరుక్కునేవాణ్నే కాను. అంతే కాకదీనికి మొదట ఎంత విలువో అంత విలువా వుండేది. లోపలినుంచి వేసిన ఈరివెట్లవల్ల ఇది ఇప్పుడు బాగా చెడిపోయింది కనుక దీని విలుకూడా తగ్గిపోతుంది. ఇంచుమించుగా ఇప్పుడు అసలు విలువలో ఏ మూడోవంతో వుంటుంది"

లేదు? రా, ప్రయత్నించు. చెయ్యి బైటికి పెట్టు!. .ఆఁ - అలా! ఇప్పుడుతలబైటికి పెట్టు! రా, పైకిరా! .అలాకాదయ్యా నెమ్మది నెమ్మదిగా . దిగు క్రిందికి! ... ఒక క్షణం వుండు!.. అలాకాదు .దిగవయ్యా క్రిందకి! . ఇలాంటిపని ఎలా చేసావయ్యా? ఇప్పుడు నా బాన గతేమిటి?" అని లల్లాగోలపెట్టాడు.

తానేమీ ఆందోళన పడనట్లుగాను, ఆందోళన పడుతున్నదల్లా ఆ చూసేవాళ్లే అయినట్లుగాను. "శాంతంగా వుండండి, శాంతం?" అని అందరికీచెప్పి, **"నా తల తిరిగిపోతున్నది. శాంత గా వుండండి! ఇది పూర్తిగా కొత్త** విషయం. నా గుర్రాన్ని తీసుకురండి!" అని పనివాళ్ళకు చెప్పాడులల్లా!

ఆ బానకొట్టిచూసాడు. అది మళ్ళీ కంచు మ్రోత మ్రోగుతున్నది.

"బాగుంది. కొత్తదానితో సమానంగా బాగయిపోయింది కొంచెంసేపుండు.ఇప్పుడే వస్తాను" అన్నాడులల్లా, లికాసీతో. వెళ్లి నీవు గుర్రానికి జీను వెయ్యమని తన పని వాడికి చెప్పాడు. భయంకరంగా చేతులతో నొసలు రుద్దుకుంటూ—

"ఏమిటబ్బా దీనికి మార్గం? ఇది బాన కాదురా బాబూ! ఓ పెద్దదయ్యంలాగుంది . మెదలకుండా అందులోకూచో! గోలచెయ్యకు! అని ఆ బానను సరిగా నిలబెట్టటానికిపోయాడు. అందులో లికాసీ బోనులో చిక్కిన అడవి జంతువులాగా బయటికి రావాలని తన్నుకు లాడుతున్నాడు.

"అయ్యో, ఇది చాలా వింతసంగతి దీన్ని ప్లీడరుగారు తేల్చవలసిందే. నా అంతట నేనేమీ చెయ్యలేను.... ఎక్కడుందిరా గుర్రం?

త్వరగా తీసుకురండి! నేను సూటిగా ప్లీడరుగారిదగ్గిరికి పోయి తిరిగివస్తాను. అందాకా నీవు ఓరిమితో ఉండు! నీమంచికే చెబుతున్నాను . అందాకా మెదలకుండా వుండు! నా హక్కులసంగతి నేను చూసుకోవాలి. అన్నిటికంటె ముందు. నాపక్షాన న్యాయం వుండేటట్లుచూసుకోటం నా బాధ్యత. ఇదిగో.... నీ పనికి, రోజల్లాచేసిన పనికి నీ కూలి ఇచ్చేస్తున్నాను. మూడు రూపాయలు చాలునా!" అన్నాడులల్లా, "నాకేమీ అక్కర లేదు. ముందునేను బయటికి రావాలి"అన్నాడు లికాసీ.

"అలాగేవద్దువుగాని. కాని నావరకు నేను-నీకు ఇవ్వవలసిన కూలి ఇప్పుడే ఇచ్చేస్తున్నాను. ఇవిగో ఐదులైర్లు!"

లల్లా తన కోటుజేబులోనుంచి ఐదులైర్లు తీసి, బానలో పడేసాడు, తర్వాత ఎంతో ఆప్యాయంగా—

"పాపం భోజనం చేశావా? వెంటనే పట్టుకు రండిరా, రొట్టె, దానితోపాటు తిన టానికి ఏదైనా ఏమిటీ? నీకు అక్కర్లేదా? సరేలే, కుక్కలకు పారెయ్! నేను నీకు ఇవ్వటంతోనే నా బాధ్యత తీరిపోయింది." అని అతనికి ఆహారం తెచ్చిపెట్టమని చెప్పి, గుర్రమెక్కి బస్తీదారి పట్టాడు. అతని పోకడ వాలకం చూస్తే, హడావుడిగా పిచ్చి ఆస్పత్రికి పోయేవాడిలాగా వున్నాడు

బస్తీలో ప్లీడరుగారి వాకిట్లో పడిగాపులు కాయకుండా, వెంటనే ఆయనతో మాట్లాడే అవకాశం చిక్కింది కాని జరిగిన సంగతి చెప్పినమీదట ఆప్లీడరుగారు కడుపుబ్బనవ్వుతూ వుంటే, అదంతా అయిపోయేదాకా చాలా సేపు, చూస్తూ వుండిపోవలసి వచ్చింది

"క్షమించండి ఇందులో నవ్వవలసిన అంశమేమో నాకు కానరావటంలేదు ఆ బాధ ఎరుగనివాళ్ళకు మీకు సరదాగానే వుంటుంది. కాని ఆ బాన నాది."అన్నాడు కోపంగా లల్లా.

ప్లీడరు ఇంకా నవ్వుతూనే వున్నాడు. తర్వాత "ఏమిటీ ఎలాజరిగిందీ. ..ఆఁ ఆఁ .." అని మళ్ళీ మళ్ళీ వేళాకోళం కోసం చెప్పించుకోసాగాడు.

"హాఁహాఁ....లోపలా?అంటే తనకుతానే లోపల బిగించుకున్నాడనమాట! అహాఁ.... మరి లల్లాగారు ఏంచేద్దామనుకున్నారు? వాణ్ని అక్కడే అట్టేపెడదామనుకున్నారు? . హాఁహాఁ . ఆ బాన పగులకుండా వుండేందుకు అలాగే వుంచుదామనా? హాఁహాఁహా!"

"మూడోవంతా? అంటే రెండురూపాయ లన్నమాట!"

"ఇంకా తక్కువే కావచ్చు. కాని ఎక్కువ మాత్రం కాదు."

"సరే, అయితే నాకు ఆ రెండు రూపాయ లిస్తానని మాట యివ్వు."

లల్లా చెప్పేది తెలియనట్లుగా "ఏమిటీ?" అన్నాడు లికాసీ.

"నిన్ను బయటికి తీయటానికి గాను నేను బాన పగులగొడతాను. కాని దాని ఖరీదు, నీవు చెప్పినప్రకారం రెండు రూపాయలు, నీవు నాకు ఇచ్చుకోవాలని ప్లీడరు చెప్పాడు" అని లల్లా జవాబు.

"నేనా? డబ్బు చెల్లించటమా? అంతకంటె చివికి జీర్ణమైపోయినదాకా ఇందులోనే వుంటాను!" అని వెటకారంగా నవ్వుతూ చెప్పాడు లికాసీ.

ఆ ఇరుకులో సర్దుకొని, కొంచెం కష్టంమీద జేబులోంచి పొగగొట్టం తీసి ముట్టించి, బాన లోంచి పైకి పొగవదలటంమొదలెట్టాడులికాసీ.

లల్లా సణుగుకుంటూ అక్కడే నిలబడ్డాడు. అసలు లికాసీ ఆ బానలోనుంచి బైటికిపోనంటే ఏంచెయ్యాలి - అనే విషయం తనకుగానీ, ప్లీడరుకుగానీ తోచనేలేదు. ఇప్పుడు ఏమి చర్య తీసుకోవాలి? మళ్లీ గుర్రానికి జీను తగి లించమని చెప్పేటంత పర్యంతమై, ప్రొద్దు గుంక వచ్చినసంగతి గుర్తుకువచ్చిమానేసాడు.

"ఓహో అయితే నీవు నా బానలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటావన్నమాట. లికాసీ చెప్పింది విన్నారుగా మిమ్మల్ని అందర్నీ సాక్ష్యం వేసుకుంటాను డబ్బు చెల్లించవలసివస్తుందని, బానలోంచి బైటికి రావటానికి జీ-డీ మా ఒప్పుకోవటంలేదు. నేను బాన పగులగొట్టటానికి సిద్ధం! ఇదిగో అబ్బాయ్ నీవు ఆ బానలోనే ఉండాలని పట్టుపడు తున్నావు కనుక, అక్రమంగా నా బానను ఆక్ర మించుకొన్నందుకు, న్యాయంగా దాన్ని నేను వినియోగించుకోకుండా ఆటంకపరచినందుకు, రేపునీమీదచర్యతీసుకుంటాను,"అన్నాడులల్లా.

లికాసీ మళ్లీ ఒక పొగ మేఘం వదలి, ప్రశాంతంగా జవాబు చెప్పాడు:

"అదికాదండీ, మిమ్మల్ని ఆటంకపరచా లనే వుద్దేశ్యం నాకు లేనేలేదు. నాకిష్టమై ఇందులో ఉన్నాననుకొంటున్నారా ఏమిటి? నన్ను బైటికి తీయండి. సంతోషంగా వెళ్లి పోతాను. అయ్యో, డబ్బు చెల్లించటమంటే మాత్రం అది నావల్ల కాదు."

లల్లాకు తక్షణం కోపం వచ్చేసింది. ఆ బానను ఒక్క తన్ను తన్నుదామని ముందుకు దూకి, అంతలో తమాయించుకున్నాడు. పరుష స్వరంతో గొణుగుకుంటూ, ఆ బానను పట్టు కొని అటూ ఇటూ కుదిపివేశాడు.

"చూసావా, ఎంత మంచి సిమెంటో?" అన్నాడు లోపలినుంచి లికాసీ.

"వెధవా! ఎవరిదిరా తప్పు - నీదా, నాదా? నన్ను దానిఖరీదివ్వమంటావు!అంతేనా? తిండి లేకుండా అందులోనే చావు! చూద్దాం. ఎవరు గెలుస్తారో! అని లల్లా గద్దించాడు.

కాని అతనుప్రొద్దున బానలో పడేసినమూడు రూపాయలమాట మరచిపోయి, వెళ్లిపోయాడు. లికాసీ బానలో ఇరుకున్న సంఘటన కారణంగా పనిమనుషులందరూ అక్కడే వుండిపోయారు. కనుక ఆమూడురూపాయలూ వాళ్లతో కలిసి జలసాగా ఖర్చుచేసి, ఆ రాత్రి ఆ ఆరుబయట హుషారుగా గడుపుదా మనుకున్నాడు లికాసీ. అందుకు కావలసిన తినుబండారాలు వగైరా కొనటానికి ఆ పని వాళ్ళలో ఒకడు బజారుకు వెళ్లాడు. పండు వెన్నెల పట్టపగలులాగా వుంది. వాళ్ల విలాస వినోదాలకు అద్భుతంగావుంది ఆ రాత్రి.

చాలా షేపు గడిచిపోయింది. ఓ పెద్దధ్వని పుట్టి, లల్లాకు మెలకువ వచ్చింది. మేడమీది నుంచి చూసాడు. ఇంటిముందు ఆ వెన్నెల వెలుగుల్లో, అంతా తాగి తందనాలాడుతూ వున్న తన మనుషులు దాయ్యాలగుంపుల్లాగా కనుపించారు. లికాసీ బానలోంచి సంగీతం పాడుతున్నాడు. పనివాళ్లు చేతులుచేతులు పట్టు

కొని బానచుట్టూ తిరుగుతూ నృత్యం చేస్తున్నారు.

ఈసారి లల్లా ఓర్పుకు మితిమీరిపోయింది. పిచ్చెత్తిన ఆంబోతులాగా అక్కడికి వెళ్ళి పడ్డాడు. వాళ్లు అతనికి అడ్డు వచ్చేలోగా వెంటనే ఆ బానను ఒక్క తన్ను తన్నాడు. అది ఏటవాలుగా వున్న ఆ నేలమీద దొర్లుకుంటూ పోతున్నది. ఆ తప్పతాగివున్న జనం అది దొర్లటంచూసి ఆనందిస్తున్నారు. పోయి పోయి ఆ బాన ఆలివ్ చెట్టుకు కొట్టుకొని ముక్కలు ముక్కలై పోయింది. అంత లికాసీ ఆ వ్యవహారంలోంచి గెలిచి బయట పడ్డాడు.

★

మనవి

రచయితలు, చిత్రకారులు తమ తమ రచనలను, చిత్రములను ప్రతి నెల 10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
గ్రంథసమీక్ష కోరువారు రెండేసి ప్రతులను పంపవలెను.

సంపాదకులు, నవభారతి

శృంగారము : పూర్వలాక్షణికులు

కీ. శే. శ్రీ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు, ఎం. ఏ.

3

"యత్ర పునరుత్తమ పురుషచరితం
నని బధ్యతే తత్కావ్యం పరిత్యాజ్య మేవ"
ప్రతాపరుద్రీయే.[1]

ఇదివఱకుఁ బ్రకటింపఁబడిన రెండు లేఖలలో శృంగార ప్రబంధములను గుఱించిన యిద్దఱు పూర్వలాక్షణికుల యభిప్రాయములు వర్ణింపఁబడినవి. సంస్కృతమునందు నలంకార లక్షణ గ్రంథముల వ్రాసినవారు లెక్కకు మించి యున్నారు. వారిలో ఖ్యాతిఁజెందిన వారినైన విడఁదీసి యొక్కొక్కరి యభిప్రాయ మొక్కొక లేఖయందుఁ బొందుపఱిచెదమన్నను పదిపం డ్రెండు వ్యాసముల వ్రాసి, చర్వితచర్వణముఁ జేసి చదువరులకు విసువు పుట్టునట్లు చేయవలసి వచ్చును. కావున నట్లుచేయక మిక్కిలి విఖ్యాతిఁ జెందిన ముగ్గురు నల్గురు లాక్షణిక శిరోమణుల ముఖ్యాభిప్రాయము నీ వ్యాసమునందుఁ దెల్పి యీ శృంగార లేఖమాల ముగింపఁ దలఁచినాఁడను.

ముగ్గురు లాక్షణికులు

ఈ వ్యాసమునందు నేను ఉదాహరింపఁ దలఁచిన లాక్షణికులలో ముఖ్యులు ముగ్గురు, మమ్మటుఁడు, క్షేమేంద్రుడు, విద్యానాథుఁడు. మమ్మటాచార్యులవారు కాశ్మీర దేశస్థుఁడు. "కావ్యప్రకాశ" మను లక్షణగ్రంథమును రచించి మహాలాక్షణికుఁడని పేరు వడసెను. ఇతఁడు పదునొకండవ శతాబ్దాంతమునం దుండెనని చెప్పవచ్చును.[2]

ఈ లక్షణగ్రంథ రాజము పుట్టిన తరువాత నేటివఱకు నెనిమిదివందల సంవత్సరములలో నెన్ని లక్షణగ్రంథములు నిర్మింపఁబడినవో వాని కన్నిటికిని ఈ గ్రంథమే మూలాధారమని చెప్పవలసియున్నది. గ్రంథకర్త కాశ్మీరదేశస్థుఁడైనను ఈ గ్రంథము తన యోగ్యతను బట్టి హిందూదేశమునం దంతటను త్వరలోనే వ్యాపించినది. పదునాల్గవ శతాబ్దమునందు నాంధ్ర దేశమునందుండిన విద్యానాథుఁడు గూడ దీనిని ఉపయోగించినాఁడు. ఈ గ్రంథముపై నేటివఱకు రమారమి నూఱు టీకాగ్రంథములు (అనఁగా వ్యాఖ్యానములు) పుట్టినవని చెప్పిన దీని యోగ్యత వేఱుగఁ జెప్పవలెనా?

క్షేమేంద్రుఁడు కూడ కాశ్మీర దేశస్థుఁడు. పదునొకండవ శతాబ్దము వాఁడయి యుండనోపు. ఇతఁడు మునిమత మీమాంస, లావణ్యవతి, నీతిలత, బౌద్ధావదా కల్పలత మొదలయిన కావ్యములను రచించుటయేగాక "సువృత్తతిలకము", "ఔచిత్యవిచార చర్చ" యను రెండు లక్షణగ్రంథములను రచించియున్నాఁడు. ప్రస్తుతము మనకుఁ గావలసినది "ఔచిత్య విచార చర్చ" యను గ్రంథము. ఈ గ్రంథమునందీ మహాలక్షణవేత్త కావ్యములందు నెట్టివి యోగ్యమైన వర్ణనములో, యెట్టివి అయోగ్యమైనవియో లక్ష్య లక్షణ పూర్వకముగా వివరించియున్నాఁడు. మహాకవుల గ్రంథములలో నుండి దోషములను జూపుటయే గాక నిష్పక్షపాత బుద్ధితోఁ దన కావ్యములయందలి దోషములను గూడఁ జూపియున్నాఁడు.

విద్యానాథుఁడు తెలుఁగుదేశము వాఁడు. ఓరుగంటి ద్వితీయ ప్రతాపరుద్రుని యాస్థాన కవీశ్వరుఁడు. ప్రతాపరుద్ర యశోభూషణ మను నామాంతరముగల ప్రతాపరుద్రీయ మను లక్షణగ్రంథమును నిర్మించినవాఁడు. పదునాల్గవ శతాబ్దమునందుండిన వాఁడు

---

1 ఏ కావ్యమునందుఁ నుత్తమపురుష చరిత్రము వర్ణింపబడియుండదో యట్టి కావ్యము పరిత్యాజ్యమే.
—ప్రతాపరుద్రీయము.

2 "వయంతు ఖ్రుస్తాబ్దానామేకాదశ శతకస్య (సన్న ౧౧౦౦)చరమభాగే మమ్మటేన కావ్య ప్రకాశో నిరమాయీతి నిశ్చినుమః" ఇతి భట్టవామనాచార్యః **Vide Preface P 5 of the 2nd Edition of The Kavyaprakasa published by the Government of Bombay.**

కావ్యప్రయోజనము

మానవుల కర్తవ్యాకర్తవ్యములను, అనఁగాఁ జేయందగిన పనియేదియో చేయఁదగని పని యేదియో దానిని లోకులకు బోధించుట కావ్యముయొక్క ప్రయోజనమై యున్నది. నీతిబోధ చేయుట కావ్యముయొక్క యొకపని. ఈ పని వేదపురాణాదులు చేయుచుండఁగఁ గావ్యములేల చేయవలయు నని సంశయము కలుగవచ్చును. అందుకు- వేదములు ప్రభువుల వలె దండించి చెప్పును. పురాణాదులు స్నేహితులవలె బోధించును. కావ్యము భార్యవలె మనుజుని వశపఱుచుకొని 'రామునివలె వర్తింప వలెను. రావణునివలె వర్తింపఁగూడదు" అని బోధించి మెప్పించి యొప్పించును- అని లాక్షణికుల సిద్ధాంతము.[3] ఇట్లు కావ్యబోధ లోకులకు వేదాది బోధలకంటె నెక్కుడు ప్రియముగ నుండును.[4] కావ్యప్రకాశమునకుఁ 'బాలబోధిని' యను టీక వ్రాసిన భట్టవామనాచార్యుల వారిందున గురించి యిట్లు వ్రాసినారు. "పురుషుఁడు గురుమిత్రాది స్వాధీనుఁడుగా నుండినను, వాని భార్య యితర జనులకు సాధ్యముగాని కటాక్షభ్రూవిక్షేపాదుల వలనఁ బ్రేమను పుట్టించి వానిని ఎట్లు వశపఱుచుకొనునో, యట్లే కావ్యముఁగూడ సుకుమారమతులును, సుఖస్వభావులును నీతిశాస్త్రమెఱుఁగనివారును అయిన రాజకుమారాదులకు, తీపి పెట్టి చేదుమందు త్రాగించినట్లు, చక్కని పదరచనచే వర్ణింపబడిన శృంగారాది రసముల మూలమున సదుపదేశామృతమును ద్రావించి సత్ప్రవర్తనపరులను చేయును."[5] ఇంతియ కాదు. సత్కావ్యమును చక్కఁగ సేవించిన యెడల (అభ్యసించిన యెడల) బుద్ధిహీనులకుఁ గూడ సులభముగ చతుర్వర్గ ఫలప్రాప్తియుఁ గలుగఁగలదని సాహిత్యదర్పణకారుఁడు వ్రాసియున్నాఁడు[6] ధర్మార్థ కామమోక్షము లనఁబడు చతుర్వర్గములను వేదశాస్త్రాభ్యాసము వలన సంపాదించెద మన్నయెడల వేదాదికములు నీరసములు గనుకను కఠినములు గనుకను అవి మేధావంతులకుఁగాని సాధ్యములు కావు. వారికిని కష్టపడినఁగాని సాధ్యములు గావు. సుకుమారబుద్ధి గల వారుఁగూడ పరమానంద పరంపరల ననుభవించుచు సౌఖ్యముగఁ జతుర్వర్గమును సాధింపఁగలుగుట కావ్యమువలననే. అట్లయిన మేధావంతులు వేదశాస్త్రములుండఁ గావ్యముల నభ్యసింపఁ గూడదని చెప్పఁ గూడదు. ఏలయన చేదుమందువలన బాగగు రోగము శర్కరవలన బాగగునేని రోగి తెల్ల చక్కెరఁ గోరుటతప్పా?[7]

---

3. ప్రభుసమ్మిత శబ్దప్రధాన వేదాదిశాస్త్రేభ్యః సుహృత్సమ్మితార్థతాత్పర్యవత్పురాణాదీతిహాసేభ్య శ్చ ... విలక్షణంయత్ కావ్యం...తత్ కాంతేవ సరసతాపాదనేనాఽభిముఖీకృత్య రామాది వద్వర్తితవ్యం నరావణాది వదిత్యుపదేశంచ యథాయోగం కవేః సహృదయస్య చకరోతి — కా. ప్ర. 1 వ ఉల్లాసము.

4. 'కావ్యాత్కర్తవ్యతాధీస్సరసా, అన్యత్రనతథా' కాంతా సమ్మిత తయా యయా సరసతామాపాద్య కావ్య శ్రియా। కర్తవ్యే కుతుకీబుధో విరచిత స్తస్యై స్పృహాంకుర్మహే' ప్రతాప రుద్రీయము ౧ వ ప్రకరణము.

5. కా. ప్ర. టీక ౧3 వ పుట.

6. 'చతుర్వర్గ ఫలప్రాప్తి సుఖాదల్పధియామపి। కావ్యాదేవయతస్తేన తత్స్వరూపం నిరూప్యతే॥ చతుర్వర్గఫల ప్రాప్తిర్హి కావ్యతో రామాదివత్ ప్రవర్తితవ్యం నరావణాది వదిత్యాది కృత్యాకృత్య ప్రవృత్తి నివృత్త్యుపదేశ ద్వారేణసుప్రతీతైవ. ఉక్తంచ 'ధర్మార్థకామమోక్షేషు వైచక్షణ్యం కలాసుచ। కరోతికీర్తిం ప్రీతించ సాధుకావ్య నిషేవణ'మితి, సాహిత్యదర్పణము ౨వ పుట.

7. చతుర్వర్గప్రాప్తిర్హి వేదశాస్త్రేభ్యో నీరసతయా దుఃఖాదేవ పరిణతబుద్ధీనా మేవ జాయతే। పరమానంద సందోహజనకతయా సుఖాదేవ సుకుమార బుద్ధీనా మపి ఫలః కావ్యాదేవ। నచుతర్హి పరిణతబుద్ధిభిః సత్సువేద శాస్త్రేషు కావ్యేషు కిమితి యత్నః కరణీయ ఇత్యపి న వక్తవ్యం। కటుకౌషధోపశమనీయస్య రోగస్య సితశర్కరోప శమనీయత్వే కస్యవారోగిణః సితశర్కరా ప్రవృత్తిః సాధీయసీనస్యాత్ —సాహిత్యదర్పణం ౯వ పుట.

సత్కావ్యము: అసత్కావ్యము

ఇట్లు పామరజనులకుఁగూడ సుబోధచేసి వారిని సన్మార్గమునకుఁ ద్రిప్పు సామర్థ్యంబును అధికారంబును కావ్యంబునకే గలిగి యున్నందున, కావ్యములు రచించువారు సత్కావ్యములను రచింపవలసినదే గాని, యసత్కావ్యములను వ్రాయఁగూడదనుట స్పష్టము. సత్కావ్యములఁ జదివి జనులు బాగుపడుదురు. అసత్కావ్యములఁ జదివి చెడిపోవుదురు. మనుజులను సన్మార్గమునకుఁ ద్రిప్పుశక్తి సత్కావ్యమునకుఁ గలదేని, వారు దుర్మార్గగాములగునట్లు చేయు సామర్థ్యము దుష్టకావ్యములయందుండుననుట స్వభావసిద్ధము కావుననే అసత్కావ్యాలాపములను వర్జింప వలసిన దని శాస్త్రము చెప్పుచున్నది.[8] అయోగ్యుఁడైన పురుషుని నాయకునిగా గ్రహించినను, అనుచితములయిన వర్ణనములను చేసినను అసత్కావ్యమగును. మొదట నాయకుని గురించి విచారించి, తరువాత వర్ణనములను గురించి విచారింతము.

కావ్యనాయకుడు

సత్కావ్యముల నాయకుఁడు సజ్జనుఁడుగ నుండవలయును. దుర్మార్గ ప్రవర్తనగల వారిని వ్యభిచారులను, అనీతి మార్గావలంబకులను నాయకులుగాఁ గైకొని కావ్యవర్ణనలు చేయఁగూడదనుట యందఱకు సమ్మతమైన విషయమే. అనుకరణీయ చారిత్రముఁగల పుణ్యశ్లోకులే కావ్యనాయకులుగ నుండఁదగుదురు. తదితరులు ప్రతి నాయకులుగా నుండినను నుండుదురేమో కాని నాయకులుగ నెన్నడును ఉండఁ జాలరు ఇందుగురించి శ్రీ విద్యానాథ కవీంద్రుఁడు ప్రతాపరుద్రీయమునందు నాటక ప్రకరణములో నిట్లు చెప్పియున్నాఁడు. కావ్యమునకు ముఖ్యవిషయమైన నాయకుని గుణ నిరూపణమే యాకావ్యము యొక్కయుఁ గవి యొక్కయుఁ గీర్తి ప్రతిష్టలకు మూలమైయుండును.

ఎట్లన రామాయణమునకును వాల్మీకుల వారికిని గలిగిన మహాప్రతిష్ఠకు రామ గుణ వర్ణనమే కారణము. మహాపురుష వర్ణనము వలననే ప్రబంధములు శ్రేయోదాయకములగును. వేద శాస్త్ర పురాణాదుల వలన నెట్లు హిత ప్రాప్తియు, నహితనివృత్తియుఁ గలుగునో యట్లే సజ్జనుం డగునాయకుని నాశ్రయించి వ్రాయఁబడిన కావ్యములవలనఁ గలుగును. ఇందొక విశేషము వేదాదికములవలనఁ గర్తవ్యతా బోధగలుగుటకష్టసాధ్యము. కావ్యములవలననది సరసముగఁ గల్గును. సుపురుషచరితముగల కావ్యాలాపముల వలన విజ్ఞానమభివృద్ధిఁ జెందును, యశస్సుగల్గును. గుణములు వికాసముఁ జెందును. ఏకావ్యమునందు నుత్తమ పురుషగుణములు వర్ణింపఁబడియుండవో యాకావ్యమును బరిత్యజింపవలయును.[9]

ఉత్తమ పురుషనాయకత్వమున గౌరవము కలుగుట యనునది యొక్క కావ్యమునకే గాదు. శాస్త్రములకుఁ గూడ సదాశ్రయత్వమువలననే మహత్తర మైన లోకాదరము కలిగినది. వైశేషికాదిశాస్త్రము లీశ్వర ప్రతిష్ఠాపకత వలన జగ

---

8. రఘువంశమునకు టీక వ్రాయుచు మల్లినాథుఁడు "కావ్యాలాపాంశ్చ వర్జయేత్, ఇత్యస్యనిషేధశాస్త్రస్య అసత్కావ్య విషయతాం పశ్యన్" అని వ్రాసియున్నాఁడు.

9. ప్రబంధానాం ప్రబంధృణామపి కీర్తిప్రతిష్ఠయోః మూలం విషయభూతస్య నేతుర్గుణ నిరూపణమ్॥ వాక్యం॥ యథారామగుణవర్ణనం రామాయణవల్మీక జన్మనోర్మహా ప్రతిష్ఠాకారణం॥ తథా మహాపురుషవర్ణనేన హి శ్రేయస్కరీ ప్రబంధస్థితిః॥ యథా వేదశాస్త్ర పురాణాదేర్హి తప్రాప్తి రహిత నివృత్తిశ్చ తథా సదాశ్రయాత్కావ్యాదపి॥ ఇయాన్విశేషః- కావ్యాత్కర్తవ్యతాధీస్సరసాన్యత్ర నతథా॥ నాయక ప్రకరణమ్...పరివర్ధతే విజ్ఞానం సంభావ్యతే యశో విసర్పంతిగుణాః॥ శ్రూయతే సుపురుషచరితం కింతద్యేన నహరంతి కావ్యాలాపాః॥ యత్రపునరుత్తమ పురుషచరితం ననిబధ్యతే తత్కావ్యం పరిత్యాజ్యమేవ.

త్పూజ్యత్వమును జెందినవి. మహాభారతాది గ్రంథములకుఁగూడ మహాపురుష వర్ణనమువలననే విశ్వాతిశాయిత్వము ప్రాప్తించినది. వేయేల? ఉపనిషత్తులుగూడ బ్రహ్మను ప్రతిపాదించి నందువలననే పరమోత్కర్షతను జెందినవి. పూర్వమీమాంసకర్తయైన జైమిని మహర్షి కూడ 'అథాతో ధర్మజిజ్ఞాసా' యను సూత్రముతో గ్రంథము ప్రారంభించి పురుషాశ్రిత గుణధర్మముల జిజ్ఞాసాద్వారమున మహాపురుష గుణవర్ణనమే శాస్త్రమునకుఁ బ్రాణమని యొప్పుకొనియె. వేఱువేఱు శాస్త్రములఁ బ్రతిపాదించు గ్రంథములలో మహాపురుష గుణవర్ణనముండుట బంగారమునకు దావి యబ్బినట్లు.[10]

ఇట్లు విద్యానాథుడు కావ్యనాయకునిగుఱించి తన యభిప్రాయముఁ దెల్పి పూర్వులయిన యాలంకారికులుగూడ నిట్లే శాసించిరని చెప్పి, దండి, భామహ, ఉద్భట, రుద్రట, భోజరాజాది లక్షణవేత్తల యభిప్రాయములను ఉదాహరించి యున్నాఁడు. వాని నన్నిఁటిని నిచ్చట ననువాదించి చదువరులకు విసుగుపుట్టించుట నా యభిప్రాయము కాదు. యోగ్యుఁడైన నాయకునిఁ గావ్యమునందు వర్ణింపవలసినదే గాని అయోగ్యుని వర్ణింపగూడదనియే వారి యందఱి యభిప్రాయమని చెప్పినఁజాలును. కావున నాయకుఁ డనుకరణీయుఁడుగా నుండవలయును. యశఃప్రతాప శోభితుఁడును, ధర్మార్థకామతత్పరుఁడును, దురంధరుఁడును, గుణాఢ్యుఁడును అయినవాఁడే నాయకుఁడుగా నుండవలయునని ప్రాచీనుల సిద్ధాంతమని మనము తెలిసికొనవలయును.[11]

కావ్యబోధలు

ఇప్పుడు చెప్పునది కావ్యములోని వర్ణనలను గుఱించికాదు. కావ్యములోఁ జెప్పబడినబోధను గుఱించి. చదువరులు కావ్యపాఠము వలన నీతిని నేర్చుకొని బాగుపడుటగాని, అనీతిని నేర్చుకొని చెడిపోవుటగాని సంభవించును. కనుక కావ్యములలోఁ జేయఁబడు బోధలును, ప్రతిపాదింపఁబడు సిద్ధాంతములును సత్యమునకు, తత్త్వమునకు, నీతికి, వ్యతిరేకముగా నుండఁగూడదని యాలంకారికుల సిద్ధాంతము. వ్యభిచారము చేసినందున దోషములేదనిగాని, దొంగతనము చేయుట మంచిపని యనిగాని, విద్యనభ్యసించుట యనావశ్యకమనిగాని అపసిద్ధాంతములఁ బ్రతిపాదించెడి కావ్యము లసత్కావ్యము లేయని చెప్పవలసియున్నది. క్షేమేంద్రకవి తన 'ఔచిత్యవిచారచర్చ' అను లక్షణగ్రంథమునందు దీనికిఁ దత్త్వౌచిత్యమని పేరుపెట్టి యిట్లు వర్ణించియున్నాఁడు:

శ్లో॥ కావ్యం హృదయసంపాది
సత్యప్రత్యయనిశ్చయాత్।
తత్త్వోచితాభిధానేన
యాత్యుపాదేయతాం కవేః॥

అర్థము: "తత్వము ననఁగా శాస్త్రయాథార్థ్యోచితమైనదానిని బోధించు కవియొక్క కావ్యము. చదువరులకు నమ్మఁదగిన సత్యానుభవము గలిగించి. హృదయానందముఁ బుట్టించి, మన్నన వడయును" అట్లు తత్త్వమును బోధింపక యసత్యమును బోధించు కావ్యములు అనౌచిత్యప్రవర్తకములనియు నగౌరవనీయములనియుఁ దాత్పర్యము.

---

10. నకేవలం కావ్యస్యాయం పంథాః। కింతుశాస్త్రజాతస్యాపి సదాశ్రయత్వేన మహాన్ లోకాదరః॥ తథా వైశేషికాదేరీశ్వర ప్రతిష్ఠాపకతయా జగత్పూజ్యతా॥ తథా మహాభారతాదీనామపి మహాపురుషవర్ణన పరతయైవ విశ్వాతిశాయిత్వం। కింబహునా వేదాంతా అపి బ్రహ్మప్రతిపాదకతయా పరముత్కృష్యంతే॥ అథాతో ధర్మజిజ్ఞాసేత్యుపక్రమమాణేన సూత్రకృతా మహర్షిణాపి పురుషాశ్రితస్య గుణస్య ధర్మస్య జిజ్ఞాసాద్వారేణ మహాపురుష గుణవర్ణనమేవ శాస్త్రస్య ప్రాణః ఇత్యురరీకృతం॥ తత్తన్న్యాయ నిరూపణ పరస్యాపి ప్రబంధరాశేర్మహాపురుషగుణ వర్ణనం హేమ్నః పరమామోదః॥ నాయక ప్రకరణమ్.

11. యశః ప్రతాప సుభగో ధర్మ కామార్థతత్పరః। ధురంధరో గుణాఢ్యశ్చ నాయకః పరికీర్తితః॥ ప్రతాపరుద్రీయే, నాయక ప్రకరణమ్.

ఈలాగు తత్త్వౌచిత్యమునకు లక్షణముం జెప్పి, తత్త్వముకానిది దోషమని చూపుటకు మాఘకావ్యమునందలి యీక్రింది పద్యమును చూపియున్నాఁడు:

బుభుక్షితై ర్వ్యాకరణం నభుజ్యతే
నపీయతే కావ్యరసః పిపాసితైః ।
నవిద్యయా కేనచి దుద్ధృతం కులం
హిరణ్యమేవార్జయ నిష్ఫలాః కలాః ॥

అర్థము: వ్యాకరణమును భక్షించిన యెడల నాకలి చల్లారదు. కావ్యరసముం ద్రావిన దప్పితీరదు. విద్యచేఁ గొని కులమును ఉద్ధరించినవారు లేరు. కావున బంగారమే సంపాదింపుము. కళలు నిష్ఫలములు.

తత్త్వానౌచిత్యమునకు నుదాహరణముగా నీశ్లోకము వ్రాసి గ్రంథకారుఁ డందున గుఱించి తన మతా ఇట్లు వ్రాసియున్నాఁడు: 12

"ఇట్టి అనౌచిత్యంబును తత్త్వవిరహితంబును అయిన విపరీత సిద్ధాంతముఁ జెప్పుటకుఁ గారణము దారిద్ర్యదోషముచే ధైర్యము లోపించుటయే. సకలసంపత్తులను బ్రసవించునట్టియుఁ గులంబుల నుద్ధరించునట్టియు సామర్థ్యము విద్యకే గలదు." కావున నిది విపరీత సిద్ధాంతమని భావము.

ఒకానొకప్పుడు పాత్రోచితముగా విపరీత సిద్ధాంతములను చెప్పింపవలసి వచ్చినను, అవి విపరీత సిద్ధాంతములనియు, అననుకరణీయములనియుఁ జదువరులకుఁ దోఁచునట్లుగా వర్ణింపవలయునేగాని, కవియొక్క యభిప్రాయానుసారముగా నాసిద్ధాంతము చెప్పఁబడిన దన్నట్లు వర్ణింపఁగూడదు.

సంభోగ శృంగారము

స్త్రీ పురుషుల సురత ప్రసంగముల జరిపినట్లు వర్ణించుటయే సంభోగ శృంగారమని కొందఱు భ్రమపడుచున్నట్లు కావవచ్చుచున్నది. అందుచే సంభోగ శృంగార మన్న చోట నెల్ల సురతవర్ణనము లిష్టమువచ్చినట్లు చేయవచ్చునని వీరు వాదించుచున్నారు. ఇంతియకాదు. విపరీత రతిఁగూడ వర్ణించినఁగాని రసము పూర్తిగాదని గూడఁ జెప్పువారుఁ గలరు. కాని యిది వట్టి కల్పితము. లక్షణ గ్రంథములను చక్కఁగఁ బరిశీలించి చూడనందునను, "సంభోగ" శబ్దమునకుఁగల రెండర్థముల వలనను గలిగిన భ్రమ.

శృంగారము ద్వివిధము- సంభోగ శృంగారము, విప్రలంభ శృంగారము. సంభోగ శృంగారమునకే సంయోగ శృంగార మని నామాంతరము గలదు. ఈ భేదములను రసగంగాధరకారుఁడిట్లు వర్ణించియున్నాఁడు.

"శృంగారము రెండువిధములు-సంయోగము (సంభోగము), విప్రలంభము. నాయికా నాయకుల ప్రేమ యెంతకాలము వఱకు సంయోగము జెంది (కలసి)యుండునో యంతవఱకు సంయోగము (సంభోగము). ఆ ప్రేమ యెంతకాలము వఱకు వియోగముఁ జెంది (కలియక)యుండునో యంత వఱకు విప్రలంభము. సంయోగ (సంభోగ) మనఁగా దంపతు లొకమంచము మీఁద నుండుటకాదు. ఎందుచేత ననఁగా దంపతు లొక్క తల్పముమీఁద బండియుండినను ఈర్ష్యాది భావము లున్నయెడల నది విప్రలంభ శృంగారమేగాని సంభోగ శృంగారము కాదని చెప్పఁబడియున్నది. ఒక మంచముమీఁద నుండకపోవుటయే వియోగము కాదు. ఎందుచేతననఁగా నొక మంచముమీఁద దంపతు లుండక పోయినను ఈర్ష్యాది భావములు లేనియెడల నది సంభోగ శృంగారమే కాని విప్రలంభము కాదని చెప్పఁబడియున్నది. కావున నీ సంయోగ వియోగాఖ్యలు అంతఃకరణ వృత్తివిశేషములు. నేను సంయుక్తుఁడను వియుక్తుఁడను అనిన తలంపు. 13

ఇట్లు ఏకతల్పశయనము సంభోగ శృంగారమునకు ననావశ్యకము. ఏకతల్పగతులయిన

12. సర్వమే తద్దారిద్ర్య దైన్య విద్రుత ధైర్య కాతరతయా తత్త్వ విరహితం విపరీత ముపన్యస్త మనౌచిత్యం సుయుక్తమేవ। విద్యానామేవ సర్వసంపత్ప్రసవినీనాం కులోద్ధరణ క్షమత్వం నాన్యస్య.

13. తత్ర శృంగారోద్వివిధః సంయోగో విప్రలంభశ్చ। రతేః సంయోగ కాలావచ్ఛిన్నత్వే ప్రథమః। వియోగ కాలావచ్ఛిన్నత్వే ద్వితీయః। సంయోగశ్చ న దంపత్యోః

దంపతుల మనస్థితి ననుసరించి వర్ణనము విప్రలంభము కావచ్చును. అట్లే యేకతల్ప శయనము లేనివారి గుఱించి చేయఁబడిన వర్ణన సంభోగ శృంగారము కావచ్చును. కావున సంభోగ శృంగారమునకు సురతవర్ణన మావశ్యకమని చెప్పుట తప్పు. సంభోగ శృంగారరస వర్ణనమునకుఁ గాళిదాసకృత శాకుంతల నాటకమున కంటె మించిన లక్ష్యముండదు కదా? అందు సంభోగ శృంగారమును, విప్రలంభ శృంగారమును వర్ణింపఁబడి యున్నవి. సంభోగ శృంగారరసము శాకుంతల నాటకమునందు "అంగి" (పోషింపఁబడిన ముఖ్యరసమనియు) ఇతరరసములు 'అంగము' లనియు టీకాకారులు స్పష్టముగా వ్రాసియున్నారు. కాని అందు సురతవర్ణన మెందయినను కలదా? తుదకు ముద్దుపెట్టుకొనుట, కౌగిలించుకొనుట యైనను వర్ణింపఁబడినవా? లేదు. ఈ వర్ణనములు లేనందున నా కావ్యమునకు నేమైన లోపము వచ్చినదా? నాటకము దృశ్యకావ్యమైనందున నిట్టివర్ణనలు చేయలేదు- అని కొందఱు చెప్పుదురేమో! ఇదిమాకు నిష్టాపత్తియే. కాని యిప్పుడు చర్చింపఁబడుచున్న ప్రశ్న మదిగాదు. నాటకాదులలో సురత వర్ణనలు చేయఁగూడదన్నందున వానికేమైన లోపము కలిగినదా? యన్న ప్రశ్న ముఖ్యము. సురతవర్ణనలు గల యితర కావ్యములకంటె నట్టి వర్ణనలు లేని శాకుంతలనాటకము యోగ్యత తజ్జ్ఞులచే నేమైన దగ్గింపఁబడినదా? తగ్గింపఁబడుటకు మాఱుగా నెక్కింపఁబడినదనియే చెప్పవలెను. "కావ్యేషు నాటకం రమ్యం తత్ర రమ్యా శకుంతలా" యన్న శ్లోకము శాకుంతలము పుట్టిననాటి నుండియు నీ భరతఖండంబున నంతటను ఢంకాధ్వనిగా మ్రోయుటయే గాక, క్రిందటి శతాబ్దారంభమునుండి పాశ్చాత్య ఖండంబునందును ప్రతిధ్వని నీనుచున్నది! సురతవర్ణనము లేకయే సంభోగ శృంగారరస ప్రధానమైన యుత్తమోత్తమ • కావ్యము వ్రాయుటకు వీలున్నప్పుడు మఱి సురత వర్ణనము కావ్యములలో నుండవలె నన్న వితండమేల?

సంభోగ శృంగార మనంత భేదములు గలది యగుటచే దానిని విభజింపలేక యాలంకారికులు దానిని ఒక్కటేయని యనిరి. దంపతుల యొక్క పరస్పరదర్శనము, సంభాషణము, స్పర్శనము, చుంబనము, ఆలింగనము మొదలయినవి సంభోగ శృంగారముయొక్క భేదములనంతములు.[14] కావున స్త్రీ పురుషుల ప్రేమ కలిసి వారొకరిని మఱియొకరు చూచుకొనిరని వర్ణించినను అది సంభోగ శృంగారమే. పరస్పర సంభాషణము సల్పిరని వర్ణించినను, నది సంభోగ శృంగార వర్ణనయే! చుంబనాదులు సంభోగ శృంగారమే. సురతవర్ణనము ఒక విధమైన సంభోగవర్ణన మనుకొన్నను,[15] అది

సామానాధికరణ్యం। ఏకతల్పశయనే పీర్ష్యాది సద్భావే విప్రలంభస్యైవ వర్ణనాత్। ఏవం వియోగేపి న వైయధికరణ్యం। దోషస్యోక్తత్వాత్। (ఈర్ష్యాద్యభావే వైయధికరణ్యేపి సంభోగస్యైవ వర్ణనాదిత్యర్థః-ఇతి నాగోజీభట్టః) తస్మాద్భావిమౌ సంయోగ వియోగాఖ్యావంతఃకరణ వృత్తి విశేషౌ। యత్సంయుక్తో వియుక్తశ్చాస్మీతిధీః"। రసగంగాధరము — 38 వ పుట.

14. తత్రశృంగారస్యద్వౌభేదౌ। సంభోగో విప్రలంభశ్చ। తత్రాద్యః పరస్పరావలోకనాలింగనాధరపానపరిచుంబనాద్యనంత తత్త్వాదపరిచ్ఛేద్య ఏకఏవ గణ్యతే.

15. సురతవర్ణనయు సంభోగ శృంగారముయొక్క యొకభేదమని స్పష్టముగా [illegible] గ్రంథమునందును చెప్పఁబడి యుండలేదు. నేను ఇందును గుఱించి సాహిత్య సంబంధమైన యుద్గ్రంథములఁ బదిపండ్రెండింటిని జూచితిని. కావ్య ప్రకాశమువలెనే యున్న [illegible] సంభోగ శృంగారమును గుఱించి చెప్పునప్పుడు, 'ఆలోకనాలింగ నాధరపానాది' యని [illegible] కాని సురతమును స్పష్టముగాఁ జేర్కొనియుండలేదు. కాని కొందఱు 'ఆది' [illegible] 'సురతము' ఇమిడియున్న దందురేమో. అట్లనుట తప్పనియు, ఆదిపదమువలన సురతవర్ణన [illegible] వలయునని ఋజువుచేయు భారము ఆవాదము చేయు వారిమీదనున్నదనియు [illegible]. అయినను ఈ వ్యాసమునందు వాదసౌకర్యార్థమై, సురతవర్ణన యొక [illegible] సంభోగ వర్ణనయని గ్రహించినాఁడఁ గాని యది నా మతము కాదు.

సంభోగ శృంగారముయొక్క యనంత భేదములలో నొకభేదమని చెప్పవలసినదేగాని దానికంతకంటె నెక్కుడు యోగ్యతలేదు.

సురత వర్ణనము రహస్యేంద్రియములతో సంబంధించినది. ఇది జుగుప్సాకరము. రోఁతఁ బుట్టించును. వ్రీడాకరము. సిగ్గు లజ్జ కలుగునట్లు చేయును. చదువువారి మనస్సునందు ననీతికరము లయిన యూహలను పుట్టించును. ఇట్టి వ్రీడాకరవర్ణనము లేకయే శాకుంతలము వంటి యుత్తమోత్తమ శృంగార కావ్యముల రచింపవచ్చును. కావున సురతవర్ణనములును, అత్యంత రతివర్ణనలును సర్వథా పరిహరణీయములు.

ఇక సంభోగ శృంగారముయొక్క ముఖ్య భేదములయిన ఆలోకన, సంభాషణ, అధర పాన, పరిచుంబన, ఆలింగనము లనునవి యున్నవి. శృంగార కావ్యములందు వీనిని వర్ణించుట దోషముకాదు. కాని దీనికిని మర్యాద యుండవలయును. "అతి సర్వత్ర వర్జయేత్" అన్నమాట మఱచిపోఁగూడదు. అతియైన యెడల సరసమునకు బదులు విరసమే కలుగును. ఆలింగనము వర్ణించినప్పుడు నాయికానాయకుల బట్టలు తీసిపారవేసి కాలికిఁ గాలు, మోకాలికిఁ మోకాలు, తొడలకుఁ దొడలు, అంగమునకు నంగము, పొట్టకుఁ బొట్ట తగిలిన దని వర్ణించినయెడల నదిరసమగునా? రసభంగమగునా? చుంబనము వర్ణించిన దోషము లేదన్నంత మాత్రమున నొకకవి "అస్త్రీయొక్క చెక్కిళ్ళు ముద్దాడి ముద్దాడి, దంతములచేఁ గొరికి కొరికి వ్రణములఁ జేయఁగా నందుండి సవాసేరు రక్తము కారెను" అని వర్ణించిన హాస్యాస్పదముగా నుండదా? అట్లే కుచవర్ణనలు. కుచవర్ణనల యందు దోషమేమియును లేదు. కాని యదియును సరసముగ నుండవలయును. పయ్యెదను లాగివేసి, రవికను చించివేసి, సొరకాయలవలెనో, గుమ్మడిపండ్లవలెనో యున్నవని వర్ణించిన రసమూఢవారికి నూరు నేమో గాని, రసికులకు మాత్రము నీరసముగనే గానవచ్చును. రవివర్మ పటములలోఁ గుచములశోభ కనఁబడుటలేదా? రవికె యుండును. పయ్యెద యుండును. కుచముల యసామాన్య శోభయుఁ గానవచ్చుచుండును! అట్లే వర్ణన లుండవలయును. బట్టబయలుగ వర్ణింపబడిన సంభోగశృంగార మంతయు నీరసమే.

కవి ముఖ్యముగా దర్శన సంభాషణముల వలన సంభోగ శృంగారమును పోషింప వలయును. ఈ వర్ణనముల వలన నెట్టియుత్తమోత్తమ సాత్విక శృంగార రసమునైనను పోషించి ధ్వని ప్రధానములైన యుత్తమోత్తమ కావ్యములను రచింపవచ్చును. చుంబనాలింగ నాదికముల నెప్పుడో యరుదుగ వర్ణించి కావ్యమునకు మెఱుఁగు పెట్టినట్లు చేయవలయును.

సంభోగము సర్వథా పరిహరణీయము

మేము సంభోగ శృంగారమును కొంతవఱకు నైనను పైని ఒప్పుకొంటిమి. కాని పూర్వ లాక్షణికులు దీనిని కొన్ని విషయములలో సర్వథా వర్జింపవలసిన దని శాసించిరి. కావ్యప్రకాశకారుఁడైన మమ్మటాచార్యుల వారు "కింతురతిః సంభోగ శృంగారరూపా ఉత్తమ దేవతా విషయా న వర్ణనీయా, తద్వర్ణనం హి పిత్రోః సంభోగవర్ణన మివాత్యంత మనుచితమ్" (సప్తమోల్లాసే) అనిస్పష్టముగాఁ జెప్పియున్నాడు. 'సంభోగ శృంగార రూపమైన రతి (ప్రేమ) ఉత్తమ దేవతల విషయమై వర్ణింపఁ గూడదు. తలిదండ్రుల సంభోగమును వర్ణించుట యెంత అత్యంతానుచితమో యిదియు నంత యనుచితమే' అని దీనికర్థము.

క్షేమేంద్రుఁడీ విషయమునే యెత్తుకొని యిట్టి వర్ణనములు చేయుట ప్రబంధార్థానౌచిత్యమను దోషముగాఁ జెప్పినాఁడు. మొదట నతఁడు ప్రబంధార్థౌచిత్యమను గుణమును ఇట్లు వర్ణించినాఁడు:

శ్లో॥ ఉచితార్థ విశేషేణ
ప్రబంధార్థః ప్రకాశ్యతే
గుణ ప్రభావభవ్యేన
విభవేనేవ సజ్జనః॥

అర్థము :- సద్గుణ ప్రభావముచే శోభించునట్టి వైభవముచే సజ్జనుఁడెట్లు ప్రకాశించునో యట్లే యుచితమైన యర్థ విశేషముచే కావ్యము యొక్క అర్థము శోభించును.

ఇట్లు ఉచితమైన యర్థమునే వర్ణింపవలసిన దిగాని యనుచితార్థమును వర్ణింపవలదని శాసించి, యనుచితార్థమునకుఁ గుమారసంభవము నుండి ఈ క్రింది శ్లోకమును ఉదాహరించి యున్నాఁడు:

శ్లో॥ ఊరుమూల నఖ మార్గపంక్తిభిః
తత్‌క్షణం హృతవిలోచనో హరః
వాససః ప్రశిథిలస్య సంయమం
కుర్వతీం ప్రియతమామవారయత్

అర్థము :- (గంధమాదన పర్వతముమీద గాలి వీచిన సమయమునఁ జీర చెదరి గాన వచ్చిన) పార్వతీదేవి తొడమీఁది నఖ వ్రణ పంక్తులచే నాకర్షింపఁబడిన దృష్టిగలవాఁడై శివుఁడు, సడలిన వస్త్రమును బిగియఁగట్టఁ బోవుచున్న తన ప్రేయసిని నివారించెను.

పార్వతీ పరమేశ్వరులు గంధమాదన పర్వతము మీఁద విహరించు కాలమందలి సంభోగ శృంగార వర్ణనమిది. ఇందుపై క్షేమేంద్రుఁడు వ్రాసిన వ్రాత యిట్లున్నది

"అత్ర అంబికా సంభోగవర్ణనే పామర నారీసముచిత నిర్లజ్జ సజ్జ నఖరాజి విరాజి తోరు మూల హృతవిలోచనత్వం త్రిలోచనస్య భగవతః త్రిజగద్గురోః యదుక్తం తేన అనౌచిత్యమేవ పరం ప్రబంధార్థః పుష్ణాతి."

"ఇచ్చట అంబికా సంభోగవర్ణనమునందు పామరస్త్రీలకు మాత్రముఁ దగినట్టి తొడల మీఁది నఖక్షతముల వర్ణించుట చేతను, భగవంతుండును త్రిజగద్గురువును అయిన త్రిలోచనుని నేత్రము లిట్టివానిచే నాకర్షింపఁబడియె నని వర్ణించుట చేతను ప్రబంధార్థమునకు గొప్ప అనౌచిత్యదోషము సంభవించినది" యని పై సంస్కృత వాక్యముల కర్థము

దీనినిబట్టిచూడఁగా నుత్తమ ప్రకృతులను గుఱించి సంభోగ శృంగార వర్ణనము చేయఁ గూడదని లాక్షణికుల సిద్ధాంతమని స్పష్టపడు చున్నది.

దివ్యులకేనా ? అందఱికా ?

పైని స్థాపింపబడిన సిద్ధాంతము దేవతల కట్టుకేయనియు, ఇతరులకీ నియమము చెల్ల దనియుఁ గొందఱు వాదింపవచ్చును. ఆలంకారికులచే బ్రకృతులు (నాయికా నాయకులు) దివ్యులనియు, అదివ్యులనియు, దివ్యాదివ్యులనియు మూఁడు విధములుగ విభజింపఁబడినవని యిదివఱకే వ్రాసియున్నారము దివ్యులనఁగా నింద్రోపేంద్రాదులు, అదివ్యులనఁగా మానవులు నలహరిశ్చంద్రాదులు, దివ్యాదివ్యులనఁగా నవతార పురుషులు రామకృష్ణాదులు. ఇందొక్కొకరిలో ఉత్తమ, మధ్యమ, అధమ భేదంబులుగలవు. ఇట్లుధీరోదాత్తాది భేదంబులు గాక నాయకులు తొమ్మిది విధములవారు గలరు. వారెవరనిన 1 ఉత్తమ దివ్యులు, 2 ఉత్తమాదివ్యులు, 3 ఉత్తమదివ్యాదివ్యులు, 4. మధ్యమ దివ్యులు, 5. మధ్యమాదివ్యులు, 6 మధ్యమ దివ్యాదివ్యులు, 7 అధమదివ్యులు, 8 అధమాదివ్యులు, 9 అధమదివ్యాదివ్యులు. "వీరిలో నుత్తమ దివ్యులను గుఱించి మాత్రము సంభోగవర్ణనము కూడదు ఇతరులనుగుఱించి చేయవచ్చును. ఏలయన కావ్యప్రకాశ కారుఁడు "రతిః సంభోగ శృంగార రూపా ఉత్తమదేవతా విషయా న వర్ణనీయా" అని వ్రాసియున్నాఁడని కొందఱు వాదింప వచ్చును. కాని ఉత్తమ ప్రకృతులు ఎవరైనను దివ్యులయినను అదివ్యులయినను, దివ్యాదివ్యులయినను, వానినిగుఱించి సంభోగవర్ణనము చేయఁగూడదని పూర్వలాక్షణికుల సిద్ధాంతమని మాయభిప్రాయము.

దివ్యులను గుఱించి యభిప్రాయ భేదమే లేదు. దివ్యాదివ్యులను గుఱించియు లేదనియే చెప్పవచ్చును. దివ్యులకు నదివ్యులకు నేది యోగ్యమో యదియే దివ్యాదివ్యులను గుఱించి వర్ణింపవచ్చునని యాలంకారికుల సిద్ధాంతము. అందుచేతనే రాధా మాధవ విలాసములను సంభోగరూపమున వర్ణించినట్టి జయదేవుని యొక్క గీత గోవిందమునుగూడ అనౌచిత్య దోష దూషితమైన కావ్యమని యాలంకారిక శిఖామణినాఁదగు జగన్నాథుఁడు ఆక్షేపించి యున్నాఁడు. ఇందున గుఱించిన రసగంగాధరమునందలి వాక్యములు నాయొక్క ప్రథమ లేఖయందు నుదాహరింపఁబడినవి. ఇఁక మిగిలిన వారు అదివ్యులు అనఁగా మానవులు. వీరిలో నుత్తములను గుఱించియు సంభోగవర్ణనకూడదు. కావ్య ప్రకాశకారుడు "ఉత్తమ దేవతా విషయా న వర్ణనీయా" యని యన్నను అందుకు హేతు వేమి యిచ్చినాఁడో చూచినయెడల మాయుక్తి [illegible] సుస్పష్టపడఁ గలదు. "రసగ

నం హి పిత్రోః సంభోగవర్ణన మివాత్యంతా నుచితమ్" "ఉత్తమ దేవతలను గుఱించి సంభోగము వర్ణింపఁగూడదు. ఏల ? అట్లు చేయుట తలిదండ్రుల సంభోగము వర్ణించినట్లు మిక్కిలి యనుచితము గనుక" నని పై వాక్యమునకు నర్థము. ఇందువలనఁ దలిదండ్రుల సంభోగము వర్ణించుట యనుచితమని గ్రంథకారుని యభిప్రాయమని మనము నిశ్చయింపవచ్చును. అదియొక హేతువుగ నియ్యఁబడినది గనుక నది యందఱిచే నొప్పుకొనఁబడిన సర్వసామాన్య సిద్ధాంత మనియు మనము నిశ్చయింపవచ్చును. ఇఁకఁ దలిదండ్రు లెవరు? దివ్యులా ? అదివ్యులా? అదివ్యులనుట స్పష్టము. కావున మానవులలో, తలిదండ్రులవలెఁ బూజ్యులయినవారిని గుఱించి సంభోగ శృంగార రసమును వర్ణించుట యత్యంతానుచితమని తేలుచున్నది.

భరతాచార్యులవారు

అలంకారశాస్త్రమునకు భరతముని యాది గురువు. రసభావాదికములను గుఱించి యాలంకారికు లందఱును భరతశాస్త్రమునే పరమ ప్రమాణముగా గ్రహించి యున్నారు. అనగా నీశాస్త్రమును ఈగ్రంథమందలి వాక్యములు స్వతః ప్రమాణములయిన వేదవాక్యముల వంటివి. కావున శృంగారమునుగుఱించి యీ మహర్షి యొక్క యభిప్రాయ మెట్టిదో కనుగొనుట మనకు మిక్కిలి యావశ్యకము. ఈలేఖమాలకు శిరోభాగమునందే యీయన యభిప్రాయ మీయఁబడవలసి యుండెను. కాని భరతముని కృత నాట్యశాస్త్రము[16] మిప్పుడే నాకు లభించి నందున ఈ మహర్షి యొక్క సిద్ధాంత వాక్యములతో నీ లేఖమాలను ముగించుచున్నాను దీనిని ఈమాలకు మేరుమణి యనదగును.

పవిత్రమైనది శృంగారము

భరతాచార్యులవారు ౬వ అధ్యాయము నందు రసముల నన్నిటిని వర్ణించుచు మొట్ట మొదట శృంగారమును గుఱించి యిట్లు వర్ణించి యున్నాడు :

"తత్రశృంగారో నామ రతిస్థాయి భావప్రభవ ఉజ్జ్వలవేషాత్మకః యత్కించి ల్లోకే శుచిమేధ్య ముజ్జ్వలం దర్శనీయం వా తచ్ఛృంగారేణోప మీయతే। యస్తావదుజ్జ్వలవేషవా న్సశృంగారవానిత్యుచ్యతే। తథాగోత్ర కులాచారోత్పన్నా న్యాప్తోపదేశ సిద్ధాని పుంసా నామాని భవంతి తథైషాం రసానాం భావానాంచ నాట్యాశ్రితానాం చార్థానా మాచారోత్పన్నా న్యాప్తోపదేశసిద్ధాని నామాని। ఏవమేష ఆచారసిద్ధో హృద్యోజ్జ్వల వేషాత్మకత్వాత్ శృంగారోరసః। సచ స్త్రీపురుష హేతుక ఉత్తమ యువ ప్రకృతిః"

అర్థము : "అందు శృంగారమను పేరు గల రసము రతి (ప్రేమ) యను స్థాయిభావము వలనఁబుట్టును. తెల్లని (లేక ప్రకాశమానమైన) వేషముగలదియై యుండును. లోకమునందు శుచిప్రదములును (పరిశుద్ధమైనవియు), మేధ్యములును (పవిత్రము లయినట్టియు), ఉజ్జ్వలములును (ప్రకాశవంతంబులును), దర్శనీయములును (చూచుట కింపైనవియు) నగునే వస్తువులు కలవో యవియన్నియు శృంగారముతోఁ బోల్పఁబడును. గోత్ర కులాచారమును బట్టియు నాప్తుల యుపదేశము ననుసరించియు నెట్లు పురుషులకుఁ బేర్లు పెట్టఁబడునో యట్లే యీ నాట్య శాస్త్రాంతర్గతమైన రసములకు భావములకుఁగూడ నాచారాప్తోపదేశముల వలన బేర్లేర్పడ్డవి. ఇట్లే హృద్యంబును ఉజ్జ్వలంబును అగు వేషంబు గలిగి యుండుటచే నీ శృంగార రసము ఆచారసిద్ధము. ఇయ్యది స్త్రీ పురుష హేతుకము. యౌవనులును ఉత్తమ ప్రకృతులును గలది."

భరతాచార్యుల వారి యీ వాక్యములవలన శృంగార రసముయొక్క యుజ్జ్వలస్వరూపము స్పష్టమగుచున్నది. శృంగార రసవర్ణనము శుచిగను, పవిత్రముగను, ఉజ్జ్వలముగను, దర్శనీయముగను ఉండవలయును. అట్లు గాని వర్ణనములు

16. ఈగ్రంథమును 'గ్రంథమాల' యను మాసపత్రికయందు నిర్ణయసాగర ముద్రణాలయాధికారులు ప్రకటించి యున్నారు. ఇది 32 అధ్యాయములును, 5000 శ్లోకములునుగల యుద్గ్రంథము.

శృంగారరసము గాకపోఁగా వానితోఁ బోల్చుటకును తగినవిగావు అని యాచార్యులవారి యభిప్రాయము స్పష్టము. దంపతులకుఁ గల పవిత్రమైనట్టి సాత్త్విక ప్రేమను వర్ణించి శృంగార రసముఁ జూపుట సాధ్యము. ఇందుకు శాకుంతలమే దృష్టాంతము. నాయికా నాయకుల యొక్క యున్నతమైనట్టియు, నుజ్జ్వలమైనట్టియు, శుచియైనట్టియు, ననురాగము శ్రావ్యమైన శబ్దములచే వర్ణింపఁ బడిన నది శృంగార మగునేగాని వ్రీడాకరమైనట్టియు, పెద్దమనుష్యులు వినుటకుఁ దగనట్టియు, అనీతికరములై నట్టియు వర్ణనలు చేయబడినచో నవి రసాభాసములేగాని రసము కానేరదు. సురత వర్ణన పక్షపాతులును, అంతటితో సంతృప్తిఁ జెందక విపరీత సురత (ఉపరతి) వర్ణనము ఉండినఁగాని వర్ణన రసత్వముఁ జెందదని తలంచువారును, అట్టి యశ్లీలవర్ణనములను భరత మహర్షిచే శృంగారముతోఁ బోల్చుటకుఁ దగినవి యని చెప్పఁబడిన, శుచి మేధ్యోజ్జ్వల దర్శనీయంబులను నాల్గు వర్గములలో నెద్దాని యందును జేర్చుటకుఁ దగవనియు, అశుచి, అమేధ్యము, అనుజ్జ్వలము అదర్శనీయము అను వర్గములకు దగినవనియు నందుచే శృంగారము గాకపోఁగా శృంగారముతోఁ బోల్పఁబడుటకును తగనివనియు తెలిసికొందురు గాత!

కావ్య నాయికానాయకులను గుఱించియు, కావ్య వర్ణనములను గుఱించియు, కావ్యబోధ ప్రయోజనములను గుఱించియు పౌరస్త్యపూర్వ లాక్షణికుల యభిప్రాయము లీ మూడు లేఖలలో బొందుపఱిచినాడను. పాశ్చాత్య లాక్షణికుల యభిప్రాయమును ఈ రెంటిని సమన్వయించి చెప్పబోవు నా యభిప్రాయమును , మఱియొకప్పుడు తెల్పఁగలను.

★

విశ్వనాథ మధ్యాక్కఱలు

మున్నంగి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

భామిను లిద్దఱు నీకుఁ జెఱియొక్క ప్రక్కను గలరు
శ్రీ ముగ్ధ రవ సాధు మూర్తి వేణువు చేతిలోఁ గలద
యీ మూఁడు లోకముల్ నీకు మునిగిన నేమి నీ పాట
ప్రేమయు నున్నచోఁ జాలు మున్నంగి వేణు గోపాల !

భగవంతుడవు నీవు కాదటన్నచో బాలగోపాల
భగవంతుడను నేను కాదటందువు ప్రౌఢ గోపాల
భగవంతుడవు నీవ యన్నచో నేన భగవంతు డందు
విగత భగవ దహంకార మున్నంగి వేణుగోపాల !

నీవ స్వామి వటంచు నిన్ను ధ్యానించి నీ రూపుగనగ
నీవు స్వామివి కాదటంచు నిందించి నీ శిక్షపొంద
తా వేడు వేడా పండిన తపస్సైనన దైత్యతమైన
వేవిళ్లగాగ రావలయు మున్నంగి వేణుగోపాల !

ఉభయ లోకమ్ముల తత్త్వ మొకచోట నునువుగాఁ గూడి
లభియింపఁగల యట్టిచోటు గానమ్ము లావణ్యరాశి
ప్రభు ! దీని వ్యాఖ్యగా రుక్మిణీ సత్యభామలు కొలువ
విభు వేణువు ధరింతు వీవు మున్నంగి వేణుగోపాల.

అపుర జ్యోతీరూపమైన నీ వెల్గు ధ్యానించి తెలియ
సపురైన త్రోవలోపలికిఁ జొచ్చి యీ సర్వమ్ము తొలచి
భువిమిన్ను దేశకాలములు గ్రహములు భూతముల్ కర్మ
వివరించి తెలియఁగా లేము మున్నంగి వేణుగోపాల !

పదిలపహా చిఱునవ్వు వెలుగు ప్రసవ శోభారాశిగాఁగ,
సదమలారుణ నూత్న సుషమ కుసుమ కేసరకాంతిగాఁగ,
మృదు వేణు రావమ్ము బంభరధ్వని రీతిగా, నీదు
పెదవిపై మధుమాస మొప్పు; మున్నంగి వేణుగోపాల!

నీపైన పద్యాక్షరాలను వ్రాయుచు నిద్రింప నేను
స్వాపమ్ములోన నా స్వామి బంభర ధ్వానమ్ము వింటి;
శ్రీపతీ నీ వేణురావ సాంతత్య మృదుధారవచ్చి
వీపున కంటుకపోయె మున్నంగి వేణుగోపాల!

కాళింది నీరమ్ము వెనుక తట్టున కాళియ భుజగ
పాళీంద్ర మణికాంతి పాద దేశాన, పాళిఁబింఛమ్ము
బాళిమై దెసలందు నీలమణి యడ్డబాసల చెలులు
వేళా వియన్మూర్తి నీకు మున్నంగి వేణుగోపాల!

కిటకిటలాడెనో నాడు మున్నంగి కృష్ణాతటంబు
చటులైన నీ దేవళంబు తిరుగనప్పటి కోటిమునులు
జటలతోఁ గృష్ణాజినములతోఁ బీవజంఘులతోడ
పెటిలిన దృగ్వహ్నిసమితి మున్నంగి వేణుగోపాల!

నవ్వులెందైన నాస్వామి యీలాటి నాణెంబు కలవా
జవ్వాది గమగమ మెఱుపుపిండు పచ్చని సన్నసుషమ
క్రువ్విన సంసారమోహాసంతతి కూరుపు విఱుపు
విప్పిన తొలివెల్గు కలసి మున్నంగి వేణుగోపాల!

మునికోటి వచ్చి యానాడు నినుఁ గోటిపూలఁ బూజించి
కనినప్డు నీదు గర్భాలయంబది గర్భాలయంబా?
సెనగ పూవులవోని నీదు చేడెల చికిలింత లైన
పెనగొన్న నవ్వులతోటా! మున్నంగి వేణుగోపాల!

కృతయుగంబునఁ బ్రతిష్ఠించిరో నిన్నుఁ గేవల మీవు
సతులతో ద్వాపరాంతమున మువ్వురు చనుదెంచి మిమ్ము
జతనుగాఁ బూజించుకొంచు ద్వారక చనినారొ యేమొ
వితతాత్మ పూజానుకూల! మున్నంగి వేణుగోపాల!

శిరసున నుండ స్వర్గంగ దిగవచ్చి చెంతను నిలువ
గిరిరాజ దుహిత కోపమున నరమేని కేరింత వదల
గరళంపు మెడకాంతి మేన నెల్లడఁ గ్రమ్మగా శివత
విరజిమ్మ వచ్చితో యిటకు మున్నంగి వేణుగోపాల!

నా హృదంతరమున యందు మృదువేణునాదంబు కలదో
బాహిరిల్లిన యట్టి గేహ భామినీ భావంబుకలదో
మోహనాంభోధర స్నిగ్ధ వర్ణగ మోహంబు కలదో
బేహార మయ్యె నీతోడ, మున్నంగి వేణుగోపాల!

చందనాచలగంధవాహ బాలక సంస్పర్శ సుఖము
పొందుచున్నది గుండె వేణుమృదురవమ్మును సంస్మరించి
నందనందన, యెప్డు విన్నదిద్ది? మానస మాత్మ గడప
విందైన యపుడు విన్నదియొ? మున్నంగి వేణుగోపాల!

చాలి యా నిదురలో విన్న యట్టిది శంఖ రవమ్ము
పోలెనున్నదియ, లోకమ్ము దానితోఁ బోలి లేదయ్యె;
లోకేతర దృశాంత, దాననే నీలలోహితుఁ డనగ
వీలుగా నున్నది నిన్ను మున్నంగి వేణుగోపాల !

పరమేశ ! అది వేణు రవము శంఖ రవమ్మును, గాదు
పరితో భ్రమణ సేయుచున్న బంభరస్వానమ్ము స్వామి
అరయ జీవుడు సేయు షట్పదీస్వాన మట్టిది, తేనె
విరులను వెదకెడు వేళ; మున్నంగి వేణుగోపాల !

ఇంక నిందొక చిత్రమున్నదో స్వామియే నీ విచిత్ర
పంకంబునం జొరంబడెడు వేళ జీవ విశిష్ట లక్ష
ణాంకంబు భ్రమరీ నినాద సాహిత్య మైతి నా స్థితియ
వేంకటపతిమేలు మరల మున్నంగి వేణుగోపాల!

నీరమ్ముచేత నల్లనిది కాళింది నీవామె వదలి
పేరునుబట్టి నల్లనిది యీ కృష్ణవేణిఁ జేరితివి;
యారా ! నీ యొంటఁ బుట్టిన గుణంబిది హైమాంగ లతఁ
పేరిమి చేతురు నీకు మున్నంగి వేణుగోపాల !

ఇంత మాయాప్రియుం డీవు నెందుకోయీ నీకు వలతు
రింతులు సత్త్వగుణాశ్రయల్ రుక్మిణీందిరా సతులు
వంతులు వంతులు గాగ నీ కడ వచ్చి యే మనుభ
వింతురో తెలియదు స్వామి మున్నంగి వేణుగోపాల !

పైకి నెంతో ప్రేమ యున్నయట్టులు ప్రకటింతు, లోన
నీకంటె శుద్ధబోధ స్వరూపుండు నిర్గుణుం డెవఁడు ?
నీకయి వగవగా స్వామి నావంటి నిర్భాగ్యుఁ డొకడు
వేఁకిపట్టినవాఁడు వలయు; మున్నంగి వేణుగోపాల !

నేను నిన్నయినఁగానీ భవత్సఖు నీల లోహితుని
గానీ కనుంబొమల్ నడుమ బంధింపగాఁ దలంచెదను
తానొక మూర్తి యాచట్ట శివ శివ ! తమరింకఁ గదల
వేణువు నతు లొక్క గంప మున్నంగి వేణుగోపాల !

దాని కాపేరు పెట్టితిమ, యాపేర దానినిఁ బిల్వ
దానికిఁ దెలియగా వలయు ముందుగాఁ దన పేరదంచు;
తా నింతమాత్ర స్వాములకుఁ దెలియదో తమరికి ? నిన్ను
వేణుగోపాలుఁ డన్నాము; మున్నంగి వేణుగోపాల !

వేలకు వేల్ నమస్కృతులుగా మిమ్ము పిలచి యేమయ్యె
చాలక లక్షలు కోట్లు పిలుపులు శ్రమమైరి మున్ను,
గోల పిలుచువానికైనఁ బిలిపించుకొనువానికైన
వ్రీలగావలెఁ బ్రదాభరము మున్నంగి వేణుగోపాల !

కడగి నీ కద్దిలేదన్న మాట యుగయుగాల మాట,
కడఁగి నాకుంగూడ లేనియట్లుగా ఘటియించుటకును
వడి నిర్ణయము చేసినట్లుగా మాట పలుకును లేదు,
బిడియమ్ము నాకేల యింక ? మున్నంగి వేణుగోపాల !

ఈ మొదల్ తుద లేని యింతసృష్టిలో నే నొక యణువు
కామి యెఱుంగుదుఁ గాని తెలియు నీ గడుసుందనమ్ము
స్వామి ప్రత్యణువులో బీసవోఁకుండఁ బట్టితి తీపి
వేమున్న సార్వకాలికము మున్నంగి వేణుగోపాల !

ఇదిగో నా స్వామి యీ నామరూప సాహిత్యంబులోన
పదిలంబుగా భద్రపఱచిరో నిన్ను పరమర్షి గణము,
మొదలు తుదల్ లేని నామరూపాల పోకిళ్లు లేని
వెదగింజతనపు భద్రమ్ము ? మున్నంగి వేణుగోపాల !

శ్రీ భరతమునిప్రణీత

నాట్యశాస్త్రమ్

★

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి,

ఎం. ఏ., ఎం. లిట్., పిఎచ్. డి.

★

ద్వితీయోఽధ్యాయః - నాట్యమండప విధానమ్

భరతస్య వచః శ్రుత్వా ప్రత్యూచు ర్మునయ స్తతః
భగవఞ్ శ్రోతు మిచ్ఛామో యజనం రంగ సంశ్రయమ్ ౧

అథవా యాః క్రియా, స్తత్రలక్షణం, యచ్చపూజనమ్
భవిష్యద్భిర్నరైః కార్యం కథం తన్నాట్యవేశ్మని. ౨

ఇహాది ర్నాట్యయోగస్య నాట్యమండప ఏవహి
తస్మాత్తస్యైవ తావత్త్వం లక్షణం వక్తు మర్హసి. ౩

రెండవ అధ్యాయము - నాట్య మండప విధానము

భరతుని మాటలను వినిన తర్వాత ముని లిట్లు పలికిరి—"పూజ్యుడా! నాట్యరంగమునకు సంబంధించిన పూజను వినవలెనని ఉన్నది. నాట్యమండపము లేనిది రంగపూజయే కుదరదు కనుక నాట్య మండపము నెట్లు నిర్మించవలెను? దానిలక్షణము లేవి? పూజావిధాన మేది? మున్ముందు మానవులు ఏ పనలను ఎట్లు నాట్యగృహమున చేయవలెను? నాట్యయోగమునకు నాట్య మండపమే ఆగి అగుటచేత దీని లక్షణాదికము చెప్పవలసినది"

తేషాంతు వచనం శ్రుత్వా మునీనాం భరతోఽబ్రవీత్
లక్షణం పూజనం చైవ శ్రూయతాం నాట్యవేశ్మనః. ౪

దివ్యానాం మానసీ సృష్టి గృహే షూపవనేషుచ
నరాణాం యత్నతః కార్యాలక్షణాభి హితాః క్రియాః. ౫

శ్రూయతాంతద్యథాయత్ర కర్తవ్యో నాట్యమండపః
తస్య వాస్తు చ పూజా చ యథాయోజ్యా ప్రయత్నతః. ౬

ఆ మునుల వాక్యములను విని భరతు డిట్లు సమాధానము నిచ్చెను—సంకల్ప మాత్రము చేత దేవతలు, గృహాలను, ఉప వనాలను సృష్టించుకొన గలరు. ఐనను సంకల్పించిన దానిని చేయుటకు జ్ఞానము, ప్రయత్నము, అవసరము. నాట్య మండప లక్షణములను, నిర్మాణ విధిని, పూజను మీరు వినవలెను.

ఇహ ప్రేక్షా గృహం దృష్ట్వా ధీమతా విశ్వకర్మణా
త్రివిధః సన్నివేశశ్చ శాస్త్రతః పరికల్పితః. ౭

వికృష్ట శ్చతురస్రశ్చ త్ర్యస్రశ్చైవతు మండపః
తేషాంత్రీణి ప్రమాణాని జ్యేష్ఠం మధ్యం తథావరమ్ ౮

ప్రమాణ మేషాం నిర్దిష్టం హస్త దండ సమాశ్రయాత్.

బుద్ధిమంతుడగు విశ్వకర్మ నిర్మించిన నాట్యగృహమును చూచి మూడు రకముల నాట్యగృహములు శాస్త్రీయము లనిరి. దీర్ఘచతురస్రాకారముగ నుండునది వికృష్టమని, సమచతురమైనది చతురమని, ముక్కోణముగా నున్నది త్ర్యస్రమని అనబడును. ఒక్కొక్క రకములో జ్యేష్ఠము, మధ్యమము, అధమము అని మరల మూడు విధము లున్నవి. వీటి కొలతలు మూర బారలలో చెప్పబడును.

అణూరజశ్చ వాలశ్చ లిక్షా యూకా యవస్తథా ౯
అంగులంచ తథా హస్తో దండశ్చైవ ప్రకీర్తితః
అణవోఽష్టౌరజః ప్రోక్తం తాన్యష్టౌ వాల ఉచ్యతే. ౧౦
వాలాస్త్వష్టౌ భవేల్లిక్షా యూకా లిక్షాష్టకం భవేత్
యూకాస్త్వష్టౌ యవోజ్ఞేయో యవాస్త్వష్టౌ తథాంగులమ్. ౧౧
అంగులాని తథా హస్తశ్చతుర్వింశతి రుచ్యతే
చతుర్హస్తో భవేద్దండో నిర్దిష్టస్తు ప్రమాణతః, ౧౨
అనేనైవప్రమాణేన వక్ష్యామ్యేషాం వినిర్ణయమ్.

ఈ లెక్కలో అణువు, రజము, వాలము, లిక్ష, యూక, యవ, అంగుళము, మూర, బార అను తొమ్మిది కొలతలున్నవి. అతిసూక్ష్మమైనది అణువు. ఎనిమిది అణువులు ఒక రజము. ఎనిమిది రజములొకవాలము. ఎనిమిది వాలములొక లిక్ష, ఎనిమిది లిక్షలొక యూక. ఎనిమిదియూకలొక యవ. ఎనిమిది యవలొక అంగుళము. ఇరువదినాలుగు అంగుళములొక మూర. నాలుగు మూరలొక బార. ప్రస్తుతము ఉన్న కొలతబద్ద ప్రకారము మూరకు రెండు అడుగుల మూడు అంగుళములు రాగలవు. ఈ మూర బారల కొలతలతో నాట్యగృహాల పరిమాణములు చెప్పబడును.

శతం చాష్టౌచతుః షష్టి ర్హస్తా ద్వాత్రింశ దేవవా, ౧౩
అష్టాధికం శతంజ్యేష్ఠం, చతుఃషష్టిస్తు మధ్యమమ్,
కనీయస్తుతథా వేశ్మహస్తా ద్వాత్రింశ దిష్యతే. ౧౪

జ్యేష్ఠమను నాట్యగృహపు పొడవు 108 మూరలు (81 గజములు) మధ్యమము యొక్క పొడవు 64 మూరలు (48 గజములు), అధమ గృహపు పొడవు 32 మూరలు (24 గజములు).

దేవానాంతు భవేజ్జ్యేష్ఠం నృపాణాం మధ్యమంభవేత్
శేషాణాం ప్రకృతీనాంతు కనీయః సంవిధీయతే. ౧౫

దేవతలను నాట్యమున ప్రదర్శించుటకు జ్యేష్ఠ నాట్యగృహము కావలెను. రాజులు మొదలగు వారిని చూపుటకు మధ్యమ గృహము అవసరము. మిగిలినవారిని చూపు భాణ ప్రహసనాదులకు అధమ గృహము కావలెను.

ప్రమాణం యచ్చ నిర్దిష్టం లక్షణం విశ్వకర్మణా
ప్రేక్షా గృహాణాం సర్వేషాం తచ్చైవహి నిబోధత ౧౬

సకల ప్రేక్షాగృహములకు విశ్వకర్మ చెప్పిన లక్షణ ప్రమాణముల నిక వినవలెను.

చతుఃషష్టికరాన్ కుర్యా ద్దీర్ఘత్వేనతు మండపమ్
ద్వాత్రింశతం చ విస్తారాన్ మర్త్యానాం యో భవేదిహ ౧౭
అత ఊర్ధ్వం నకర్తవ్యః కర్తృభి ర్నాట్య మండపః
యస్మా దవ్యక్త భావంహి తత్ర నాట్యం వ్రజేదితి ౧౮
మండలే విప్రకృష్టేతు పాఠ్యముచ్చరిత స్వరమ్
అనిస్సరణ ధర్మత్వా ద్విస్వరత్వం భృశంవ్రజేత్. ౧౯

యశ్చాప్యస్యగతో భావో నానాదృష్టి సమన్వితః
సవేశ్మనః ప్రకృష్టత్వా ద్వ్రజేదవ్యక్తతాం పరామ్. ౨౦

ప్రేక్షాగృహాణాం సర్వేషాం తస్మా న్మధ్యమ మిష్యతే
యావ త్పార్యం చ గేయంచ తత్రశ్రవ్యతరం భవేత్. ౨౧

మధ్యమ నాట్యమండపపు పొడవు 48 గజములు. దీనిలో సగము మానవుల నాట్యమండపపు పొడవగును. నాట్యమండప మింతకన్న పెద్దదైన నాట్యము అవ్యక్తము కాగలదు, అతి ప్రయత్నముతో మాటలను బిగ్గరగా ఉచ్చరించినను దూరమున కూర్చొనియున్న సామాజికులకు వినబడక పోవచ్చును. నాట్యమండపము చాల చిన్నదైనచో శబ్దము ప్రతిధ్వనించి, మాధుర్య రహితము కాగలదు. పెద్దదైనచో ముఖములో కన్పించు నానాదృష్టి సమన్వితములైన భావములు అందరకు బాగుగాకన్పించవు. జ్యేష్ఠగృహమున నాటకాది ప్రయోగములకు సౌకర్యము లేకపోవుట చేతను, మధ్యమ గృహమున మాత్రమే పాఠ్యగేయములు చక్కగా వినిపించగలవు కనుకను, నాట్యగృహము లన్నిటిలోను మధ్యమ పరిమాణముగలదే శ్రేష్ఠమైనది

దేవానాం మానసీసృష్టి ర్గృహే షూపవనేషు చ
యత్నభావా ద్వినిష్పన్నాః సర్వే భావాహి మానుషాః. ౨౨

తస్మా ద్దేవకృతై ర్భావై ర్నవిస్పర్ధేత మానుషః
మానుషస్య తుగేహస్య సంప్రవక్ష్యామి లక్షణమ్ ౨3

సంకల్పమాత్రము చేతనే దేవతలు తమ తమ మనస్సులతో గృహాలను, ఉపవనాలను సృష్టించుకొందురు. ప్రయత్న పూర్వకముగా వీటిని నిర్మించగలవారు మానవులు గనుక దేవతా కృత్యములను జూచి మానవులు అసూయపడరాదు. మానవులకు ఉపకరించు నాట్యగృహము యొక్క లక్షణము లిక చెప్పబడగలవు.

భూమేర్విభాగం పూర్వంతు పరీక్షేత ప్రయోజకః
తతో వాస్తు ప్రమాణేన ప్రారభేత యదృచ్ఛయా. ౨౪

సమా, స్థిరాచ, కఠినా, కృష్ణా, గౌరీచ, యా భవేత్
భూమి స్తత్రైవ కర్తవ్యః కర్తృభి ర్నాట్య మండపః. ౨౫

ప్రథమం శోధనం కృత్వా లాంగలేన సముత్కృషేత్
అస్థి కీల కపాలాని తృణ గుల్మాం శ్చ శోధయేత్. ౨౬

శోధయిత్వా వసుమతీం ప్రమాణం నిర్దిశే త్తతః
పుష్య నక్షత్రయోగేన శుక్లసూత్రం ప్రసారయేత్. ౨౭

నాట్య గృహమును కట్టదలచిన భూమిని చక్కగా పరీక్షచేసి గృహ నిర్మాణ కృత్యమును నాట్యాచార్యుడు వాస్తు ప్రమాణ పూర్వకముగా ప్రారంభించవలెను. మిట్టపల్లములు లేనిది, కదలికలేనిది, చవుడు నేలకానిది, తెలుపు లేక నలుపు రంగుతో నున్నది అగు భూమిపైన నాట్య మండపమును నిర్మించవలెను. భూమిని శుద్ధిపరచిన తర్వాత నాగలితో దున్ని, దానిలో నున్న ఎముకలను, మేకులను, పుర్రెలను, చెట్లవ్రేళ్ళను తీసివేయవలెను. ఈ విధముగా లోపల, పైన భూశుద్ధికలుగును. అప్పుడు పుష్యమీ నక్షత్రమున చంద్రు డుండగా తెల్లని దారమును చాచి నాట్య గృహమునకు కావలసిన ప్రమాణములను పట్టవలెను.

కార్పాసంబాల్బజం వాపి మౌంజం వాల్కల మేవచ
సూత్రం బుధైస్తు కర్తవ్యం యస్యఛేదో నవిద్యతే. ౨౮

అర్ధచ్ఛిన్నే భవేత్సూత్రే స్వామినో మరణం ధ్రువమ్
త్రిభాగచ్ఛిన్నయా రజ్జ్వా రాజకోపో విధీయతే. ౨౯

ఛిన్నాయాంతు చతుర్భాగే ప్రయోక్తుర్నాశ ఉచ్యతే
హస్తాత్ప్రభ్రష్టయా వాప కశ్చిత్త్వ వచయో భవేత్. 3౦

తస్మాన్నిత్యం ప్రయత్నేన రజ్జుగ్రహణ మిష్యతే
కార్యంచైవ ప్రయత్నేన మానం నాట్యగృహస్య తు 3౧

నూలుతోగాని, నారతోగాని చేయబడి, తెగిపోనట్టి దారమును కొలతకు పట్టవలెను. కొలత పట్టునపుడు సగములో దారము తెగిపోయిన సభాపతి మరణించును. మూడవభాగమున తెగిన నాట్యగృహము రాజకోపమునకు గురికాగలదు. నాల్గవ భాగములో తెగిన నాట్యాచార్యుడు నశింపగలడు. చేతినుండి దారము జారి క్రిందపడిన నాశనము కలుగగలదు. కావున శ్రద్ధతో, ప్రయత్నముతో ఈ దారమును పట్టుకొని నాట్య గృహమునకు కొలతలను పట్టవలెను.

ముహూర్తే నానుకూలేన తిధ్యాసు కరణేన చ
బ్రాహ్మణాం స్తర్పయిత్వాతు పుణ్యాహం వాచయే త్తతః. 3౨
శాంతితోయం తతో దత్వా తతః సూత్రం ప్రసారయేత్.

శుభతిథి, శుభకరణము గలిగిన అనుకూలమైన ముహూర్తమున బ్రాహ్మణులను తృప్తిపరచి, ఆపైన పుణ్యాహవచనములను చెప్పి, శాంత్యుదకములను చల్లి, కొలతదారమును చాచవలెను.

చతుష్షష్టికరాన్ కృత్వా ద్విధా భూతాన్ పున స్తతః 33
పృష్ఠతో యో భవే ద్భాగో ద్విధా భూతస్య తస్యతు

సమ మర్ధ విభాగేన రంగశీర్షం ప్రకల్పయేత్. 3౪
పశ్చిమేచ విభాగేఽథ నేపథ్యగృహ మాదిశేత్.

వికృష్టమను నాట్య గృహములలో మధ్యమపరిమాణముగల దాని కొలత లివ్వబడుచున్నవి దీనిపొడవు 48 గజములు. తూర్పునుంచి దారమును పట్టవలెను. ఈదారముతో మొత్తము పొడవులో సగభాగమును చేయవలెను. తూర్పునగల సగభాగము ప్రేక్షకులు కూర్చొను ప్రదేశము. మిగిలినది నాట్యమండపము. దీని మొత్తముపొడవు 24 గజములు. ఈ 24 గజములలో రంగశీర్షము, నేపథ్యగృహము రాగలవు. అన్నిటికన్న పశ్చిమమున ఉండునది నేపథ్యగృహము.

నేపథ్య గృహమునకు తూర్పునగల ప్రదేశము ప్రేక్షకులు కూర్చొను భూ భాగముకంటె ఒకగజము నాలుగున్నర అంగుళముల ఎత్తుగానుండును. దీనిని రంగపీఠమని సామాన్యముగా పిలుతురు. దీనిని రెండు సగభాగములు చేయగా వెనుకగల సగభాగమును రంగశిరస్సు అను విశేష నామముతో పిలుతురు. ముందుభాగమును రంగపీఠమందురు. కాని భరతుడు కొన్ని స్థలములలో రంగపీఠ, రంగశీర్ష శబ్దములను ఏకార్థముతో వ్యవహరించినాడు. నాట్య మండపభాగమున ఆరు గజముల పొడవున రంగపీఠము, దీనికి పడమరగా ఆరుగజముల పొడవున రంగశీర్షము, దీనికి పశ్చిమముగా ఇదే కొలతతో నేపథ్యము ఉండవలెను.

విభజ్య భాగా న్విధివ ద్యథావ దనుపూర్వశః 3౫
శుభే నక్షత్రయోగేచ మండపస్య నివేశనమ్

శంఖ దుందుభి నిర్ఘోషై ర్మృదంగ పణవాదిభిః 3౬
సర్వాతోద్యైః ప్రణుదితైః స్థాపనం కార్య మేవ తు

ఉత్సార్యాణి త్వ నిష్టాని పాషండ్యా శ్రమిణ స్తథా 3౭
కాషాయవసనాశ్చైవ వికలాశ్చైవ యే నరాః.

విధి పూర్వకముగా దారముతో కొలతలనుబట్టి, భూ విభాగమును పైనచెప్పిన రీతిగాచేసి, శుభనక్షత్రమున శంకుస్థాపనచేయవలెను. శంఖము, దుందుభి, పణవము, మృదంగము మొదలుగాగల వాద్యధ్వనులతో శంకుస్థాపన కావలెను. అశుభ, అనిష్టకరులగు పాషండులు, సన్యాసులు, కాషాయవస్త్రధారులు, వికలాంగులు ఎదురుపడకుండా ఉండువేళ ఈ పనికి ఉపక్రమించవలెను.

నిశాయాంచ బలిః కార్యో నానా భోజనసంయుతః ౩౮
గంధ పుష్పఫలోపేతో దిశో దశ సమాశ్రితః

పూర్వేణ శుక్లాన్నయుతో నీ లాన్నో దక్షిణేనచ ౩౯
పశ్చిమేన బలిః పీతో రక్తశ్చైవోత్తరేణ తు

యాదృశం దిశి యస్యాంతు దైవతం పరికల్పితమ్ ౪౦
తాదృశస్తత్ర దాతవ్యో బలిర్మంత్ర పురస్కృతః

పదిదిక్కులలో గల దేవతలకు రాత్రివేళ గంధ, పుష్ప, ఫలములతో కూడిన భోజనముతో బలులను వేయవలెను. తూర్పున తెల్లని అన్నమును, దక్షిణమున నల్లని అన్నమును, పడమర పసుపురంగుగల అన్నమును, ఉత్తరమున ఎర్రని అన్నము బలిగా ఉంచవలెను. మిగిలిన దిక్కులలో ఏ మూల ఏ దేవతకలదో ఆ దేవతకు సరిపోవు రంగుగల గంధమాల్యాదులను, అన్నము బలిగా వేయవలెను. ఈ బలులను మంత్ర పూర్వకముగా జరుపవలెను.

స్థాపనే బ్రాహ్మణేభ్యశ్చ దాతవ్యం ఘృతపాయసమ్ ౪౧
మధుపర్కస్తథా రాజ్ఞే కర్తృభ్యశ్చ గుడౌదనమ్.

శంకుస్థాపన సమయమున నేతితోకూడిన పాయసమును బ్రాహ్మణులకు, రాజుకు మధుపర్కమును, బెల్లముతో కలిపిన అన్నమును గృహమును కట్టు వారికి పెట్టవలెను.

నక్షత్రేణ తు కర్తవం మూలేన స్థాపనం బుధైః ౪౨
ముహూర్తేనానుకూలేన తిధ్యాసు కరణేనచ

ఏవంతు స్థాపనం కృత్వా భిత్తి కర్మప్రయోజయేత్ ౪౩
భిత్తి కర్మణి నిర్వృత్తే స్తంభానాం స్థాపనం తతః

తిథి నక్షత్ర యోగేన శుభేన కరణేన చ ౪౪
స్తంభానాం స్థాపనం కార్యం రోహిణ్యా శ్రవణేన వా

ఆచార్యేణ సుయుక్తేన త్రిరాత్రోపోషితేనచ ౪౫
స్తంభానాం స్థాపనం కార్యం ప్రాప్తే సూర్యోదయే శుభే.

వివేకులు మూలా నక్షత్రమున శంకుస్థాపన చేయవలెను. శుభతిథి, కరణములు గల లగ్నమున శంకుస్థాపన ఐన తర్వాత గోడలు కట్టవలెను. చుట్టునగల గోడలు పూర్తికాగా, శుభతిథియోగములలో శ్రవణ నక్షత్రమునగాని, రోహిణీ నక్షత్రమునగాని లోపల స్తంభముల నెత్తవలెను. మూడు రాత్రు లుపవసించి, యోగ్యులతో నున్న నాట్యాచార్యుడు శుభమగు సూర్యోదయ లగ్నమున స్తంభములను నిలుపుట శ్రేష్ఠము.

మొదట ఆగ్నేయ దిశలో స్తంభమును నిలుపవలెను. ఆ తర్వాత క్రమముగా నైరుతి, వాయవ్యము, ఈశాన్యములలో స్తంభ స్థాపన విధింపబడినది.

ప్రథమే బ్రాహ్మణస్తంభే సర్పిస్సర్షప సంస్కృతః ౪౬
సర్వ శుక్లోవిధిః కార్యో దద్యాత్పాయస మేవచ,

తతశ్చ క్షత్రియస్తంభే వస్త్ర మాల్యానులేపనమ్ ౪౭
సర్వం రక్తం ప్రదాతవ్యం ద్విజేభ్యశ్చ గుడౌదనమ్

వైశ్యస్తంభే విధిః కార్యో దిగ్భాగే పశ్చిమోత్తరే ౪౮
సర్వం పీతం ప్రదాతవ్యం ద్విజేభ్యశ్చ ఘృతౌదనమ్

శూద్రస్తంభే విధిః కార్యః సమ్యక్పూర్వోత్తరాశ్రయే ౪౯
నీలప్రాయం ప్రయత్నేన కృసరం చ ద్విజాశనమ్.

ఆగ్నేయమున నిలుపు స్తంభమును బ్రాహ్మణ స్తంభమందురు దీనిని నేతితోను, తెల్ల ఆవాలతోను పరిష్కరించి, విధిపూర్వకముగా బ్రాహ్మణులకు తెల్లని అన్నమును, పాయసమును ఇవ్వవలెను నైరుతమున నిలుపు క్షత్రియ స్తంభమును వస్త్రములతోను, పూలతోను, గంధాదులతోను సంస్కరించి, ద్విజులకు బెల్లము కలిపిన ఎర్రని అన్నము నీయవలెను. వాయవ్యమున వైశ్య స్తంభమును నిలుపుటకు ద్విజులకు నేతితో కలిపిన పసుపురంగుగల అన్నము నివ్వవలెను. ఈశాన్యమున శూద్రస్తంభమును నిలుపుటకు నల్లని పులగమును ద్విజుల కీయవలెను.

పూర్వేతు బ్రాహ్మణస్తంభే శుక్లమాల్యానులేపనే ౫౦
నిక్షిపేత్కనకం మూలే కర్ణాభరణ సంశ్రయమ్.

తామ్రం చాధః ప్రదాతవ్యం స్తంభే క్షత్రియ సంజ్ఞకే ౫౧
వైశ్య స్తంభస్య మూలే తు రజతం సంప్రదాపయేత్

శూద్ర స్తంభస్యమూలేతు దద్యా దాయస మేవచ ౫౨
శేషేష్వపిచ నిక్షేప్యం స్తంభమూలే తు కాంచనమ్

స్వస్తి, పుణ్యాహ ఘోషేణ జయశబ్దేన చైవ హి ౫౩
స్తంభానాం స్థాపనం కార్యం పుష్పమాలా పురస్కృతమ్.

రత్నదానైః స గోదానై ర్వస్త్ర దానై రనల్పకైః ౫౪
బ్రాహ్మణాం స్తర్పయిత్వాతు స్తంభా నుత్థాపయే త్తతః

తెల్లని పూదండలతోను, గంధాదులతోను అలంకరించబడిన ఆగ్నేయ స్తంభము క్రింద చెవికి పెట్టునగలకు చెందిన బంగారము నుంచవలెను. నైరుతమున గల స్తంభముక్రింద రాగిని, వాయవ్య స్తంభముక్రింద వెండిని, ఈశాన్య స్తంభముక్రింద ఇనుమును, మిగిలినవాటిక్రింద బంగారమును ఉంచవలెను. రత్నములను, గోవులను, వస్త్రములను బ్రాహ్మణులకిచ్చి, వారిని తృప్తిపరచవలెను. అప్పుడు స్వస్తి, పుణ్యాహ వచనములతోను, జయజయ శబ్దములతోను, పూలమాలలను వేసిన స్తంభములను లేవనెత్తవలెను.

అచలంచాపి కంప్యంచ తథైవ చలితం పునః ౫౫
స్తంభ స్యోత్థాపనే సప్య ద్దోషా హ్యేతే ప్రకీర్తితాః.

అవృష్టి రుక్తా చలనే వలనే మృతితో భయమ్ ౫౬
కంపనే పరచక్రాత్తు భయం భవతి దారుణమ్.

దోషై రేతై ర్విహీనంతు స్తంభ ముత్థాపయే చ్ఛివమ్ ౫౭

స్తంభమును ఎత్తునపుడు అది కదలకుండుట, కదలినను వణకుచున్నట్లుండుట, వలయాకారమున పరివర్తనము చేయుట అను ఈమూడును స్తంభస్థాపనలో వదలవలసిన దోషములు. స్తంభము కదలకపోయినచో వర్షములుండవు కంపించినచో మృత్యుభయము కలుగును. పరివర్తన చేయునట్లున్న పరులాక్రమించుట వలన దారుణమగు భయముకలుగును. ఈ దోషములు లేకుండా స్తంభస్థాపనను జరుపవలెను.

పవిత్రే బ్రాహ్మణ స్తంభే దాతవ్యా దక్షిణా చ గౌః
శేషాణాం భోజనం కార్యం స్థాపనే కర్తృ సంశ్రయమ్ ౫౮

మంత్రపూతంచ తద్దేయం నాట్యాచార్యేణ ధీమతా
పురోహితం నృపంచైవ భోజయే న్మధు పాయసైః ౫౯

కర్తృ్లానపి తథాసర్వా్ కృసరాం లవణోత్తరామ్

పవిత్రమగు ఆగ్నేయ స్తంభ స్థాపన సమయమున ఆవును దక్షిణగా నివ్వవలెను ఇతర స్తంభములను స్థాపించునపుడు బుద్ధిమంతుడగు నాట్యాచార్యుడు మంత్రపూతనగు భోజనమును పెట్టవలెను తేనె, పాయసములతో బాటు భోజనమును రాజునకు, పురోహితునకు ఇచ్చి, పనిచేయు వారికందరకు ఉప్పుకలిపిన పులగము నివ్వవలెను.

సర్వ మేవ విధిం కృత్వా సర్వాతోద్యైః ప్రవాదితైః ౬౦
అభిమంత్ర్య యథా న్యాయం స్తంభ ముత్థాపయే చ్ఛుభిః

'యథాచలో గిరి ర్మేరు ర్హిమవాంశ్చ మహాబలః ౬౧
జయావహో నరేంద్రస్య తథా త్వ మచలో భవ'

ఏవ ముత్థాపయేత్తజ్ఞో విధి దృష్టేన కర్మణా ౬౨

స్తంభద్వారంచ భిత్తించ నేపథ్య గృహ మేవ చ.

సకల గీతవాద్యముల గానములు జరుగునపుడీవిధులను నేరవేర్చి శాస్త్రప్రకారము స్తంభములను అభిమంత్రించి, వాటి నెత్తునపుడు "మేరువు, బలిష్ఠమగు హిమవత్పర్వతము ఏరీతి కదలక స్థిరముగా ఉన్నవో, అట్లే నీవును స్థిరముగాఉండి ప్రభువుకు జయమును చేకూర్చుము" అని పలుకవలెను. ఈవిధముగా శాస్త్రోక్తముగా స్తంభములను, ద్వారములను, గోడలను, నేపథ్య గృహమును నాట్యాచార్యుడు నిర్మించవలెను

అభియోగము

శ్రీ లంక సూర్యనారాయణరావు

*

పలుకుందొయ్యలి! నీ పదాబ్జములు శుంభత్ప్రీతిమై గొల్చు నె
చ్చెలి రాయంచ ప్రవృత్తి నించుక మనస్స్థైర్యంబునన్ దాల్చి, త
త్కలనన్ క్షీర లవంబు గ్రోలెడి సముత్కంఠన్ వెసన్ ద్రుంచఁ జే
రలుకన్ శ్రీసతి చేదులం బొదవు, జాగ్రద్దుష్ట నైజమ్మునన్!

తోయజనేత్ర! యాత్మగతిఁ దోచ నలంతిగ నీదు జాళువా
కాయల వీణె, వేడ్క జెలగన్ శ్రుతిఁగూర్చి మదీయ మానస
స్థాయిఁ దరంగ సంస్తుతుల తావక సన్నిధిఁ జేర్చ బూనఁగా
నా యమ సాగనీదు గ, మ, పాదిక పుంఖణ మూన్చి వైరమున్!

అలఘు మహత్వ పూర్ణనిగ మాధ్యయ నామృత సేచనార్తి ని
స్తుల పరితాప మానసిక దోహద లేప మఁటంది, ధాత్రి నో
యలికుల వేణి! నే ప్రవరు నాటనుఁ గాంచిన యామె వేడ్కమై
జెలగెడి నా వరూథినిగ చైదములన్ తమిదీఱ నెంచియున్!

కనుఁజాయన్ నిను బాయ కెప్పుడుఁ జెలంగన్ గోరి సేవింప మే
లని వాగ్భామిని! నా యెడంద తగు నుల్లాసంబు మై బొల్పఁ, గై
కొని, యా శ్రీసతి నిత్య సంకుల రణ క్షోణీస్థలిన్ ద్రోయ, నే
మను వారేరును లేని జీవిత మగమ్యం బౌట నిక్కం బొగిన్!

భవ దవలంబనంబున నపాయము గానక, కొన్ని నాళు లీ
నవ మధు భావ నందన వనాంతర కావ్య మరంద మాధురీ
పవనము లాను పాంథుగతి భాసిలఁ, దత్ప్రమ దాపహారకం
బవు నొక రూపు దాల్చి యెడబాయని దయ్యెడు నామె నీడమై!

ఇల సజ్జాలక భాసమాన మగు నా యిల్లాలి భోగంబు, ని
స్తుల మిత్త్రైక వసుప్రతాన విలసత్తుల్యంబు నీ ప్రాపు, మీ
కెలమిన్ వర్ధిలు వైరభావమున నో గీర్వాణి! రెండాల పై
రలుక ల్సందట లేగఁగాక సమత న్రాజిల్లు టెట్లో రహిన్!

నా గు బా ము

(రేడియో నాటిక)

★

శ్రీ పాకాల వేంకట రాజమన్నారు

★

పాత్రలు

జయశ్రీ	...	రాజకుమారి
నాగసుందరుడు	...	శిల్పి
ఆనందాత్ముడు	..	బౌద్ధ సన్యాసి

భిక్షుకులు, పరిచారకులు

పరిచారికలు

[అజంతా పర్వతములలో నొక బౌద్ధచైత్యములోపల, ధాతుగర్భం (దగోబా) అనగా అవశేషములు ప్రతిష్టింపబడిన భాగమునకు సమీపముననున్న గదిలో.

చైత్యము క్రొత్తగా నిర్మింపబడిన దనుటకు తార్కాణము లున్నవి. గదిలో ఒక గోడ మీద మాయాదేవి స్వప్నము, బుద్ధుని జననము చిత్రింపబడియున్నవి. ఎదుటి గోడమీద చిత్రమేదీలేదు. కాని, చిత్ర రచనకు అనుకూలముగా సిద్ధము చెయ్యబడిఉన్నది. ఇద్దరు పరిచారకులు, రంగుల పాత్రలు, కుంచెలు, చిన్న బట్టలు చిత్రములేని గోడ మూలకు ఉపాయంగా ఉంచుతారు, మాట్లాడుకొంటూ. .]

౧వ పరి : నాగయ్య చేతిలో ఎంత విద్దె ఉందిరా!

పరి ౨ : సిద్ధహస్తుడని పేరు గదట్రా...ఎంత సిన్నోడురా, మీసాలైనా తిన్నగా రాలేదురా.

పరి ౧: ఎంత అందగాడుకూడారా! కన్నుగీటితేచాలు, ఎందరు కన్నెలో కాళ్ళ మీద పడరటూ? కాని ఆయన ఎందుకో ఇంత చిన్న వయస్సులో సంఘాన్ని చేరిపోయాడు. సన్నాసం పుచ్చుకొని భిక్షువై పోతాడంట.

పరి ౨ : ఒరే, అది నీకూ నాకూ ఎలా అర్థ మవుతుందిరా ?

పరి ౧ : (ఆలోచిస్తూ) మహానుభావుడు బుద్ధ భగవానుడు అంతఃపురం వదిలి వెళ్ళిపోయేటప్పుడు మంచి ప్రాయంలోవాడు గాదట్రా!

పరి ౨ : అందరికీ వస్తుందీ వైరాగ్యం! మా ఆవిడతో దెబ్బలాడినప్పుడు సన్నాసై పోదామనిపిస్తదిగాని, మళ్ళీ ఆ తర్వాత దగ్గిరజేరి 'మంచికూర

వండాను. మా బాగుంది. సూడు' అని నవ్వుతూ పిలిచేటప్పటికి వైరాగ్య మంతా మాయ మవుద్ది.

పరి ౧ : ష్ !

[సూత్రములు చదువు చుండినది ఆగిపోయింది. గంభీరమైన కంఠంతో మొదటనొకరు, తత్క్షణం ఏకగ్రీవంగా పలువురు పారాయణ చేస్తారు.]

ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి

[పరిచారకులు నిశ్శబ్దంగా తలలు వంచుకొని నిలబడతారు. తదుపరి ప్రవేశం ఆనందార్హతుడు, ఇద్దరు భిక్షువులు, నాగ సుందరుడు.

ఆనందార్హతుని ముఖంలో తేజస్సు, శాంతి ప్రజ్వరిల్లుతూ వున్నాయి. కండ్లలో కరుణ, నుదుట విశాల భావము, పెదవులలో జాలి, ప్రస్ఫుటముగా కనబడతవి. నాగసుందరుడు యౌవనుడు స్ఫురద్రూపి. ఇంకా భిక్షువు కాలేదు. ఉపాసకుడు. మాటిమాటికి కండ్లు మూసుకొని తెరుస్తాడు. అప్పుడు ఇంకో లోకానికి వెళ్ళి ఈ లోకానికి వచ్చినట్లుంది.]

ఆనంద : (అభిమానంతో) నాయనా, నాగసుందరా, ఈ ప్రదేశమున (గోడ చూపిస్తూ) మారుని పరాజయం చిత్రించవలసి నట్లుగా చైత్యాధికారులు నిశ్చయించారు. అందుకు నీవే శిల్పిగా ఉండవలె నని నా అభిప్రాయాన్ని వారు ఆమోదించినారు. సంతోషమేనా ?

నాగ : (పరవశుడై) మహాభాగ్యం. మహాప్రసాదం. ధన్యుడను. (సంతోషంతో) కాని, నే నీ కార్యానికి సరిపోగలనా ? నా శక్తి చాలునా ? భయ పడుతున్నాను, ఆచార్యా!

ఆనంద : (చిరునవ్వుతో) ఆ సంశయం నీకు సహజమే కావచ్చుగాని, మాకు లేదు. నీ శిల్పనైపుణ్యమునకు, నీ ప్రతిభకు, సాధ్యముకాని వస్తువు లేదు-అని మా నమ్మకము, నాయనా !

భిక్షు ౧ : నీవు చిత్రించిన రాజ నర్తకి పశ్చాత్తాప ఘట్టము రాజ కుమారి జయశ్రీ చాలా మెచ్చుకొన్న దని విన్నాము.

నాగ : రాజ కుమారియా ?

భిక్షు ౨ : ఆంధ్రరాజ తనయ కళారాధన, తథాగతారాధన ప్రఖ్యాత ములు గదా !

ఆనంద . మా విశ్వాసము, బోధి సత్త్వుని కృప చాలును. నాగసుందరా, గొప్ప కార్యముగాని, కృతిగాని ప్రారంభించుటకు ముందు కొంత జంకు కలుగుట మహానుభావులకు సహితము సహజము.

నాగ : (కండ్లుమూసి తెరచి) అర్హతుల అనురాగము, బుద్ధదేవుని కరుణ - నా భాగ్యము.

ఆనంద : మాకిక వేళ అయినది.

[నిష్క్రమణ.

౨

[కొన్నాళ్ళ తరువాత, అదే ప్రదేశం. నాగసుందరుడు గోడముందు చిన్న యాసనముపై కూర్చుండును, నిమీలిత నేత్రుడై. గోడ మీద అక్కడక్కడ రేఖ లున్నవి.

౧ వ భిక్షువు, ఆంధ్ర రాజకుమారి జయశ్రీ ప్రవేశిస్తారు మెల్లిగా. అడుగుల చప్పుడు విని ఉలికిపడి కండ్లు తెరుస్తాడు నాగసుందరుడు. ఇద్దరినీ చూస్తాడు.]

భిక్షు 1 : నాగయ్యా ఈమె శ్రీ జయశ్రీ కుమారి. ఆంధ్ర రాజన్యుని పుత్రికా రత్నం.

నాగ : (లేవబోవును) రాకుమారికి మా స్వాగతము.

జయ : (ఆపుతూ) వద్దు, లేవవద్దు. నేను రాజపుత్రి నైనప్పటికి చైత్యంలో అందరూ సమానులే. అందులో ఉపాసకుడివి. శిల్పి సార్వభౌముడవు. నా కన్న నెక్కువ గౌరవమునకు నీవే అర్హుడవు.

భిక్షు 1 : నాగయ్యా, ఆలస్యమైనది. జయశ్రీ కుమారికి దారి జూపడానికి మాత్రం వచ్చాను. ఈమె సంగీత సాహిత్య నాట్యాది కళలలో నిపుణురాలు. బౌద్ధమత సేవా పరాయణ. నేను చెప్పలేదా ఆ నాడు నీ నర్తకి చిత్రం చాలా మెచ్చుకొన్నదని? క్రొత్త చిత్రము రచింపబోవుచున్నావని విని ఉత్సాహముతో వచ్చినది ... దేవీ, వెళ్లుచున్నాను.

[నిష్క్రమణ

జయ : (నవయౌవన వైభవం మూర్తీభవించినది. అంగసౌష్టవమున నేమి, రూపరేఖా విలాసాదులందేమి - నిరుపమాన. ఆమె వంపుల నడక, ఆమె కండ్లు, తెల్ల నాగుబామును స్ఫురింపజేస్తవి. నాగసుందరుని తదేక దృష్టితో చూస్తూ)

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు!

(పకపక నవ్వుచు నాగసుందరుని కనుగవ చూచి)

ఏమది అట్లు చూచుచుంటివి ?

నాగ : (సంకోచిస్తూ) ఏమీలేదు. మీరు నవ్వుతుంటే సెలయేటి రొదలు వింటున్నట్లుంది.

జయ : ఎంత చక్కగా మెచ్చుకొన్నావు! కానీ, నే నెందుకు నవ్వినానో, ఎన్నాళ్ళ కెన్నాళ్ళ కేమి జరిగిందో తెలుసుకోవాలని లేదూ ?

నాగ : అవును, ఉంది.

జయ : నీ వొక అమాయకుడవు సుమా!

నాగ : నిజమే. మీకెట్లు తెలిసింది?

జయ : స్త్రీలకు సూక్ష్మంగా గ్రహించగల బుద్ధి సహజం.. ..పోనీ చెప్తాను. గొప్ప చిత్రాన్ని చూచినప్పుడల్లా చిత్రించిన శిల్పి ఎలా ఉంటాడో అని చిత్తరువు చూచి భావనాశక్తి ఉపయోగించి ఊహించుకునేదాన్ని. ఆ తర్వాత తటస్థంగా ఆ చిత్రకారుని ముఖాముఖి చూచినప్పుడు నా ఊహ పూర్తిగా తప్పిపొయ్యేది. ఒకప్పుడు నా ఊహ ప్రకారం చిత్రకారుడు సన్నగా, పొడవరిగా, తీర్చిన ముక్కు, కండ్లు కలవాడుగా ఉండెను. ఇక అసలు చిత్రకారుడా - పొట్టిగా, లావుగా, చప్పిముక్కు, గుంటకళ్ళతో ప్రత్యక్షమయ్యాడు. ఆ పరాభవం తలచుకొనే నవ్వితిని - ఇక ఎన్నాళ్ళ కెన్నాళ్ళ కన్నది న్నిన్ను చూచే.

నాగ : అంటే ?

జయ : ఇన్నాళ్ళకు నా ఊహా చిత్రకారుడు సాక్షాత్కరించాడు అని.

నాగ : ఎక్కడ ? ఎవరు ?

జయ : అమాయకుడా – ఇక్కడే. నీవే.

నాగ : (సిగ్గుతో ఇటు నటు చూస్తాడు.) నేనా.. రాకుమారీ...

జయ : అయ్యయ్యో ! నా పనికి రాని మాటలతో నీపనికి అంతరాయం కలగజేస్తున్నాను. మారుని పరాజయం కదూ నీ చిత్రానికి వస్తువు! ఏ ఘట్టం చిత్రించబోతున్నావు ? తృష్ణ, రతి, రాగ సుందరులు బోధిసత్త్వుని ఎదుట నాట్య మాడిన ఘట్టమా ?

నాగ : (అవునని తల ఊపి సూచిస్తాడు.) చిత్తం రాకుమారీ.

జయ : ఇకనేమి. నీ శిల్ప ప్రతిభకు అనుకూలించే ఘట్టమే.

నాగ : కాదు, కాదు... అలా అనకండి. ఆ సుందరులు అతి రూప లావణ్యవతులు, అసమాన నాట్యకళా కోవిదలు. నాకు స్త్రీ సౌందర్య విలాసములతో ఎక్కడు పరిచయము లేదు. నాట్యశాస్త్రము కొంత చదువుకున్నాను గాని అభ్యాసము లేదు. నర్తకీ మణుల నాట్య ప్రదర్శనాలు చూచి ఎరుగను. అర్హత లేకుండా ఒప్పుకొన్నానేమో ఈకార్యం! ఏమిచెయ్యడానికి తోచడం లేదు.

జయ : నీకు కావలసిన సాహాయ్యం నే నిస్తాను. చూడు... (చిరునవ్వుతో) నన్ను బాగా చూడు. నీ శిల్పిదృష్టితో చూడు. నన్ను సౌందర్యవతి అని లోకులంటారు. చూడు. (లేచి తన అవయవ సౌభాగ్యము ప్రకటితమగునట్లు పచారు చేసి)...చూచావా ?

నాగ : (కండ్లతో సౌందర్యాన్ని త్రాగివేస్తూ) భాగ్యం, భాగ్యం లావణ్యమంతా మీలో అవతరించి వుంది. అంధత్వంచేచూడలేకపోయాను (అని తన చోరవకు జడిసి నాలిక కరుచుకొంటాడు.) దేవీ కరుణించు.

జయ : (నవ్వుచు) అంతేకాదు సుమా! నాట్యశాస్త్రం పుస్తకాలలో చదువుకోవడం కాదు. బాగా అభ్యసించినదాన్ని. రాజకుమారిని గాకపోతే రాజనర్తకినై వుండేదాన్నేమో ! నీకు నమ్మకం లేదుకదూ? (ఉత్తరీయం తీసి పారవేసి) ఇదిగో – ఇది పతాకహస్తం. ఇది త్రిపతాకం. ఇది మయూరం. ఇది శిఖరం. ఇది చక్రభ్రమరి. ఇది ఏకపాద భ్రమరి...అన్ని కరణాలూ నేర్చుకొన్నదాన్ని. చూడు ఇది సర్పితం. ఇది నాగాప సర్పితం. ఇది నితంబం. ఇది జనితం. ఇది వివర్తితం. (ఆయా హస్తాది విన్యాసములు చూపిస్తుంది.)

[“ప్రియే చారుశీలే” అనే పాట.]

నాగ : అద్భుతం. అనిర్వచనీయం.

జయ : ఇంత మాత్రానికేనా ! పారానికి ఉదాహరణం చెప్పినట్లు చేశాను. అసలు నేను నృత్యం చెయ్యనే లేదే. రాగభావ లయాన్వితంగా నాట్యంచేసి అభినయించినప్పుడు గదా రసము నిష్పత్తి యగును. (ఇటునటు చూచి) ఇక్కడ నే నెలా నాట్యం చెయ్యగలను? (నవ్వి) చెప్పు!

నాగ : ఏమి చెప్పడానికి తోచడం లేదు దేవీ.

జయ : (తటాలున) ఆఁ - ఇలా చెయ్యి. నేడు రాత్రి అంతఃపురానికి వస్తే, నాట్యం చేస్తాను .. నర్తన శాలలో, నా చెలు లుంటారు తాళ గీత వాద్యాలకు. మా అతిధిగా వస్తే సత్కరిస్తాము. భయము లేదు.

నాగ : (సందేహం సూచించే మౌనం అవలంబిస్తాడు) నేను...అంతః పురానికా ? వద్దు. రాలేను దేవీ!

జయ : ఓహో ! శంకిస్తున్నావు గాబోలు. నేను నిన్ను ఆహ్వానించినది అంతఃపురానికి, వేశ్యావాటికకు గాదు. అటువంటి సిద్ధార్థుడే ఆమ్రఫలి వంటి భోగ స్త్రీ ఇంట విందు గుడువ లేదా ? (నవ్వుతూ) నేనేమి ఆమ్రఫలికి తీసి పోయినానా ? నీవుమాత్రం బుద్ధునంత వాడవైనావా ఏమి ?...ఈ వెరిసందే హాలువదలి పెట్టి వస్తావుకదూ? తప్పక. నేను వెళ్ళిపోవాలి. నిరీక్షిస్తూఉంటాను. (వల్లెవాటు వేసుకొని నిష్క్రమిస్తుంది.)

నాగ : దేవి, దేవీ - నేను రా లేను. ...బుద్ధం శరణం గచ్ఛామి.

భిక్షు ౧ : ఏమి నాగయ్యా, తీవ్రా లోచన ?

నాగ : (దీనంగా భిక్షువు చేతులు పట్టుకొని) ఏమి చెయ్యను? రాజ కుమారి అంతఃపురానికి ఆహ్వానిం చింది, నేటి రాత్రికి, నాట్య ప్రదర్శనా నికి. నా చిత్రానికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పింది. ఏమి చెయ్యను ? అక్కడికి ఎలా వెళ్ళగలను ? నాకేమీా పాలుపోకుండా వుంది.

భిక్షు ౧ : వెళ్లు నాయనా. రాజ కుమారి ఆహ్వానం ఆజ్ఞ కాదా నీకు ? ఆమె గొప్ప నర్తకి అని ప్రఖ్యాతి. నీ వదృష్టవంతుడవులే !

నాగ : (ఆశతో) అయితే వెళ్ళ మంటావా ? వెళ్ళవచ్చునా ?

భిక్షు ౧ : వెళ్లు. కాని... (నాగు చెయ్యి తన చేతులతో పట్టుకొని) నాగూ, బుద్ధ భగవాను డేమని పల్కి నాడో జ్ఞాపకం ఉంచుకో !

కామతో జాయతే సోకో
కామతో జాయతే భయం ।
కామతో విప్ప ముత్తస్స
నత్థిసోకో కుతో భయం ॥

నాగ : ఆ యుపదేశం మరచిపోను.

భిక్షు ౧ : బుద్ధం శరణం గచ్ఛామి.

3

[సాయంకాలం. నాగసుందరుడు కూర్చుని కూనిరాగంతో పాడుకొంటున్నాడు. ౧ వ భిక్షువు ప్రవేశిస్తాడు.]

భిక్షు ౧ : ఏమి నాగయ్యా, ముస్తాబై కూర్చుంటే రాజకుమారి దగ్గరకు ఎలా వెళ్తావు ? అసలు అంతః పురం ఎక్కడుందో తెలుసునా ?

నాగ : ఎప్పుడో చిన్నప్పుడు చూచాను...మా అమ్మతో వెళ్ళాను. అవును. ఇక్కడికి చాలా దూరంకదూ?

భిక్షు ౧ : అవును. మూడుక్రోసులు పైగా...

నాగ : అయితే ఏమి చెయ్యను?

భిక్షు ౧ : సంకల్ప మాత్రంలో ఆకాశ గమనం చేసే యోగసిద్ధి కలిగిం దేమో అనుకున్నాను.

నాగ : పరిహాసం చేస్తే ఎలాగు ?

భిక్షు ౧ : సరే, చూద్దాం. ఏదైనా ఆ దారిని బోయే శకటం దొరుకుతుందేమో.

నాగ : (లేస్తాడు.)

[ఇంతలో ౧వ పరిచారకుడు ప్రవేశిస్తాడు.]

పరి ౧ : నాగయ్యగారూ, మీ కోసరం అంతఃపురం నుంచి బండి వచ్చిందండీ.

భిక్షు ౧ : ఇంకేమి - అదృష్టవంతుడవు. వెళ్లు. (నాగసుందరుడు వెళ్ళబోతూ వుంటే) మరిచిపోవు కదూ నేను చెప్పింది. "కామతో జాయతే శోకో..."

నాగ : మరచిపోను. "కామతో జాయతే భయం."

౪

[రంగం - అంతఃపురంలో నర్తనశాల. నాగసుందరుడు ప్రవేశించగానే పరిచారికలు వస్తారు.]

పరి ౧ : ఆర్యా, ఇటు...ఇటు... ఇదిగో సుఖాసనం...అలంకరించండి...

నాగ : (కూర్చుండును.)

పరి ౨ : (ఒకపళ్ళెములో గంధపు గిన్నె, పన్నీరు చెంబు ఉంచి సమీపించి) ఇది చందన లేపము! (చేతులకు రాయబోవును.)

నాగ : వద్దు, వద్దు. నాకు చందన లేపన మెందుకు ?

పరి ౨ : (నవ్వి) పోనీ, మీరే తీసుకోండి ! (అందిచ్చును.)

నాగ : మాబోటి వాళ్ళ కెందుకు ఇవన్నీ ?

పరి ౨ : ఇది అతిథి సత్కారం, అంతఃపుర సంప్రదాయం ! పన్నీరు చల్లనా ?

పరి ౧ : (పన్నీరు పైన చల్లుతుంది.)

నాగ : చాలును. ఏమి పరిమళం !

పరి ౨ : (పళ్ళెము క్రిందపెట్టి) మల్లెపూలహారం వేస్తానుండండి.

నాగ : నేను వేసుకోవటానికి అర్హత లేదు. బౌద్ధ సంఘానికి చేరిన ఉపాసకుణ్ణి. (తీసివేయబోవును.)

పరి ౨ : తీయవద్దు...మా దేవిని తృణీకరించినట్లు !

పరి ౧ : ఆ మాల వేసుకుంటే ఎంత సొగసుగా ఉన్నారు !

పరి ౨ : (ఒక పళ్ళెము అనేక రకాల పళ్ళతో ప్రక్కన వుంచి) ఆర్యుల ఇష్టము...ఫలాలు స్వీకరించండి.

నాగ : ఆకలి లేదు.

పరి ౨ : (నవ్వి) బౌద్ధ భిక్షుకులు ఫలాహారం పుచ్చుకోవచ్చును.

నాగ : అదికాదు,

[ప్రవేశం లోపలనుంచి కాలిగజ్జెల రవళితో జయశ్రీ]

జయ : శిల్పి సార్వభౌములకు నమస్కృతులు. ఓహో - ఆ చందన చర్చ ఆ పుష్పహారము - అచ్చం పెండ్లికొడుకువలె నున్నారు.

నాగ : (సిగ్గుతో) మీ సఖుల ఆజ్ఞానుసారి నైనాను. (హారం తీయబోవును.)

జయ : (వారించి)వద్దు. తీయవద్దు. ఎంతో బాగుంది! ... ఒసే చారులతా, ఆ సంపెంగ హారం ఎక్కడనే ?

పరి ౨ : ఇదుగోనమ్మా !

జయ : ఇది నా కానుక! (మెడలో వేయును.)

నాగ : (పులకితుడై) ధన్యుణ్ణి! జయ! అనుగ్రహింప బడినవాణ్ని!...

(ఇంకొక ఆసనముపై కూర్చుండును)

మదనికా! శకటయానంవల్ల అలిసినారు. ఈ పానీయం సేవిస్తే అలసట మాయమవుతుంది. నా నృత్యాన్ని పూర్తిగా ఆమోదించగలను.

నాగ : ఏమిటి?

జయ : ద్రాక్షరసం! ప్రత్యేకం మీ కోసరం తయారు చేయించాను.

నాగ : మధువా!

జయ : (నవ్వి) ఎన్ని సందేహాలు! మధువు కాదు. చూడండి! నేనుకూడా తాగుతున్నాను. (ఇంకొక పాత్ర పుచ్చుకొని కొంత తాగుతుంది.)

నాగ : (తప్పించుకోలేక) క్షమించండి. (కొంచెం తాగి) ఎంత మధురంగా వుంది!

జయ : ధన్యురాల్ని!... (నాగ సుందరుని వంక తదేక దృష్టితో చూచి పరిచారికలతో) వెళ్లండి, అందరూ! మదనికా, వీణ తంత్రులు మేళవించి ఉంచు! (పరిచారికలు వెళ్తారు)...అబ్బ, ఇప్పుడు మనం ఇద్దరమే!... కృత్రిమ మర్యాదలు చాలిస్తాను. నాగసుందరా! నిన్ను చూచేకొద్దీ నా మనసులోని ప్రశ్న నిశితమైపోతూ వుంది. అడగవచ్చునా?

నాగ : మీకు తెలియనిది - నాకు తెలిసినది ఏదైనా ఉంటే.

జయ : పరిచారికలు లేరు నన్ను మీరూ అని అనక్కరలేదు. నాకు తెలిసిందైతే నిన్ను ఎందుకు అడుగుతాను? నీకు తెలియంది నీవేమి చెప్పగలవు? అయితే ఒకటి. నీకిష్టం లేకపోతే చెప్పవద్దు.

నాగ : ఎంత ఉపోద్ఘాతం! ఏమిటో ఆ ప్రశ్న?

జయ : నీవు లోకాన్ని పరిత్యజించి ఉపాసకుడ వెందుకైనావో అడగవచ్చునా?

నాగ : నేను లోకంలోనే వున్నానే!

జయ : అబ్బ! అదికాదు- సంసార సుఖాల్ని అన్నీ వదలుకొని...

నాగ : సంసారంలో సుఖం ఉందా?

జయ : ఇష్టంలేకపోతే చెప్పనక్కరలేదన్నానే!

నాగ : కోపం వచ్చిందా? నా కథ అంతా వింటే అర్థమవుతుంది. కానీ, నా గొడవతో...మీ .. నీకు విసుగు పుట్టిస్తానేమో అనే సంకోచం ఉంది.

జయ : నీ మాటలు విన్నకొద్దీ ఇంకా వినాలనని ఉంటుంది. అందులో నీ స్వంతకథ చెప్తుంటే, నా శరీరమంతా చెవులే!

నాగ : అయితే విను. నాజీవితంలో నా అన్న వ్యక్తి మా అమ్మే! నా తండ్రి ఎవరో నాకు తెలియదు.

జయ : అంటే, మీ అమ్మకు వివాహం కాలేదా?

నాగ : లేదు. అమె ఒక గొప్ప గాయకి. నర్తకి.

జయ : నిజంగా?

నాగ: పెద్ద భవనంలో ఉండే వాళ్లము. ఎక్కడ చూచినా చిత్తరువులు, ప్రతిమలు. నానా దేశాలనుంచి తెచ్చిన గృహాలంకారాలు. ఎప్పుడూ సంగీతం, నృత్యం, కవితాగోష్ఠి. రాజకుమారులు అశేషధనవంతులు, వర్తకులు, ఎందరో వచ్చేవారు మా ఇంటికి. మా అమ్మ నన్ను అల్లారు ముద్దుగా పెంచింది. కావ్యాలు చదివించింది. నాకుమాత్రం చిత్రలేఖనమే అభిమానకళగా ఉండేది, చిన్నప్పటినుంచీ.

జయ: మొగ్గ లేనిది పుష్పం వస్తుందా?

నాగ: ఒకనాడు ఈడు కుర్రవాళ్లతో ఆడుకొంటూ ఉండినాను. ప్రతి ఆటలో నేనే గెలిచాను. అందుకని ఒక కుర్రవాడు చాలా అసూయతో నన్నుచూచి– దాసీలకు, దాసీ కొడుకులకేఅదృష్టమంతా–అన్నాడు హేళనగా. మిగతా కుర్రవాళ్లందరూ విరగబడి నవ్వారు. నాకు రోషం, కోపం, దుఃఖం పొంగివచ్చింది. ఏమీ అనకుండా ఒక్కపరుగున ఇంటికివచ్చి మా అమ్మని కావిలించుకొని వెక్కి వెక్కి ఏడ్చాను. అమ్మకు ఏమీ అర్థం కాలేదు – దెబ్బ తగిలిందా, పడ్డావా– అని అడిగింది. లేదన్నాను. ఒంట్లో బాగాలేదా అని మళ్లీ అడిగింది. లేదన్నాను. చివరకు చెప్పినాను ... అది విని మా అమ్మ నన్ను చేరదీసి – అంతమాట అన్నారా, నాయనా? నీవు మళ్లీ వాళ్లతో ఆడుకోవద్దు. మనం తీర్థయాత్రకు వెళ్ళి వస్తాం. కొత్త కొత్త ఊళ్లు, చైత్యాలు, విహారాలు, అన్నీ చూద్దాం – అని ఓదార్చింది. అలాగే వెళ్ళివచ్చాము. అప్పటి నుంచి మా యిల్లు ధోరణే మారిపోయింది... ఎవరో కవులు, పండితులు, గురువులు, శిల్పులు వచ్చేవారుగాని, పెద్దపెద్దవాళ్లు ఎవ్వరూ వచ్చేవారుకారు. మా అమ్మ నృత్యం చేయడం మానేసింది.

జయ: పాపం!

నాగ: పాపమని ఎందుకన్నావు? పుణ్యం ..కొన్నిరోజుల తరువాత ఒకరోజు నేనూ మా అమ్మా మేడమీద కూర్చుంటే ద్వారం దగ్గర ఒక భిక్షువు గంభీరస్వనం వినబడింది. భిక్షాందేహి మాతా అని. అమ్మ తొందరగా ఒక పళ్లెంలో పళ్లు పెట్టుకొని క్రిందికి వెళ్లింది భిక్ష ఇయ్యడానికి – నేనూ వెళ్లాను కూడా. ఆ భిక్షువు స్ఫురద్రూపము, శాంతమూర్తి నన్ను తక్షణమే ఆకర్షించింది. నమస్కరించాను. ఆయన అమ్మ తెచ్చినపళ్లు చూడనన్నా లేదు – నన్ను చూపించి, 'కొడుకా?' అని అడిగాడు. అవునన్నది అమ్మ. ముఖంలో ఏమి తేజస్సు అని మెచ్చుకున్నాడు. సిగ్గుతో అమ్మ – బ్రాహ్మణ పుత్రుడు – అన్నది.

జయ: ఆఁ

నాగ: కథ ముగింపుకు వచ్చింది. భిక్షువు మా అమ్మని దీర్ఘంగా చూచి, 'అమ్మా, నేను కోరిన భిక్ష ఇస్తావా?' అని అడిగాడు. 'తప్పక – బంగారా, మణులా?' అన్నది అమ్మ. 'అవును రత్నం...నీ పుత్రరత్నాన్ని ఇస్తావా మా సంఘానికి?' అమ్మ కళ్ళల్లో నీళ్లు

నిండినవి. ఒక్క క్షణం ఊరకుంది... ధైర్యంతో, 'బుద్ధదేవుని అనుగ్రహం!' అన్నది.

జయ : ఎట్టి మహనీయ !

నాగ భిక్షువు ముఖంలో ఆనందం తాండవ మాడింది. నన్ను చూచి .. "నాయనా నా వెంట అను - బుద్ధం శరణం గచ్ఛామి-" నేను ఆ విధంగానే అన్నాను. (కండ్లు మూసుకొని) బుద్ధం శరణం గచ్ఛామి, బుద్ధం శరణం గచ్ఛామి... (అంటూ ఉంటాడు.)

జయ : (మెల్లగా ఏడుస్తూ వుంటుంది.)

నాగ : (కండ్లు తెరచి) అదీ నా పూర్వగాథ. (జయశ్రీని చూచి) అయ్యయ్యో ఏమిటి ?

జయ : (ఉత్తరీయంతో కండ్లు తుడుచుకొని) ఏమీ లేదు. ఎంతబాధ పెట్టాను నిన్ను ! క్షమించు ..అయ్యో, ఏమిచేశాను! నృత్యం చేసి చూపిస్తానని ఆహ్వానంచేసి క్రూరంగా ప్రవర్తించాను. (చేతులు తట్టి) మదనికా, చారూ! వాద్యాలు...వీణమెట్లు మేళవించినావు కదా ?

[పరిచారికలు వీణ మొదలైన వాద్యాలతో ప్రవేశిస్తారు. రంగస్థలానికి ఒక ప్రక్క కూర్చుంటారు. జయశ్రీ నాగసుందరునికి నమస్కరించి రంగస్థలానికి వెళ్తుంది.

"చందన చర్చిత"...అనే పాట.

నృత్యం ముగించిన తరువాత]

జయ : (నాగసుందరుని సమీపించి) నచ్చినదా నృత్యం ?

నాగ : నేను మాట్లాడే స్థితిలో లేను.

జయ : నేనూ అంతే!...

[ఇద్దరూ కొంతసేపు మాట్లాడరు. దూరంలో ఘంటలు వినబడుతవి.]

జయ : రాత్రి రెండు ఝాములైనది. నీ ఆకలి దప్పులుకూడా గమనించ లేదు.

నాగ : (మృదువుగా) అమృతం ఆస్వాదించిన వానికి ఆకలి దప్పులుండవు ..

జయ : కవీశ్వరుడవు...(ఆర్ద్రంగా చూస్తుంది.)

నాగ : (కండ్లు మూసుకొని) కామతో జాయతే సోకో...

జయ : పొరబడుతున్నావు! కళారాధనలో, రసాస్వాదనలో కామం లేదు...రసానుభవం కామానికి అతీతమైంది. అలౌకిక ఆనందం కళలవల్ల కలిగేది!...

నాగ : ఆలస్యమైంది, వెళ్ళనా ?

జయ : నీ యిష్టం .. మదనికా, శకటం !

నాగ : సెలవు.

జయ : ఒక చిన్న ప్రశ్న... నీ తల్లి పేరు అడగవచ్చునా ?

నాగ : (నిట్టూర్చి) ఆమె చనిపోయింది...పేరు నాగమణి.

జయ: నాగమణి, సుప్రసిద్ధ నర్తకి! ఆమె రాజనర్తకిగా ఉండినది కదా ?

నాగ : అవును. (లేచి) సెలవు. మీ ఋణం తీర్చలేను.

జయ : (నమస్కరిస్తుంది.) నమస్కారం.

నాగ : మీరు నాకు నమస్కరింపరాదు.

జయ : ఎందుచేత ? మీకన్న

చిన్నదానను. మీరు సిద్ధహస్తులు. అదీ కాక, నా నమస్కారం మీకు మాత్రమేకాదు – మీ అమ్మకున్నూ!

నాగ : సుఖీభవ! సెలవు.

[నిష్క్రమణ.

జయ : (ద్వారం చూస్తూ) నాగ సుందరా... నా సుందరా...

[మరునాడు అదే ప్రదేశం. నాగసుందరుడు గోడముందు కూర్చుని, కండ్లుమూసుకొని కలలు గంటున్నాడు.]

భిక్షు ౧ : నాగూ, కల గంటు న్నావా ?

నాగ : (తెప్పరిల్లి) నమస్కారం.

భిక్షు ౧ : నిన్నరాత్రి నాట్యం బాగుందా ?

నాగ : (ఉత్సాహంతో) నాట్యం అనే పదం ఆ చమత్కృతికి, ఆ ప్రావీణ్యానికీ చాలదు. ఆనందానుభవం కళల వల్లనే గాని వేరే విధంగా లభించదని నిన్నే గ్రహించాను. ఏమి ఆ సౌందర్యం, ఆ అవయవ సౌభాగ్యం, ఆ రామణీయకం, ఆ లయాత్మకమైన రసోత్కర్ష! పరవశుడనై పోయాను! ఈ లోకం విడచి మేఘమార్గాల్లో ఇంకో లోకానికి ఎగిరిపోయాను. నాట్యం ముగించిన తర్వాతనుండి లోకంలో అన్ని వస్తువులు, వ్యక్తులు, నిర్వీర్యంగా, నీరసంగా కనిపిస్తున్నవి

భిక్షు ౧ : వర్ణన చాలును. ఒక్క రాత్రి కొంత కాలమైనా కావలసినంత అనుభవం పొందావు. ఇక చాలును. నీ పని నిర్విఘ్నంగా సాగించు. నాకూ పను లున్నవి. (నిష్క్రమించును.)

నాగ : అవును. కాలం వ్యర్థంచేసు కొంటున్నాను. (కుంచెతో ఒక నర్తకి బొమ్మ వ్రాస్తూ వుంటాడు.)

[జయశ్రీ ప్రవేశిస్తుంది.]

జయ : ఏమి, నచ్చిందా నిన్న రాత్రి నాట్యం ?

నాగ : నచ్చిందా ?! పారవశ్యు డనై పోయాను!

జయ : అవును. నాకు చాలా సంతోషమైంది. అభ్యాసం లేక, అభి నుతి లేక, దోహదం లేని అశోకంలాగు నా విద్య వాడి శుష్కించిపోతూవుంటే నీవు నాకొక క్రొత్త ఉత్సాహం కలి గించావు. నాట్యంమీద నాకు అను రాగం మళ్ళీ సృష్టించావు. నిన్ను చూస్తూ నృత్యంచేసినప్పుడు నృత్యంలో లీనమైపోయాను. నీతో కూడా...

నాగ : ఈ విధంగా మాట్లాడవద్దు. దేనిమీదా అనురాగం ఉండకూడదు. అనురాగం శోకహేతువు.

జయ : ఊహుఁ! గ్రంథాల్లోని మాట లవి. నీ హృదయంనుంచి వచ్చి నవి కావు. సౌందర్య పిపాస సహజం కాదా ? ఆనందానుభవం లోకు లంద రికీ సమానం కాదా ?

నాగ : అలాకాదు. ఈ రాగమే తృష్ణ – కామతృష్ణ, భవ తృష్ణ! భగ వానుడు బోధించినది నీకుమాత్రం తెలియదా ? తృష్ణాలత గట్టిగా వేళ్లు నాటుకొని, పైపైకి పాకి అల్లుకోక మునుపే త్రెంచివెయ్యవలెనని. ఆ తీగ నన్ను చుట్టుకుంటే మళ్ళీ వదిలించుకో లేను.

జయ : నీవు కూడానా ?

నాగ : ఏమో, ఎవరు చెప్పగలరు?

జయ : (మౌనంగా గోడవంకకు చూస్తూ) ఆc, ఆ నర్తకి భంగిమం నిన్నరాత్రి నా నాట్యంలోనిది కాదూ?

నాగ : (ఉలికిపడి) అలాగా ? కావచ్చును.

జయ : ఇంకేమి? నాగర్వానికి మితి లేదు ! (మళ్ళీ చూచి) చూడు, ఆ వైపు ఆ వంపు కొంత జారినట్లున్నది కాదా? (ఆ రీతిగా దగ్గిరనిలబడుతుంది.)

నాగ : (చలిస్తుంది మనస్సు) అవును. సవరిస్తాను. ప్రొద్దైనది, వెళ్తారేమో !

జయ : కాదు, కాదు. నే నుంటే నీ పని సాగదు. అదేనా ?

నాగ : (తలవంచుకొని) అవును.

జయ : (బిగ్గరగా నవ్వుతూ) అయితే వెళ్తాను ! (అతని చెయ్యి పట్టుకుంటుంది.)

నాగ : (జంకుతో చెయ్యి లాగివేస్తాడు.) చెయ్యి వదలమని ప్రార్థిస్తున్నా.

జయ : ఏం ? భయమా కరుస్తానని ? నాగుబామునా ?

నాగ : (నమస్కరించి) క్షమించండి.

జయ : (నవ్వుతూ నిష్క్రమిస్తూ) వెళ్ళిపోతాలే !

నాగ : (ఆ నవ్వు ప్రతిధ్వనులు వినకుండా చెవులు మూసుకుంటాడు. ఆ తర్వాత ఆవిడ పట్టుకొన్న చెయ్యి చూసుకుంటాడు.)

౬

[కొన్ని రోజుల తర్వాత సాయంత్రం నాగసుందరుడు, చుట్టూ రంగుపాత్రలు, కుంచెలతో కూర్చున్నాడు నృత్యం చేస్తూవున్న రతి బొమ్మ పూర్తి అయింది కుంచె తీస్తాడుగాని మళ్లీ పారవేసి కండ్లు మూసుకుంటాడు ప్రవేశం జయశ్రీ చప్పుడు చెయ్యకుండా అతని వెనక నిల్చుని రతి చిత్తరువుచూచి అందులో తన రూపం గుర్తిస్తుంది ఆనందంతో మెల్లిగా అతని భుజాన్ని చేతితో తాకుతుంది]

నాగ : (తుళ్ళిపడి) వచ్చి ఎంత కాలమైంది, దేవీ ?

జయ : ఇప్పుడే వచ్చా.

నాగ : ఎందుకు వచ్చావు ?

జయ : నాలుగు రోజులైనవి నిన్ను చూచి!

నాగ : అయితే ?

జయ : ఇంతేనా ? అర్థం కాలేదా నీకు. గొప్ప శిల్పివే ! కళోపాసకుడివే! మనోభావాల్ని అర్థం చేసుకోకుండా శిల్పి ఎట్లా కాగలవు ? కాదు, ఎందు కర్థంకాదు ? చెప్పు, నిజంగా చెప్పు ? నీవు లేకుంటే నా జీవితం శూన్యం. వ్యర్థం, నిరర్థకం, అంధకార మయం– అని నీకు తెలియదూ ? నేను నీకు రాజకుమారిని గాను, దాసిని.

నాగ : తప్పు తప్పు. జ్ఞానం గల నీవే ఇలా మాట్లాడితే నేనేమి చెయ్యను? నేను కళోపాసకుడిని గాను. బౌద్ధ ధర్మోపాసకుడిని. నా వంటివాని జీవితంలో నీవంటి వాళ్ళకి చోటులేదు.

జయ : మీ ధర్మంలో హృదయానికి చోటే లేదా ?

నాగ : పొరబాటు. అహింసనే పరమధర్మంగా సాధించే బౌద్ధనీతిలో

హృదయానికా చోటు లేదు ? దుఃఖ భాజనములైన శతసహస్ర కోట్లమీాద తన అపారమైన దయ ప్రసరింపజేసిన బుద్ధదేవుని మతంలో హృదయానికి చోటు లేదా ? ఎంత పొరబడు తున్నావు ?

జయ : (జాలిగా) నేనీ దుఃఖంలో ఉన్నానే, నా దుఃఖం తీర్చడం నీకు విధి కాదా ?

నాగ : అవును. ఈ దుఃఖాన్ని తీర్చే మార్గం లేకపోలేదు. కానీ, అది నీవు కోరే మార్గం కాదు. ఈ దుఃఖానికి కారణం తృష్ణ, కామం, శారీరక సుఖాపేక్ష. ఆ కారణాన్ని నిర్మూలిస్తే దుఃఖం నశిస్తుంది. తథాగతుడు ఉపదేశించిన అష్టమార్గమే నీకూ నాకూ అవశ్యమనుసరణీయం !

జయ : (నిట్టూర్చి) అంతేనా ? ఆ రతి అంత సుందరంగా నృత్యం చేసినా ఆ బుద్ధదేవుడు చలించనట్లే నేను నృత్యం చేసినా నీ మనస్సు చలించదు గాబోలు !

నాగ : అపచారము. బుద్ధదేవుడెక్కడ ? నేనెక్కడ ? (దీనంగా జయశ్రీ ముఖం చూస్తూ ఉంటాడు.)

జయ : (ఏడుస్తూ నిలబడుతుంది.) అంతేనా ? నీ మనస్సు కరుగదా ?

నాగ : (కరగి లేచి ఉత్తరీయంతో కన్నీరు తుడుస్తాడు.) దేవీ, కన్నీరా ? తప్పు, తప్పు.

జయ : (హఠాత్తుగా అతని కుడి చెయ్యి పట్టుకొని, గట్టిగా ముద్దుపెట్టుకొని, వక్షస్థలాన్ని అదుముకుంటుంది.) నాగసుందరా ! నాగసుందరా !

నాగ : (ఒక క్షణంవరకు ఊరుకుంటాడు. తర్వాత చెయ్యి విడిపించుకుంటాడు.) దేవీ, ఏమిటిది ? .. బుద్ధం శరణం గచ్ఛామి.

జయ : అపరాధం. క్షమార్హాను ఇక నిన్ను బాధపెట్టను. నమ్ము ... నీ వెనక నిలబడి చూస్తూ వుంటాను, నీ శిల్పవైభవం!

నాగ : (దిగ్భ్రమ చెందినవాడివలె పీఠం మీాద కూర్చుంటాడు కుంచె రంగు పాత్రలో ముంచి గోడవరకు ఎత్తి, క్రిందపారవేసి, ఆమె యేచోట ముద్దుపెట్టుకుందో ఆ చోటు చూచుకొంటూ వుంటాడు కుంచె క్రిందపడి గోడ మూలకు దొర్లిపోతుంది మరల దొర్లిపోయిన కుంచె తీసుకోవడానికి చెయ్యి చాస్తాడు. ఆ క్షణంలో గోడమూలనుంచి ఒక తెల్లనాగు సరసరవచ్చి, ఆ చేతిమీాద కాటువేసి మాయమవుతుంది)

ఆఁ, నాగుపాము. నాగము . అబ్బా కాటు...కాటువేసింది .. హా... (అని కరచిన చేతిని ఇంకో చేతితో పట్టుకొని ఘోరమైన బాధతో నేలబడి స్మృతితప్పుతాడు.)

జయ : (జరిగినది చూచి)అయ్యో, తెల్లనాగు, నాగసుందరా, ఉండు, నిన్ను రక్షిస్తా ! అమ్మా, అయ్యో...

[అని అరచి, తక్షణం మోకాళ్ళమీదబడి, నాగసుందరుని కుడిచేతిని కాటుపడిన చోటున పండ్లతో రక్తం వచ్చేవరకు కొరికి, పెదవులతో విషం పీల్చేస్తూ వుంటుంది. రక్తంలో కూడా రెండు నిమిషాలకే విషప్రభావం కనపడుతుంది. భరించలేక కంఠం రెండు చేతులతో గట్టిగా పట్టుకొని పడిపోతుంది నోట నురుగులు.

ఈ విధంగా జరుగుతూ ఉన్న సమయంలో త్రిపిటకమునుండి ఎవరో పఠించడం

అస్పష్టంగా వినబడుతూ ఉండి ఆగిపోతుంది. తదుపరి ప్రవేశం ఆనందార్హతుడు ౧వ భిక్షువు.]

ఆనంద: నాగూ! ఎవరీ పడియున్నది! నాగూ! రాకుమారి! కాగడాలు, కాగడాలు! పాము, నాగుబాము .పారిపోతుంది!

[౧వ భిక్షువు తన చేతిని ఇద్దరి ముఖాల దగ్గిర ఉంచి చూస్తాడు. జయశ్రీ శ్వాసహీనగా గ్రహించి పెదవి విరుస్తాడు నాగసుందరుడు మాత్రము ఇంకా ఊపిరితో ఉంటాడు ఇంతలో కాగడాలతో పరిచారకులు ప్రవేశిస్తారు ఆ వెలుతురులో తెల్లనాగు కనబడి పారిపోతుంది]

తొందరగా. తొందరగా, విషహారిణి! (నీళ్లు నాగసుందరుని ముఖముపై చల్లి, తీసుకొనివచ్చిన మందు, రక్తం వచ్చిన చోట చేతికి పూస్తాడు. కొంత కాలానికి నాగసుందరుడు కండ్లు తెరుస్తాడు.) నాయనా! నాగూ! నాగూ!

నాగ: (ఆనందుని చూచి) స్వామీ.. తెల్లనాగు! జయశ్రీ ఏమయింది?

ఆనంద: (సూక్ష్మంగా ఎంతో అర్థంచేసుకొని) అదుగో, నీ ప్రాణం కోసరం తన ప్రాణాన్ని అర్పించిన మహాత్యాగిని! అదుగో - నిన్ను రక్షించి తన్ను శిక్షించుకొన్నది!

నాగ: (కండ్లు మూసుకుంటాడు.) రాకుమారి!

ఆనంద: (అతనివెంట అందరూ)

ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి.

[తెర]

['ఆకాశవాణి' సౌజన్యంతో]

అల్లసాని వాని అల్లిక జిగిబిగి

కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

3

పెద్దన్నగారు తమ రచనా శక్తియంతయు ప్రవరుని కథలో గుప్పించి వదలిపెట్టి నారనుట సందేహములేదు. కథను వ్రాయుటలో ననేక విధములైన ప్రతిభలు చూపించవచ్చును. ఒకటి- తన పాత్రలను తీర్చి దిద్దుట. రెండవది-ఉచిత వర్ణనలు చేయుట, ఆ వర్ణనల యందు న్యూనతాధిక్యములు లేకుండ తూచినట్లుచేసి యమరించుట మూడవది - తాను చేసెడు పద్యరచన తద్రసభావముల కనుగుణముగా నుండుట. ఇది చాల పెద్ద విషయము చాల క్లిష్టమైన విషయము. ఇది కవియైన ప్రతివానికిని తెలిసెడిది కాదు ఒకపని తెలిసి చేయుట, తెలియకుండ చేయుట - అని రెండున్నవికదా! ఒకఁడొక పనిని తెలియకుండఁ జేసెను అది బాగుగనే యున్నది. అట్టిదాని నేఘుణాక్షర న్యాయ మందురు. పురుగు మంటిలో తిరిగినది. ఆ గీతలొక యక్షరముగా రూపొందినవి ఆ పురుగున కది యక్షరమని తెలిసి గీయలేదు. అట్లు ఒక మంచి పద్యము రచనా శిల్ప మెఱుఁగని యొక కవియొక్క నోటినుండి వచ్చినచో నది యట్టిదే ఆ పురుగు గీచిన గీత లొక్క యక్షరమగును గాని అన్ని యక్షరములు గావు ఒక శబ్ద మేర్పడదు, ఒక వాక్యమేర్పడదు అట్లే రచనా శిల్ప పరిజ్ఞాత కాని కవియొక్క కావ్యము సర్వరమణీయముగా నుండదు సర్వ వృత్తౌచిత్యము భాసించదు. యధార్థమైన కావ్యశోభ కలుగదు. కవియైన వానికి మొట్టమొదట తెలిసికొనవలసిన విషయము రచనా శిల్పము ఈ రచనా శిల్పము సూక్ష్మముగాఁ జూచినగాని తెలియదు. తెలుఁగులోఁ గొన్ని పద్యములు ప్రవాహముగా నడుచును. దీనికి ధారాశుద్ధి యని సరస భూపాలీయ కర్త పేరు పెట్టెను. గురుమూర్తులు శ్రీ చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగారు ఈ మాటకు పెద్ద పలుకుబడియు ప్రాధాన్యమును తెచ్చిపెట్టిరి. ఈ ధారాశుద్ధి కలిగిన పద్యములు నోట నలుగుటకు వీలున్నది. కావ్యగతములు కాని చాటువులందీ ధారాశుద్ధికి మంచి స్థానము కలదు కావ్యము నందీ ధారాశుద్ధి మాత్రమే తీసికొని, పద్యరచన చేసినచో కావ్యశోభ తగ్గిపోవును. అట్టి పద్యరచన యందొక శోభయుండును దాని శోభ దానిది సీతాకోక చిలుకవలె నలంకరించుకొను స్త్రీ యొక్క సౌందర్య మామెది ఇల్లాలట్లలంకరించుకొనరాదుగదా? అట్లే. కావ్యగతమైన పద్యరచనయొక్క లక్షణము వేఱు కొందరిల్లాండ్రలంకరించుకొందురు. ఇల్లాలి తనమేమియు చెడదు ఆ రీతిగా కావ్యము లందలి పద్యరచనయందు గూడ నొకానొక ధారాశుద్ధి యుండును సర్వపద్యమునందు ధారాశుద్ధి యుండిననే పద్య మనిపించుకొనును. లేనిచో పద్యపు కూర్పు కొకిబికిగా నుండును గదా!

ధారాశుద్ధి యనఁగా అక్షరముల కూర్పుయొక్క సాగుట ప్రధానముగాఁ గలిగిన శబ్దముల పొసగింపుచేత కలుగు నొకానొక గుణము. అర్థ ముండును. అచట నున్న భావముల కది యుచితమా యన్న ప్రశ్న వచ్చినచో కష్టమగును. ఒకానొకఁడు తా నంతవాఁడ నింతవాఁడ నని చెప్పికొనుచున్నాఁడు అప్పుడీ ధారాశుద్ధి గల పద్యము ఉచితముగా నుండును వాని మనస్సులో నున్న యొక యాత్మస్తుతి ప్రవాహమున కిది వ్యంజకముగా నుండును కనుక. ఒక మహామంత్రి మాటలను తూచి తూచి వాడును. ఆలోచన చేసి శబ్దములు ప్రయోగించును. ఒక భావమును చెప్పి, దాని తరువాత వచ్చు భావమును మరుగు పఱచును. ఒక భావమును డొంక తిరుగుడుగాఁ జెప్పును. తన యర్థ మితరులకు తెలియకుండ నొకానొక వాక్యము నుచ్చరించును. ఆ మంత్రి చెప్పినాడన్న పద్యముకూడ నీటివలె ప్రవహింపఁ జేసి ధారాశుద్ధి యన్న గుణము ప్రధానముగా రచించినచో ఆ పద్యరచనయందు వ్యంజకతా

లక్షణ ముండదు వ్యంజకతా లక్షణము కలిగి యుండుటయే పద్యరచనా శిల్ప లక్షణము.

ఇందులో నింకొక్క విశేషమున్నది. లోకములో కవులున్నారు ప్రధానముగా తెలుగులో నన్నయ్య తిక్కనలను తీసికొందము నన్నయ్యగారిలో సంస్కృతపు మాటలెక్కువ, తిక్కన్నగారిలో తెలుగు మాట లెక్కువ- అన్న వియన్నన విమర్శనయే కాదు ఆయన నోటివెంట వచ్చు మాటలు వేఱు, ఈయన నోటి వెంట వచ్చు మాటలు వేఱు సంస్కృత శబ్దములైనను ఆంధ్రశబ్దములైనను వేని కవి కేటాయింపుగా నేయుండును. నన్నయ్యగారిమాటలలో దీర్ఘాక్షర బహుళములైన మాటలుండును. ఏ యక్షర సన్నివేశము చే మాటకు చిక్కదన మేర్పడునో, మాటలో మాధుర్యము కలుగునో, ఆ శబ్దములు నన్నయ్యగారి నోటినుండి వచ్చును. తదనుబంధి మాధుర్యము, తదనుబంధియైన ధార, తన పద్యమంతియు నిండియుండుటకు నన్నయ్యగారి జీవశక్తి తదనుకూలమైనది గనుక తన్నిష్ఠమైనది గనుక- పద్యము యొక్క భిన్న భిన్న భాగములలో, వాక్య విన్యాస వైఖరిలో, సమాస గ్రథన ప్రయత్నములో ఆ భావమే దీపించుచుండును. తిక్కన్నగారి నోట చిన్ని చిన్ని మాటలు వచ్చును. హ్రస్వాక్షర బహుళములైన మాటలు వచ్చును. గురువు కావలసి వచ్చినచో తదనంతర సంయుక్తాక్షర నిక్షేప వశమున తత్పూర్వాక్షరము గురువగు శబ్దముల బాహుళ్యమే ఆయన నోటికి వచ్చును. ఆయన నోటివెంట వచ్చు సంస్కృత శబ్దములే వేఱు. ఆ శబ్దములు కూడ ఈ లక్షణము కలవిగానే యుండును. ఇట్టి రచనలోఁ గూడ నొక ధారా శుద్ధి యుండును. దానియందుఁ గూడ ధారా శుద్ధి యుండుట తిక్కన్నగారి వాక్కు కవి వాక్కగుట. అనఁగా ఆయన జీవలక్షణములో కవి లక్షణ మున్నదనుట.

ఇప్పుడీ రెండులక్షణములు ఈ మహానుభావుల యిద్దఱియందు విడివిడిగా, ప్రత్యేకముగా, మహారూపములు పొంది వెలుగొందుచున్నవి. ఇట్లు భిన్నముగానున్న ఈ శైలీ పద్ధతులలో రచనా శిల్పముండునా? అన్నది ప్రశ్న. ఉండును. ఆ రచనాశిల్పము ఈ ప్రధాన శయ్యలకు దాటినది. నన్నయ్యగారిలో నున్న రచనాశిల్పము ప్రధానమాదుర్య గుణముచేత గుర్తుపట్టుట కష్టము తిక్కన్నగారిలోనున్న ఈ రచనాశిల్పము తొందరగా కనిపించును. కనిపించు ననఁగా ఆ శిల్పముయొక్క యభిజ్ఞత కలవానికి తెలియునని యర్థము. తిక్కన్నగారి రచనవంటి రచనలో మాదుర్యము తక్కువ. భావమే పాఠకుని పట్టికొని ముందునకు సాగదీయును నన్నయ్యగారి రచనవంటి రచనలో మాదుర్యప్రవాహమే పాఠకుని ముందునకు లాగికొని పోవును. శిల్పవిషయమున ఈమధుర రచన పాఠకుని మిక్కిలి ప్రతారించును. తిక్కన్నగారి రచన పాఠకుని బుద్ధిని శిల్పము వైపునకు మరలించును అందుకనియే స్థూలముగా పరించువారికి తిక్కన్న శిల్పియని, నన్నయ్య కాదని యనిపించుట ఇక్కడ శిల్పమనఁగా పద్యరచనా గత వైశిష్ట్యము. ఆయన వాడెడి లోకోక్తులు, నుడికారములు మొదలైనవి శిల్పమన్న బుద్ధిని కలిగించును నిజమున కది శిల్పముకాదు. శిల్పమన్నది వేఱే విషయము. లోకోక్తులు నుడికారములు మొదలైనవి ఎక్కువ వాడుటచేత ఒక పాత్రపోషణము మిక్కిలిగా జరుగుచున్నట్లు మనస్సునకు భ్రాంతికలుగును. దానిని శిల్పమని తొందరలో పాఠకుఁ డనుకొనును.

పెద్దన్నగారి పద్యరచనా మార్గము నన్నయ్యగారి సంప్రదాయములోనిది అందుచేత పెద్దన్న రచనలో నిగూఢముగా నున్న శిల్పము తెలిసికొనుట కష్టము. మధుర పద్యరచనానుబంధ వాగ్వ్యవహార మూలహేతుక విశిష్ట జీవలక్షణము కలవారి రచన ప్రజాదరణమును పొందును. అతని రచనల్లో శిల్పములేకున్నను ప్రజారంజనము పడయును.

మఱియొక విషయము - అట్టి మధుర పద్యరచనాశక్తి గల వాని రచనలో శిల్పము సమకూర్చుకొనుట మిక్కిలి కష్టమైన విషయము. ఆ కవి మాధుర్య గుణవశుఁడై అదియే శిల్పమనుకొని దాని వెంటఁబడి పోవును. వచ్చిన కీర్తికి చట్టలు పొంగించుకొనును. మాధుర్య సౌకుమార్య గుణములు జీవలక్షణముచేత ఏ కవి నోటినుండి వచ్చు పద్యమునందు కుదురుకొని యుండునో, ఆ కవి ఆ గుణములకు వశుఁడై సమాపతితమైన సులభకీర్తికి దాసుఁడై మహా

శిల్ప మార్గమునకు బాహిరుఁ డగుట సర్వథా సంభవము

ఇంత వ్రాయుట యెందు కనఁగా పద్య రచనయందు ఇట్టి మహా మాధుర్య గుణము నిత్యప్రసన్నమై యుండఁగా, పెద్దన్నగారు వంచింపఁబడలేదు ఆయన జీవ లక్షణ మింత కంటె యధికమైనది, పరమోదాత్తమైనది సర్వ శిల్ప లక్షణ సంగ్రథితమైనది

ఇంతకు ముందే వ్రాయఁబడినదిగదా! ఇట్టి రచనలోని శిల్పమును బట్టికొనుట కష్టమని. ఈ చెప్పఁబడునది పద్య రచనాగత శిల్పము. ఇది చెప్పుచుండఁగా కథాగత విషయములుకూడ ప్రదీపితములు కావచ్చును.

ఈ వ్యాసము తొలుత శిల్ప లక్షణములు కొన్ని చెప్పుచు రచనాశిల్పము వచ్చినంతనే దానినిగూర్చి విస్తరించి చెప్పుటయైనది. కాని ఈ వ్యాసములో ప్రధానముగా ఇది యే వ్రాయు విషయము

ఆ ప్రధాన శిల్పలక్షణములలో మిక్కిలి ప్రధానమైన దానిని చెప్పలేదు. దానినిచెప్పి మరల ఈ శిల్పరచనను ప్రారంభింతును. ఆ పరమ ప్రధానమైన విషయము కథా కథన వైఖరీ విశేషము దానినిగురించి వ్రాయక ముందు పెద్దన్నగారి రచనలోని బహు విషయములు చెప్పినఁగాని చివరకు సంయోజనము కుదురదు ఈ చెప్పుటలోననే తద్విషయకమైన పలు సంగతులు రావచ్చును పాఠకుఁడు, ఇవి యన్నియు వ్రాసిన తర్వాత, సంయోజనా దృష్టితో పరిశీలించవలసియుండును

పెద్దన్నగారి పద్యరచనా శిల్పమునుగూర్చి విచారించుటకు పూర్వము పద్యలక్షణమును గూర్చి విచారింపవలయును. కవి ఒక వర్ణనము చేసినప్పుడు పద్యము వ్రాయును. కథ చెప్పుచున్నప్పుడు పద్యము వ్రాయును. కథలో పాత్రలు తమ భావములు చెప్పుటకు పద్యము వ్రాయును. కథాంశములు కలుపుచు కథను నడుపుటకు పద్యము వ్రాయును. కావ్యమంతయు పద్యమయము కదా! మన తెలుగు కావ్యములు నన్నయ్యగారు పెట్టిన వరవడి ప్రకారము భగవంతునకో, ఒక రాజునకో, ఒక మంత్రికో యంకితము లీయబడినవి. ఆశ్వాసాద్యంత పద్యములు సర్వకావ్యములయందు సమాస భూయిష్ఠములై యుండుట యందఱకును దెలిసిన విషయమే. ఆ పద్యముల కదియొక నమూనా యేర్పడినది. అట్లు వ్రాయుట యొక శిల్పము కాదు, ఆచారము ఈ దృష్టితో పద్యరచనను జూడ నారంభించినచో, పద్యరచన యందు భిన్న భిన్న లక్షణములు గోచరించును.

ఇట్టి పద్య రచనకు కావ్య రచనలో కొన్ని లక్షణములకు కొందఱు పూర్వ కవులు చూపిన మార్గములు తరువాతి కవులు వరవళ్లుగా స్వీకరించినారు. అట్టి వరవళ్లు కొన్ని పెద్దన్నగారివి కలవు. అందులో నొకటి కథారంభ పద్యము సమాస భూయిష్ఠముగా వ్రాయుట. ఆ యూరున్నది ఆ యూరి కోట గోడలు ఆకాశమును ముద్దుపెట్టుకొనుచున్నవి అది 'మహీకంఠహార తరళము' వలె నున్నది. ఆ యగడిత పాతాళము నంటుచున్నది ఇటువంటి భావములతో మొదటి పద్యమును వ్రాయుట. తరువాత చాతుర్వర్ణ్యము, వెలయాండ్రు, వీరి వర్ణన పెద్దన్నగారు చేసిరి. తరువాతివారు పుష్పలావికలను గూడ కలిపిరి. పెద్దన్నగారు దీర్ఘమైన సమాసములతో వచనమును వ్రాసిరి. తక్కిన వారును వ్రాసిరి ఈయన ఎందుకు వ్రాసెనో వారికి తెలియలేదు. ఇది తరువాత చెప్పఁబడును.

ప్రవరుని యింటికి సిద్ధుఁడు వచ్చెను. ఇతఁడు సిద్ధుఁడు గాని, యతికాఁడు అందులో నొక యౌషధ సిద్ధుఁడు. ప్రవరుఁడు అగ్నిహోత్రి సోమయాజి. మహా పండితుఁడు. శిష్యులకు శాస్త్రములు పాఠము చెప్పఁగలిగిన పండితుఁడు. అతఁడు తన యింటికి వచ్చిన సిద్ధుని యతిని పూజించినట్లు పూజించడు ఆ సిద్ధుఁడు బ్రాహ్మణుఁడు కావచ్చును, కాకపోవచ్చును. కాని ఆ సిద్ధునితో ప్రవరుఁడు పలికిన పలుకులు పాఠకుని పారవెట్టును

"నేఁడు మన్మందిరము పవిత్రమయ్యె" నని, "మీ మాటలు మంత్రము" లని, "మీ మెట్టిన యెడ ప్రయాగ" యని, "కుటుంబ జంబాలము నందు చిక్కియున్న మా దృశ గృహమేధులు యుష్మదంఘ్రిరజోలేశము చేత నుద్ధరింపఁబడుదు"రని- ఇట్టి మాటలు చూచినచో ప్రవరుని యింటికి కాఁడో మహర్షి వచ్చినట్లు భ్రాంతి కలుగును. ప్రవరుఁడే బ్రా

తంత్రుఁడు. ఆ పారతంత్ర్యమే సకల జీవనమైనవాఁడు. అతని లక్షణమది. అతనికి వచ్చినవాఁడౌషధ సిద్ధుఁడన్నంత తెలియక పోలేదు.

'అభ్యాగత స్స్వయం విష్ణుః' అన్న ధర్మము సంపూర్ణముగా విశ్వసించి, వచ్చిన వారినిట్లు మర్యాద చేయును. ఈ సంగతి తరువాతి ప్రసంగము వలన తెలిసికోఁ దగినది.

ఈ ప్రథమాశ్వాసములోని ఆయువుపట్టు ప్రవరుని యొక్క తీర్థ సందర్శనాభిలాష. ఈ యభిలాష పట్టరానంత యున్నది ప్రవరునకు.

ఇట్లు ప్రవరుఁడు సిద్ధుని మిక్కిలి పొగడగా, ఆ పొగడికను సిద్ధుఁడు ఏ మహర్షియో స్వీకరించినట్లు స్వీకరించలేదు. అతఁడు గృహస్థ ధర్మమును పొగిడెను. ఆ పొగడిక గృహమేధి, యజమానుఁడు, వాస్తవ్యుఁడు, కాపు, సంసారి, భవన భర్త, కులపతి, కుటుంబి - ఈ మాటలకు విశేషణములు జోడించి చేసెను. ఎందు కిట్లు చేసెను. ఆ సిద్ధుని స్వభావ మేమి? అతఁడు పలుచోట్ల తిరిగెడివాఁడు. గృహస్థులను పొగిడి, పొట్ట గడుపుకొనువాఁడు.

ప్రవరుఁడు గృహస్థ ధర్మముగా తన్ను పొగడెనని సిద్ధునకుఁ దెలియును. సిద్ధుని యీ మాటల వలన వీని స్వరూపము ప్రవరునకుఁ దెలిసెను.

"అయ్యో మాది యేమున్నది? తమవంటి మహాత్ముల తపస్సులచేతఁ గదా మేము బ్రతుకు చున్నాము" అని ప్రవరుఁ డనలేదు. అనవలసిన యవసరము లేదు. పైఁగా వెంటనే యా సిద్ధుని స్వరూపము గ్రహించి, మర్యాద నతిక్రమించకయ —

"మీరు సమస్త తీర్థాటనము కావింపుదురు. అందుచేత విభజించి యడుగఁ గోరికయైనది. ఏ యే దేశముల వసించితిరి?" అని మొదలైన వడిగి, "అచ్చటి వింతలు మా కెఱిఁగింపు" మనియె.

ఈ సిద్ధుఁ డింతకు మించి యొక్కటి చెప్ప లేఁడని ప్రవరునకుఁ దెలియును.

ఆ సిద్ధుఁడు :

ఓ చతురాస్య వంశ కల
 శోదధి పూర్ణ శశాంక తీర్థయా
త్రాచణ శీలినై జన ప
 దంబులు పుణ్య నదీ నదంబులున్
జూచితి నందు నందుఁ గల
 చోద్యములం గనుగొంటి నా పటీ
రాచల పశ్చిమాచల హి
 మాచల పూర్వ దిశాచలంబులన్.

కేదారేశు భజించితిన్ శిరమునన్
 గీలించితిన్ హింగుళా
పాదాంభోరుహముల్ ప్రయాగనిలయుం
 బద్మాక్షు సేవించితిన్
యాదోనాథ సుతా కళత్రు బదరీ
 నారాయణుం గంటి నీ
యా దేశంబననేల, చూచితి సమ
 స్తాశావకాశంబులన్

ఈ రెండు పద్యములు చెప్పి-

వ. అది యట్లుండె వినుము గృహస్థరత్నంబ, లంబమాన రవి రథ తురంగ శృంగార చారు చామరచ్ఛటా ప్రేక్షణ క్షణోద్గ్రీవ చమర సముదయం బగు నుదయంబునం గల విశేషంబులు శేషఫణికి నైన లెక్కింప శక్యంబె, యంధక రిపు కంధ రావాస వాసుకి వియోగ భవ దుర్వ్యథా భోగ భోగినీ భోగ భాగ పరివేష్టిత పటీర విటపి వాటికా వేల్లదేలా లతా వలయం బగు మలయంబునం గల చలువకు విలువ యెయ్యది, యకటకట వికట కోటి విటంక శృంగాట కాఘాక మాన జర దిందు బింబ గళ దమృత బిందు దుర్దినార్ద్రీకృత సల్లకీ పల్లవ ప్రభంజన పరాంజన హస్తి హస్తం బగు నస్తంబునం గల మణి ప్రస్తరంబుల విశ్రాంతిఁ జింతించిన మేనం బులక

లిప్పుడుం బొడమెడు, స్వస్వ ప్రవర్ధిత వర్ధిష్ణు ధరణీ రుహ సందోహ దోహద ప్రధానాసమాన ఖేల ద్దైల బిల విలాసినీ విలాస వాచాల తులాకోటి కలకలా హూయమాన మానస మదాలస మరాళం బగు రజత శైలంబు నోలంబులం గాలగళు విహార ప్రదేశంబులం గన్న సంస్మృతి క్లేశంబులు వాయవే, సతత మదజల స్రవణ పరాయ ణైరావణ విషాణ కోటి సముట్టంకిత కటక పరిస్ఫుర త్కురువింద కందళ వ్రాత జాతాలాత శంకాప సర్ప దభ్రము భ్రమిా విభ్రమ ధురంధరం బగు మేరు ధరాధరంబు శిఖరంబుల సోయగంబులు గలయం గనుంగొనుట బహు జన్మ కృత సుకృత పరిపాకంబునం గాక యేల చేకూఱు నేర్చు? నే నిట్టి మహాద్భుతంబు లీశ్వరానుగ్రహంబున నల్పకాలంబునం గనుంగొంటి -

అని పెద్ద వచనమును జెప్పెను. రచనా శిల్పమీ పద్యములలో వచనములో నున్నది.

ఆ సిద్ధునివంటి వారివద్ద ప్రధానముగా రెండు లక్షణము లుండును. మొదటిది- గృహస్థులను పొగడుట. రెండవది - తమ గొప్పతనమును చెప్పుకొనుట.

"ఓ మిహిరాంశు వంశ కలశోదధి పూర్ణ శశాంక" అన్న శ్రీనాథుని పద్యచరణమును దీసికొని "మిహిరాంశు" బదులు "చతురాస్య" పెట్టినాఁడు. ఇది పెద్దన్న గడుసుఁదనము. శ్రీనాథుని సంబోధనలో పద్యచరణపు కూర్పే ప్రధానముగాని, విశేషము లేదు. ఇక్కడి ఈ సంబోధనలో సిద్ధుని స్వభావమునకు ఇది వ్యంజక మగుచు యున్నది.

తరువాత "ఘటికాచల పశ్చిమాచల హిమాచల పూర్వదిశాచలంబులన్" అన్న ఆ పద్యము చివరి చరణములోని కూర్పు, ఆ దీర్ఘాక్షరములు, ఆ నడక సర్వము సిద్ధుని 'బడాయిని' సూచించుచున్నవి.

"కేదారేశు భజించితిన్" అన్న పద్యరచన కూడ సిద్ధుని యాత్మస్తుతికి వ్యంజకముగానే యున్నది. ఈ వ్యంజకత్వమునకు తరువాతి వచనము నిధి. ఆ దీర్ఘ సమాసములు, ఆ కఠినశబ్దముల ప్రయోగము, అందులోని వృత్త్యనుప్రాసలక్షణము, చేసిన కల్పనలు—సర్వమును ఆ సిద్ధునియొక్క—తా నిన్నిన్ని చోట్లు చూచితినని చెప్పికొనుటలోని బడాయియు, గొప్పతనమును కనుపించుచున్నవి.

ఇది కావ్యము. నాటకమైనచో ప్రవరుఁ డెట్టివాఁడో సిద్ధుఁడెట్లు మాటాడుచున్నాడో, తెలిసిన నటకులు ప్రయోగించినప్పుడు కనిపించునది యంతయు కావ్యము వ్రాయునప్పుడు కవి తనశబ్దప్రయోగ నైపుణ్యముచేత స్ఫురింపఁ జేయును. ఆనాట్య లక్షణమంతయు వీని పద్యరచనలోఁ జూడవలయును. ఆ నాట్య లక్షణము నంతయు స్ఫురింపఁజేయునట్టి రచన చేసినచో దానిని వ్యంజకమైన రచన యందుము. ఈ వ్యంజకతా లక్షణము తెలిసికొనుటకు శబ్దశక్తి పద్యరచనా గతశక్తి పాఠకునకుఁ దెలియవలయును. మొదటి పద్యములోని దీర్ఘాక్షరముల విసురు — "ఈ యాదేశం బననేల చూచితి సమస్తాశావకాశంబులన్" అన్న అతిశయోక్తి వచనముచేత వ్యంగ్యమగుచున్న వాని మాటలలోని విప్పు, తాను తాఁజెప్పికొనుచున్న గొప్పదనము - ఇదియంతయు సువ్యక్త మగుచున్నది. ఆసిద్ధుఁడు చెప్పినమాట లెట్లున్నవనఁగా - ప్రవరునకు నవ్వు వచ్చినది. పరిహాసముకల్గినది. కాని యతఁడు గొప్ప పండితుఁడు. ఆత్మ నియమము కలవాఁడు అభ్యాగతుని తేలికగా నవమానించఁడు. ఎంత యవమానించకపోయినను—

"వెరకళ మీకొనర్తు నొక విన్నపము." అని యన్నాఁడు "ఇవి యన్నియుఁ జూచి వచ్చుటకు నెండ్లును పూండ్లును పట్టును? మీ చిన్న వయసును మీ మొగమే చెప్పక చెప్పుచున్నది. అద్దిరయ్య!" అని ఆక్షేపణ.

"మీ మహిమ మీకే తెలియవలయును మాకేమి తెలియు'!" నన్నాఁడు అనఁగా "నేనీ మాటలు నమ్మ" నని యర్థము. "నీవు గప్పాలు

కొట్టుచున్నా" వని యర్థము. ప్రవరుఁడు 'అద్దిరయ్య' అన్నప్పుడు, ప్రవరుని మొగములోని యాక్షేపణము సిద్ధునకు పూర్తిగా తెలిసెను.

కాని సిద్ధుఁడు పది దేశములు తిరిగినవాఁడు. ఇటువంటి వారిని వందమందిని చూచినవాఁడు. వాని గడుసుదనము వేఱు. ఆతలివాఁడు తన్ను వెక్కిరించుచున్నాడని తెలిసియు, ఆ కోపము మనస్సులో పెట్టుకొనియు, ఇటువంటి దేశ ద్రిమ్మరులు మంచిగానే మాట్లాడుదురు. వారు వెక్కిరించినది తమకు తెలియనట్లుగా నటింతురు. ఆ వెక్కిరింతకు తమ కనుకూలమైన వ్యాఖ్యానము చేయుదురు. అందుచేత సిద్ధుఁడు ప్రవరాఖ్యుని ఈ వెక్కిరింతను "సందేహము తెలియ నడుగుట"గా జమకట్టినాఁడు. అని యంతటితో నూరకుండలేదు. వీఁడు నన్ను వెక్కిరించుచున్నాడు గనుక వీనికి పరాభవము చేయవలయు ననుకొన్నాఁడు. ప్రవరుని మోసపుచ్చవలయును.

" మేము సిద్ధులము. మాకు జరా రుజలు లేవు. అయినను.

"పరమంబైన రహస్య మో, నయిన డాపన్ జెప్పెదన్ భూమి నిర్జరవంశోత్తమ"అని మొదలు పెట్టినాఁడు.

ఈ మాట లెట్లు చెప్పినాఁ డనఁగా ఎవరైనను వినిపోదురేమో యన్నట్లు, గొంతు సవ్వడి తగ్గించి, ఇంచుమించుగా ప్రవరుని చెవిలో నోరుపెట్టి చెప్పినాఁడు. ఇంత యర్థ మీ చరణములో నెట్లున్నదని యడుగవచ్చును.

"పరమంబైన రహస్యము" అని మత్తేభ మెందు కెత్తవలయును? "పరమ రహస్యమో నదియుఁ బాయక చెప్పెద" నని యెందు కన రాదు? ఈ చంపకమాల తేలికగదా! కాని మత్తేభమునే యెత్తినాఁడు. ఎందుకనఁగా 'పరమ రహస్య' మన్నచో, 'పరమంబైన రహస్య' మన్నదానిలోని 'ఐన' అన్నమాట యుపయోగించుటకు వీలులేదు. 'ఐన' అన్న మాట ఉపయోగించుటచేత ఆ యర్థమంతయు వచ్చుచున్నది. ఎట్లు వచ్చుచున్న దనఁగా తెలుఁగువాండ్రు ఏదో రహస్యము తమ స్నేహితులతోనో, ఇతరులతోనో చెప్పునప్పుడు, మఱియు నా చెప్పుటలో కొంత స్వార్థ మున్నప్పుడు, గొంతు సవ్వడి తగ్గించి, మొగము తీసికొనివెళ్ళి వినెడివాని చెవిలో పెట్టి, "మీ కొక రహస్యమైన మాట చెప్పెదను. మీ కొక రహస్యమైన విషయము చెప్పెద" అని యందురు. ఆ రహస్యము యొక్క గాఢత్వమంతయు 'ఐన' ప్రయోగించుటలో నున్నది ఇది తెలుఁగు జాతి లక్షణము. తెలుఁగు భాష యొక్క యొకానొక ప్రయోగ రహస్యము. ఆ రహస్య మిమిడియున్న 'అగు' ధాతువు యొక్క భూతార్థక క్రియాజన్య విశేషణమును చొప్పించి పెద్దన్న ఈ పద్యము వ్రాయవలసి వచ్చినది. ఆ యొక్క మాటతో ఇంత యర్థము పుట్టుచున్నది

కాని యిక్కడ ఇంత ఆప్యాయత తనమీద సిద్ధున కేల రావలయునన్న సందేహము ప్రవరునకుఁ గలుగకుండ "భూమి నిర్జర వంశోత్తమ" యని పిలిచినాఁడు. 'ఓ చతురాస్య వంశకలశోదధి పూర్ణశశాంక" అని పిలిచినప్పుడు సిద్ధుని లక్షణ మెట్లుండెనో, ఇప్పుడు నట్లే యుండెను. ప్రవరుఁ డిందులో మోసమున్నదని తెలిసికొనలేకపోయెను.

'అద్దిరయ్య!'" అన్నప్పుడు ప్రవరుని ముఖములో వెక్కిరింత స్ఫురించెను. ఆ సిద్ధుని గుండెలో నున్న మోసము వాని మొగములో కనిపించదు, వాని మాటలో వినిపించదు.

మఱియు ప్రవరునకు వాఁ డేదో మందు చెప్పును. దానితో తన తీర్థయాత్రా కౌతుకము తీఱునని యొక యాశ కలదుగదా? ఆ యాశ ప్రవరునికి తెలివి కలిగించలేదు.

ఈ సందర్భ మంతయు సరిగా గుండెకు పట్టించుకొనుటకు ఇప్పుడు మాసిపోయినను, కొన్ని యేండ్ల క్రిందటి వరకు సమృద్ధిగానున్నది, ఇప్పటికైన ముదురని పల్లెటూళ్లలో కలది - యొక సందర్భము తెలిసినచో చాలును. కోయవాండ్రు, పాములవాండ్రు, మందులవాండ్రు, మంగులమ్మెడు నాడవాండ్రు - బిచ్చమునకు వత్తురు. వాండ్రవద్ద చిటకాలు సంపాదించుటకు యువకులు ప్రవర్తించెడు ప్రవర్తన, వారు మందిచ్చి చేసెడు మోసము పర్యాలోచించినచో ఈ ఘట్టము నందలి చమత్కారమంతయు సువిదిత మగును

బాగుగా చదువుకొన్న వారుగూడ వాం డ్రేదో మందిత్తురని, తమకోరిక దానితో సిద్ధించునని మోసపోదురు. ఒక నాటు వైద్యుఁడు, ఒక జ్యోతిష్కుఁడు, ఒకనాటు పండితుఁడు- గృహస్థుల యింటికువచ్చి తాము నయముచేసిన చేసిన రోగముల చిరాలు, చెప్పిన ఫలముల యాథార్థ్యము జరిగిన చిరాలు, పాండిత్యము మెచ్చుకొని తమ కితరులుచేసిన గౌరవముల చిరాలు - చెప్పుకొనుట లోకవృత్తము. ఈలక్షణమే ఆ సిద్ధునిలో నున్నది. ఆ లక్షణమును దీపింపఁజేయుటకే పెద్దన్నగారు ఆరెండు పద్యములు, ఆపెద్దవచనము వ్రాసిరి

ఎప్పుడు సిద్ధుఁడు తన దివ్యౌషధము పేర్కొనెనో, ప్రవరుఁడు మెత్తపడి పోయెను. "నేను నీ శిష్యుఁడను మహానుభావా! నన్ను రక్షింపు" మన్నాఁడు. సిద్ధునకుకావలసిన దిదియే. వెంటనే పసరుదంతపుబరణి తీసినాఁడు. అది యిదియని చెప్పలేదు. ప్రవరుని రెండుకాళ్ళకు పూసినాఁడు. వానిదారిని వాఁడు పోయినాఁడు ఇది ఇంత సేపుండుననిగాని, దాని లక్షణ మిదియనిగాని వాఁడేమియుఁ జెప్పలేదు. ఈ ప్రవరుఁడు —

"ఇంక నేమున్నది? మనము సర్వదేశములకుఁ బోవచ్చు" ననియే తప్ప, "ఈ పస రెంత సేపుండును? కాళ్ళు కడిగి కొనినచో పోదా?" అన్న యూహాయే లేకుండెను. ప్రవరుఁడంత పండితుఁడై, అగ్నిహోత్రియై, సంపన్న గృహస్థై, ఎంతో భోగియై, తీర్థ సందర్శనాభిలాష యందలి పిచ్చిచేత, తత్కాలమున నవివేకిగా భాసించినాఁడు. ఇందులో నాశ్చర్యము లేదు. పెద్ద యుద్యోగస్థులు, ఆవులించినచో ప్రేవులు లెక్కపెట్టెడి వారు, ఒకానొక మోహాభారము చేత సర్వ వివేకము తత్కాలమున కోలుపోవుట లోకము నందు సమృద్ధిగా నున్నది. ఇది మానవ లక్షణము.

ఇది పదునేను పద్యములలోని కథ. ఇంత విచిత్రముగా లోకమును ప్రతిబింబింపఁ జేసిన కథ. 'అద్దిరయ్య', 'ఐన'- ఈ రెండు మాటలతో ఒకని చమత్కార వాక్కు, తెలుఁగు భాషా ప్రయోగములో నున్న యొక నిగూఢమైన విషయము నిరూపించి, పరమ వ్యంజకమైన రచన పెద్దన్నగారు చేసినాఁడు.

(సశేషము)

కేనోపనిషత్తు

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

ఆ పరబ్రహ్మ, గురుశిష్యులైన మమ్ము
పాలనము చేయుఁగాక, కాపాడుఁగాక!
ఉభయులము సమర్థముగఁ జేయుదుముగాక
యధ్యయన, మిద్ధమై వైర మడఁగుఁగాక!
నాదు నేత్రముల్ శ్రోత్రముల్ నాదువాక్కు
అంగములు బలమ్మును నింద్రియములు నెల్ల
తమ పనులయందు శక్తివంతంబు లగుత,
నఖిల మౌపనిషదము బ్రహ్మంబె యగుత.
బ్రహ్మమును నే త్యజింపను, బ్రహ్మ మెపుడు
నను త్యజింప కుండెడుఁగాక, యనవరతము
బ్రహ్మము విచారణము చేయఁ బడెడుఁగాక,
దాన బ్రహ్మ సాక్షాత్కార మౌను గాక!
బ్రహ్మ నిరతులం దెట్టి ధర్మములు శ్రుతము
లగునో, యట్టివి నాయందు నమరుఁగాక!

*

ఎవనిచే గోరఁబడి, ప్రోత్సహింపఁ బడియు
మనము ప్రాణము తమ తమ పనులొనర్చు
ఎవనిచే జక్షువును శ్రోత్ర మెవనిచేత
వాక్కు వర్తించుఁ దమతమ పనులయందు.
శ్రోత్రములకు శ్రోత్రము, మనసులకు మనసు,
వాక్కులకు వాక్కు, ప్రాణంబు ప్రాణములకు,
కన్నులకు కన్ను - పరమాత్మ; కాన, [1] వీని
వదలి, [2] వాని నెఱిఁగి ముక్తి వడయు జ్ఞాని.
కనులు వాక్కు మనము నాత్మ కానలేవు,
ఎఱుఁగ మెటు చెప్పనగునో మే మేని దాని;
అది జగత్తుకు ప్రకృతికి నన్య వస్తు
వని వచింపఁగ వింటిమేమైన మున్ను.
వాకు చేతను వచియింప రాక యుండి
యేది వాగింద్రియమును వర్తింపఁజేయు,
నది పరబ్రహ్మ మని తెలియుంగ వలయు;
నాత్మ కాదు మీరు పూజించునది [3] యనాత్మ
భావనాతీత మయ్యును భావమునకు
భావనా శక్తి నొసఁగు నే పరమవస్తు,
వది పరబ్రహ్మమని తెలియంగవలయు;
మన ముపాసించు మూర్తి బ్రహ్మమ్ము కాదు.

1. ఇంద్రియములు
2. పరమాత్మ
3. విగ్రహాదికము.

కన్నుగవచేత నెయ్యది కానఁబడక
కన్నులకుఁ గన్నుగా చూపుఁ గలుగఁజేయు
నది పరబ్రహ్మమని తెలియంగ వలయు;
మన యుపాసించు మూర్తి బ్రహ్మమ్ము కాదు.
చెవుల నెయ్యది వినరాక, చెవులకెల్ల
చెవియయి సమస్తమును వినఁ జేయుచుండు
నది పరబ్రహ్మమని తెలియంగవలయు,
మన ముపాసించు మూర్తి బ్రహ్మమ్ము కాదు.
ప్రాణమునకు నాఘ్రాణింపరాక యేది,
ప్రాణమునకు నాఘ్రాణము పరగఁజేయు
నది పరబ్రహ్మమని తెలియంగవలయు
మన ముపాసించు మూర్తి బ్రహ్మమ్ము కాదు.

ద్వితీయ ఖండము

"నీవు బ్రహ్మ స్వరూపంబు నిజముగ నంచు
నమరులందు నెఱింగితి వని తలంతు
వేని, నీ వెఱింగిన దల్ప, మింక నరయు"
మనిన గురునకు శిష్యుఁ డిట్లని వచించె:
"ఆత్మ నెఱిఁగితి, నెఱుఁగ లేదనఁగ లేను,
ఎఱుఁగకున్నది లేదు, లేదెఱిఁగి నదియు
ననుట సరియైన మాట; బ్రహ్మమును దెలియు
టనిన నటువంటి దనుకొందు- నదియుఁగాక
అఖిలమును బ్రహ్మ మందైక్య మందుచుండ
నెఱుఁగఁ బడువాఁడు నెఱుఁగువాఁ డెవ్వఁ డింక;
అందుఁ దానొంది తన్నుఁదా నరసికొనుట
తనకు వేఱుగ నది కనుగొనగ రాదు.
ఎవఁడు ప్రత్యగాత్మయందు నూహించువాఁడు,
అతని నరయుట పరమాత్మ నరయుటగును;
దానఁ గలుగు వీర్యము నమర్త్యతయు రెండు,
ముక్తి కలుగు నాత్మజ్ఞానమునను జేసి
ఆత్మ నెఱుఁగుట యెల్ల సత్యమును గనుట,
యెఱుఁగ కుండుట నాశమ్ము హేతువగుటు;
అఖిల మందొక్క యాత్మనే యరయువాఁడు
జ్ఞాని దేహాంతమందు మోక్షమును జెందు.

తృతీయ ఖండము

ఆది దేవులు మున్ను బ్రహ్మమ్ము వలనఁ
గెలిచి దైతేయులను, జయాకలిత దర్ప

పరత సర్వమ్ము మరచి, యా బలము చలము
గెలుపు బలుపెల్ల తమదిగాఁ దలఁచుచుండ
వారి యజ్ఞాన మోహ మవ్వారిఁ దెలిసి
యా పరబ్రహ్మ వచ్చి ప్రత్యక్షమైన,
నంత యెఱుక కల్గిన వార లెఱుఁగలేక
యేఁదియో యింత భూతమం చెంచుకొనిరి.
అంత నసురులెల్ల రగ్ని దేవునిఁ జూచి
"జాత వేద! యింత భూత మేదొ
వచ్చె నొండు, చూచి వత్తువా ?" యన్నంత
నాతఁడట్లె యనుచు నరిగె నటకు.
అరిగి యా భూత మెదుట తా నట్టె నిలువ
నెవ్వఁడవు నీవటంచు ప్రశ్నించె నదియు;
దానికతఁడు "ప్రసిద్ధుఁడ నేన యగ్ని,
నేన జాతవేదుఁడ" నని యెఱుక పఱచె
'అంతటి ప్రసిద్ధుఁడవ యేని, అగ్నివేని,
నీ సమర్థతయేమి వర్ణింపు' మనుడు,
"ఈ చరాచర లోకము నెల్ల త్రుటిని
భస్మ మొనరింపఁగల" నని పలికె నగ్ని.
అంత నా భూత మొకతృణ మచట నునిచి
'కాల్చుమిది,చూత!' మనఁ జేతఁగాక, సర్వ
భక్షకుఁడు దేవతాపాళి పాలి కరిగి
"అది యెదో భూత మెఱుఁగ లేనైతి" ననియె.
అవల వార లనిలు నటకు రాఁ బుత్తెంచి
"భూతమేమొ చూడు పొమ్మ"టన్న
'వల్లె'యనుచు నంత వాయుదేవుఁడు మహా
బలుఁడు సాగె దానిఁ దెలియఁగోరి.
ఆ ప్రభంజనుఁ డటువచ్చు టరసి భూత
మడిగె "నెవ్వఁడ వోయి నీ?" వనుచు, నడుగ
"నెఱుఁగవా యేమి, పేరు పెంపెక్కినట్టి
మాతరిశ్వుఁడ నే!" నని యాతఁ డనియె.
"అంతటి ప్రసిద్ధుఁడగుదు, నీయందు నేమి
మహిమ యున్నది చెప్పుము మా" కటన్న
"స్థావరాత్మక మీ సమస్తమును నే గ్ర
హింతుఁ, జూతువె?" యని నభస్వంతుఁడనియె.
విన "నీ తృణంబును గొను" మనియె భూత,
మట ప్రభంజనుఁ డాత్మ జవాతిశయము
తృణమునకుఁ గాక తొలఁగి పోయెను, సురాళి
కెఱుఁగఁ జెప్పెఁ దా భూతము నెఱుఁగ కునికి.
అంత సురలింద్రుఁ జూచి "ఓ యమరవర్య,
ఆ మహాభూత మేగిరో, యరయు" మనుడు,
అట్టులే యని దేవేంద్రుఁ డరుగు నరికి
నచటి భూతము మాయమై యరయరాద.
అమరపతి యంత నాకస మందు హైమ
వతిని, శోభమానను, సుమాసతిని, మహిత,
బ్రహ్మ విద్యాస్వరూపిణి, రమణిఁ గాంచి,
'ఆ మహా భూత మే'మని యామె నడిగె.

చతుర ఖండము

"అది పరబ్రహ్మ, మీ విజయమ్ములకును
మహిమలకు హేతు వది, మీరు మఱచినారొ?"
యని యగజ సెప్ప విని నంత నమర పతియు
నెఱిఁగె బ్రహ్మమ్ముఁ బూర్వ సంస్కృతివశమున.
అగ్ని వాయువు నింద్రుఁడు నట్లు తొలుత
బ్రహ్మము సమీపమున కేగి బ్రహ్మ స్పర్శ
మొందుటను బ్రహ్మము నెఱింగియున్న కతన
నఖిల దేవతాతతియందు నధికులైరి.
ఆ మహేంద్రుఁడు తొలుత బ్రహ్మమ్ము కడకుఁ
జనుట, తత్స్వరూప మెఱింగి కొనుట కతన
నతఁడు సకల వియచ్చర ప్రతతి కెల్ల
ప్రభువు కాఁగల పుణ్యసంపదలఁ బొందె.
ఆ పరబ్రహ్మరూప మత్యద్భుతంబు
మెఱయు మిఱుమిట్లు గొల్పుచు మెఱపువోలె
మాయమగు నంతలోఁ గన్ను మలగినట్లు,
ఇదియె యధిదైవతంబని యెంచఁబడును.
అఖిలజీవుల యందు బ్రహ్మ స్వరూప
మునికి తెలివొంది ధ్యానించుచుండ వలయు;
నెవ్వ డెఱిఁగి యుపాసించు నిట్లు దీని
నతని భూతములెల్ల సంస్తుతి యొనర్చు
ఉపని షద్రహస్యం బెల్ల విపులముగను
జెప్పుమని గురువర్యుని శిష్యుఁ డడుగ
నుపనిషత్తు నే నేఁజెప్పియుంటి నిపుడు,
ఉపనిష ద్బ్రాహ్మము నె పల్కియుంటి ననియె.
బ్రహ్మభావంబు మది సుస్థిరంబు గాగ
నఖిలవేదంబు, లెల్ల వేదాంగములును
దపముఁ దమముఁ గర్మంబు నాధారములగు;
సత్యమే బ్రహ్మమునకును స్థానమగును.
ఎవ్వఁడీ బ్రహ్మవిద్యను నిట్లెఱుంగు
నతఁడు పాపవినిర్ముక్తుఁడగు, నతం డ
నంతమును శ్రేష్ఠమును సుఖవంతమైన
బ్రహ్మమందైక్య భావంబుఁ బడయఁగలఁడు.

మనుస్మృతి - సామాజిక వ్యవస్థ

శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.

ప్రపంచములో భారతదేమునకు ప్రతిష్ఠ తెచ్చిన వానిలో మనుస్మృతి యొకటి. మానవు లాకరిపట్ల నాకరవలంబింప వలసిన ప్రవర్తన విధానము మనుస్మృతిలో విపులముగా నిర్దేశింపబడి యున్నది. మృదుత్వము, దయ, ప్రేమ, సాత్త్వికత మున్నగు మహోన్నత గుణములతో మానవుల నుత్తేజింప చేయగల సమాజ మర్యాదా ప్రణాళిక మనువులో కన్పట్టుచున్నది. వర్ణాశ్రమ ధర్మములు సడలిన దేశ కాలములలో కూడ మానవుల కుపాదేయములైన యుపదేశము లిందు మిక్కుటముగా నున్నవి.

ఇటీవల డా. రాధాకృష్ణగారు చెప్పినట్లు ప్రాచీన ధర్మాచార్యులు వ్యక్తులను గురించియే ధర్మోపదేశము చేసినారు కాని సమాజమును గురించి కాదు. సమాజమేదో నిర్దిష్ట స్థితిలోనికి వచ్చువరకు వ్యక్తులు తమ ధర్మమును నిర్వహింప నక్కరలేని వ్యవస్థను గాని, సమాజమును మార్చుటకే వ్యక్తులు నిరంతరము కృషి చేయుచుండ వలయు నను సందర్భమును కాని ప్రాచీన మతాచార్యులు సంకల్పింపలేదు. ఉత్తమ వ్యక్తులతో ఉత్తమ సమాజమేర్పడునను సిద్ధాంతము మీదనే వారి బోధలు సాగినట్లు కన్పించును. సమష్టి వ్యవస్థ యుపేక్షింప బడినదని దీని యర్థము కాదు.

ఎవ్వరిని అవమానింపరాదు

"ఎవ్వరి మనస్సును నొప్పింపకుండుట సమాజ ధర్మములలో మొదటిది" ఎదుటివాడు బాధను కల్గించినను వాని పట్ల కఠినోక్తులను పల్కరాదు. వాని ప్రాణమును నొప్పింపరాదు. ఎవ్వరికిని ద్రోహము చేయు సంకల్పము పొందరాదు. ఇతరులకు తనవలన హానికల్గునను భయమును కల్గింపరాదు. ఈ యాదేశములకు విరుద్ధముగా ప్రవర్తించుట పుణ్యలోకప్రాప్తికి ప్రతిబంధకము" అని మనువు చెప్పుచున్నాడు.

నారుంతుదస్స్యా దార్తోసి న పరద్రోహకర్మధీః
యథాస్యోద్విజతేవాచా నాలోక్యాంతాము
దీరయేత్.

అహింసయైవ భూతానాం
కార్యం శ్రేయోను శాసనం
వాక్చైవ మధురా శ్లక్ష్ణా
ప్రయోజ్యా ధర్మమిచ్ఛతా.

"ఎదుటివానికి లాభమును కలిగించు విషయము నుద్దేశించునపుడు కూడ వానికి బాధను కల్గింపకూడదు; మధుర వాక్కులతోనే చెప్పవలెను; వానిగుండె యదురునట్లు చెప్పకూడదు."

"నేను వానిని అవమాన పరచివేసినాను; వీనిని సిగ్గుపరచి వేసినాను" అని గర్వించువాడు వివేకహీనుడు. చివరకు నశించువాడు అవమానించిన వాడే కాని యవమానింప బడినవాడు కాడని మనువు చెప్పుచున్నాడు.

సుఖం హ్యవమతః శేతే సుఖం చ ప్రతిబుధ్యతే
సుఖం చరతిలోకేఽస్మిన్నవమంతా వినశ్యతి

అవమానము పొందినవాడు సుఖముగా నిద్రపోవును, సుఖముగా తిరుగును; అవమానించినవాడు పాపఫలము ననుభవింపక తప్పదు; తుదకు వాడే నశించును.

ఎవ్వరిని ఆక్షేపింపకూడదు

జన్మాంతరమందు చేసికొన్న పాపమునకు ఫలితముగా ఈ జన్మలో కలిగిన లోపములకు కాని, హైన్యమునకు కాని ఎవ్వరిని ఆక్షేపింపరాదు. వార్ధకముతో బాధపడువారిని కూడ ఆక్షేపింపరాదు.

హీనాంగా నతిరిక్తాంగాన్
విద్యాహీనాన్ వయోధికాన్
రూపద్రవ్య విహీనాంశ్చ
జాతిహీనాంశ్చ నాక్షిపేత్.

"అవయవలోపము కలవారిని, అవయవాధిక్యము కలవారిని, విద్యావిహీనులను, వృద్ధులను, కురూపులను, దరిద్రులను, హీనజాతివారిని, ఆక్షేపింపకూడదు.

పదిమందిచేత "దాసోహ"మ్మనపించుకొనవలెనను బుద్ధితో సమ్మానమును గోరుట నింద్యము.

సమ్మానాత్ బ్రాహ్మణో నిత్య
ముద్విజేత విషాదివ.

బ్రాహ్మణుడు విషమువల్లనుండి వలె సమ్మానమునుండి భయపడవలెను.

బ్రాహ్మణుని నిమిత్తముగా చెప్పబడిన యిట్టి నియమములు అన్ని వర్ణములవారికిని వర్తించునని మనుస్మృతిలోనే మరొకచోట చెప్పబడినది.

పెద్దలపట్ల గౌరవము

ఆచార్యంచ ప్రవక్తారం
పితరం మాతరం గురుం
నహింస్యాత్ బ్రాహ్మణాన్ గాంశ్చ
సర్వాంశ్చైవ తపస్వినః

ఉపనయనము చేసిన ఆచార్యుని, వేదార్థము చెప్పగల విద్వాంసుని, తల్లిని, తండ్రిని, గురువును, బ్రాహ్మణులను, తపస్వులను, వ్యతిరేకించి వారి మనస్సులను నొప్పింపరాదు.

ఆచార్యశ్చ పితాచైవ
మాతా భ్రాతాచ పూర్వజః
నార్తేనాప్యవమంతవ్యా
బ్రాహ్మణేన విశేషతః
ఆచార్యో బ్రహ్మణోమూర్తిః
పితామూర్తిః ప్రజాపతేః
మాతామూర్తిః పృథివ్యాస్తు
భ్రాతా స్వోమూర్తి రాత్మనః
తయోర్నిత్యం ప్రియం కుర్యా
దాచార్యస్య చ సర్వదా
తేష్వేవత్రిషు తుష్టేషు
తపస్సర్వం సమాప్యతే.
తేషాంత్రయాణాం శుశ్రూషా
పరమం తప ఉచ్యతే
న తై రభ్యననుజ్ఞాతో
ధర్మమన్యం సమాచరేత్.

ఆచార్యుడు, తల్లి, తండ్రి, అన్న, వీరు ఎన్నడును అవమానింప దగినవారు కారు. వారి వల్ల బాధ కల్గినను వారి నవమానింపరాదు. ఈ ధర్మము బ్రాహ్మణునకు మరింత ముఖ్యము. ఆచార్యుడు బ్రహ్మ, తండ్రి ప్రజాపతి, తల్లి పృథివి, సోదరుడు తన స్వరూపమే. తల్లి, తండ్రి, ఆచార్యుడు వీరి కెల్లప్పుడును సంతోషము గల్గింపవలెను. దానివలన సర్వ తపస్సు చేసినట్లగును. వీరి యనుమతిలేకుండ ఏ ధర్మమును చేయరాదు.

ఒక్క జన్మలోని తలిదండ్రుల ఋణమును తీర్చికొనుటకైనను అనేక జన్మలు చాలవనియు అంతక్లేశమును పుత్రుని కొరకు తలిదండ్రులు పడుదురనియు మనువు చెప్పుచున్నాడు:

యం మాతా పితరౌ క్లేశం
సహేతే సంభవే నృణాం
నతస్య నిష్కృతి శ్శక్యా
కర్తుం వర్ష శతై రపి

పెద్దల సేవ

ఊర్ధ్వంప్రాణాహ్యుత్క్రామంతి
యూనః స్థవిర ఆగతే।
ప్రత్యుత్థానాభివాదాభ్యాం
పున స్తాన్ ప్రతిపద్యతే.

వయో విద్యాదులచే అధికుడైనవాడు వచ్చుచుండగా చిన్నవానికి భయముచే ప్రాణములు పైకిపోవును. ఆయనకు ఎదురుగావెళ్ళి నమస్కరించిన తర్వాత యువకుడు తిరిగి ప్రాణములను పొందును

అభివాదన శీలస్య
నిత్యం వృద్ధోపసేవినః
చత్వారి పరివర్ధంతే
ఆయుర్విద్యా యశోబలం

పెద్దలకు నమస్కరించి సేవించువానికి ఆయువు, విద్య, యశస్సు, బలము వృద్ధిపొందును.

పెద్దలకు నమస్కరింప వలసిన పద్ధతి ఈ క్రింది విధముగా నున్నది

వ్యత్యస్త పాణినాకార్య
ముపసంగ్రహణం గురోః
సవ్యేన సవ్యః స్ప్రష్టవ్యో
దక్షిణేన చ దక్షిణః

గురువులకు వందనము చేయునప్పుడు వారి కుడిపాదమును తన కుడిచేతితోను, ఎడమ పాదమును ఎడమ చేతితోను స్పృశించుచు వందనము చేయవలయును. తన కుడిచేయి పైగాను, ఎడమచేయి క్రిందుగాను ఉండునట్లు ఆయన పాదములయొద్ద పడి పాదములను స్పృశించవలయును. అని పైశ్లోకము వచనము కలదు.

విద్యా గురువునకే కాక తనకంటె పెద్దలగు బంధువులకును, విద్వాంసులకును, ఇతర మహాను

భావులకును ఇట్లు నమస్కరింప వలయునని యును, నమస్కరించు నపుడు తన గోత్ర, ప్రవర, నామధేయములను చెప్పవలయు ననియు మనువు తెలుపుచున్నాడు.

మేనమామ, పినతండ్రి, ఋత్విక్కు మున్నగువారు బంధువులట్లు నమస్కరింపదగిన వారు. తన కన్న చిన్నవారైనచో వారికి సగౌరవముగా నెదురేగవలయును, నమస్కరింప రాదు. నమస్కరింపదగినవారి భార్యలకెల్ల నమస్కారము చేయవచ్చును. స్త్రీల వయస్సు లెక్కలోనికి రాదు. వారి భర్తల వయస్సే వారి వయస్సుగా పరిగణింపబడినది. అన్న భార్య తనకంటె చిన్నదైనను నమస్కరింప దగినదే. అట్లే యితరుల విషయము. యువతులకు నమస్కరించునపుడు పాదస్పర్శ చేయకూడదు.

వివాదము కూడనివారు

ఈ క్రిందివారితో వివాదము పెట్టుకొన రాదు. ఋత్విక్కు, పురోహితుడు, ఆచార్యుడు మేనమామ, ఇంటికివచ్చిన అతిథి, బాలుడు, వృద్ధుడు, రోగి, వైద్యుడు, జ్ఞాతి, వియ్యంకుడు, బంధువు, తల్లితండ్రులు, అక్కచెల్లెండ్రు, అన్నదమ్ములు, పుత్రుడు, కుమార్తె, భార్య, సేవకులు.

ఋత్విక్పురోహితాచార్యై
ర్మాతులాతిథి సంశ్రితైః
బాలవృద్ధాతురై ర్వైద్యైః
జ్ఞాతిసంబంధిబాంధవైః
మాతాపితృభ్యాం జామిభి
ర్భ్రాతాపుత్రేణ భార్యయా
దుహిత్రా దాసవర్గేణ
వివాదం నసమాచరేత్

గురునిందను వినరాదు

తన గురువు నెవరయినను నిందించుచుండగా శిష్యుడా నిందను వినకూడదు. చెవులు మూసి కొన వలయును; లేదా మరియొక స్థలమునకు వెళ్ళిపోవలయును. ఆ నింద సహేతుకమైనను, అహేతుకమైనను నంతియే. అనగా గురువు గారిలో నిజముగా నున్న దోషములనుకూడ ఎవరైనను ఉద్ఘాటింపగా వినకూడదు.

గురోర్యత్ర పరీవాదో
నిందావాపి ప్రవర్తతే
కర్ణౌతత్ర పిధాతవ్యౌ
గంతవ్యం వీతతోఽన్యతః.

సమాజములో ఇతరుల పట్ల సత్త్వగుణము తోను, సహనముతోను, సర్దుబాటు భావము తోను వర్తింప వలయు ననుట కింతకంటెను పెద్ద యుదాహరణ ముండదు.

గౌరవా పాదకములు

సాధారణముగా మానవునకు గౌరవము కలిగించునవి ఐదు. అందు ముఖ్యమైనది విద్య, ఆ తరువాతిది కర్మాచరణము, పిమ్మట క్రమముగా వయస్సు, బందువులు, ధనము.

విత్తం బంధుర్వయః కర్మ
విద్యాభవతి పంచమీ
ఏతాని మాన్య స్థానాని
గరీ యో యద్యదుత్తరం

రోగి వృద్ధాదులపట్ల ప్రత్యేకాదరము

మార్గ మందురోగి యెదురుగా వచ్చుచో నాతడు పూజ్యుడు కానివాడైనను ఆతనికి దారినిచ్చి తప్పుకొనవలయును. స్త్రీకిని, తొంబది సంవత్సరముల వృద్ధునకును, బరువుమోయు చున్న వానికిని కూడ సాదరముగా దారినీయ వలయును. పెండ్లికుమారునకును, స్నాతకున కును, రథస్థునకును కూడ దారినొసగవలయును.

చక్రిణో దశమీస్థస్య
రోగిణో భారిణః స్త్రియాః
స్నాతకస్య చ రాజ్ఞశ్చ
పంథా దేయో వరస్యచ.

చాపల్యము-అనవసరమైన కుతూహలమును విడువవలయును

తనకు సంబంధములేని ఇతరుల రహస్యములను చూడగోరుట, కాలుచేతులను వ్యర్థముగా ప్రసరింప జేయుచుండుట, అసందర్భముగా వాక్కు విసరుచుండుట—ఇత్యాదులను వీడ వలయును. తిన్నని నడవడిక నలవరచు కొన వలయును. ఇతరులకు అపకారము చేయు తలంపును పొందరాదు.

నపాణి ప దచపలో
న నేత్రచపలోఽనృజః
నస్యా ద్వా క్చపల శ్చైవ
నపరద్రోహ కర్మధీః

జీవన సాధనములు

మానవులు జీవించుటకు పదివిధములైన పద్ధతులను మనువు అంగీకరించినాడు

విద్యాశిల్పం భృతిః సేవా
గోరక్ష్యం విపణిః కృషిః
ధృతిర్ భైక్ష్యం కుసీదంచ
దశ జీవన హేతవః

వైద్యాదివిద్యలద్వారా బ్రతుకవచ్చును. శిల్పముచే జీవించవచ్చును. జీతమునకు కుదరవచ్చును. సేవచే బ్రతుకవచ్చును. పశుపాలనము, వ్యవసాయముకూడ అవలంబింపదగినవే. బిచ్చమెత్తుకొనవచ్చును. వడ్డీవలన జీవింపవచ్చును. సంతోషమువలన జీవింపవచ్చును. (ఆదాయము తక్కువయినను సంతోషము ఆలోపమును పూరించును) ఇవి ఆపత్కాలములో మాత్రమే ఆశ్రయింపవలసిన జీవనమార్గములు సాధారణ సమయములలో నవలంబింపవలసిన మార్గములు ఆయావర్ణములకు వేర్వేరుగా నుండును

ధనాగమ మార్గములు

ఆస్తికాని, ధనముకాని వచ్చుటకు ఏడు మార్గములను మను వంగీకరించినాడు

సప్తవిత్తాగ మాధర్మ్యా
దాయోలాభః క్రయోజయః
ప్రయోగః కర్మయోగశ్చ
సత్ప్రతిగ్రహ ఏవచ.

(1) వారసత్వముగా వచ్చిన బంధుధనము (2) తన స్థలములోని గనులవలన కాని, మిత్రుల వలన కాని లభించిన ధనము (3) కొనుక్కొనగా వచ్చినది. (4) శత్రురాజును జయించి తీసికొన్నది. (5) వడ్డీ (6) వాణిజ్య వ్యవసాయములు (7) న్యాయమైన దానము గ్రహించుట.

వడ్డీ వ్యాపారము

బ్రాహ్మణ, క్షత్రియులు వడ్డీ వ్యాపారము చేయరాదు. ధనాభావము చేత బాధపడుచున్నవానికి ఉపకారము చేయుటకై ధనమును ఋణముగా నీయవలసి వచ్చినప్పుడు తక్కువ వడ్డీకి ఋణ మీయవచ్చును.

బ్రాహ్మణః క్షత్రియోవాపి
వృద్ధిం నైవ ప్రయోజయేత్
కామంతు ఖలు ధర్మార్థం
దద్యాత్ పాపీయసేఽల్పికాం.

వైశ్యుడు మాత్రమే ధారాళముగా వడ్డీ వ్యాపారము చేయుటకు అర్హుడు. అతడైనను ఎక్కువ వడ్డీని తీసికొనరాదు. రాజు నిర్ణయించిన వడ్డీని మించి తీసికొనరాదు. రాజు వడ్డీ నిర్ణయించుటలో ప్రపంచములో అన్ని దేశముల మొత్తముమీద ధనమునకు ఆ దినములలో ఎట్టి విలువ యున్నదో, ఎంత వడ్డీ న్యాయ్యమైనదో తెలిసినవారి నిర్ణయింప వలయును. సముద్రయానము చేయుచు, ఆయా దేశములను తిరుగుచు, దేశకాలార్థ పరిస్థితుల నెరిగినవారి వలన ఈ సంగతులను తెలిసికొన వలయును.

సముద్రయాన కుశలా
దేశ కాలార్థ దర్శినః
స్థాపయన్తితు యాం వృద్ధిం
సాతత్రాధిగమం ప్రతి

అతిథిపూజ—అన్నదానము

సంప్రాప్తాయత్వతిథయే
ప్రదద్యాదాసనోదకే
అన్నంచైవయథాశక్తి
సత్కృత్య విధిపూర్వకం.

ఇంటికివచ్చిన అతిథికి పాదప్రక్షాళనమునకు నీరిచ్చియాస ము మీద కూర్చుండబెట్టి శాస్త్రోక్తముగా పూజించి భోజనము పెట్టవలెను.

తృణాని భూమి రుదకం
వాక్చతుర్థీచ సూనృతా
ఏతాన్యపిసతాంగేహే
నోచ్ఛిద్యన్తే కదాచన

సత్పురుషుల యిండ్లలో అతిథులకు విశ్రాంతి స్థానము దొరకకపోదు, ఉదకము, శయ్యలభింపకపోవు. తియ్యనిపలుకులు కూడ చెవినిపడకపోవు.

పరాన్న భోజనము

ఒకని యింటికి అతిథిగా వెళ్ళి భుజించుచుండుటయే హాయిగా నుండునని తలచియే గృహస్థుడైనను ఎల్లప్పుడును పరాన్న భోజనము నే చేయుచో అది మిక్కిలి నింద్యము. అతడు అన్నదాతయింట పశువుగా జనించును

ఉపాసతేయే గృహస్థాః
పరపాక మ బుద్ధయః
తేనతే ప్రేత్య పశుతాం
వ్రజం త్యన్నాది దాయినాం

స్వజనపోషణము ముఖ్యము

శక్తః పరజనే దాతా
స్వజనే దుఃఖజీవిని
మధ్వాపాతో విషాస్వాదః
సధర్మ ప్రతిరూపకః

తన పితృ పుత్రకళత్రాదులు దుస్థితిలోనుండగా వారికై ధనములు వెచ్చింపక ఇతరులకు దానము చేయుట పైకి ధర్మముగానే కన్పట్టినను యధార్థముచేత అది అధర్మము. అది పైకి తేనెవలె మంచిదిగా కన్పట్టినను విషమువలె హాని చేయును. ఆ దాత నరకమునకే పోవును. (స్వజనము దుఃఖములో నున్నచో వారికి సహాయపడవలెనని దీనియుద్దేశమే కాని స్వజనులకు భోగములను కూర్చుటకై యెల్ల దానములను కట్టిపెట్టవలయునని కాదు.)

బ్రాహ్మణుని జీవయాత్ర

అద్రోహేణైవ భూతానా
మల్పద్రోహేణ వాపునః
యావృత్తిస్తాం సమాస్థాయ
విప్రో జీవేదనాపది

ఎవ్వరికిని పీడను గల్గింపకుండ బ్రాహ్మణుడు ధనము సంపాదింప వలయును. భూస్వాములు తమ కక్కరలేనిదిగా పొలములో విడచి పెట్టి పోయిన ధాన్యమును ఏరుకొనియు, అయాచితముగా వచ్చిన దానిని తీసికొనియు జీవింపవచ్చును. అది సాధ్యము కానిచో ఎవరి వద్దనైనను యాచించి తీసికొన్న దానితో జీవింపవలయును. (యాచింపగా ఇచ్చిన వాడు తన ధనమును వీడునపుడు మనస్సులో కొంచెము బాధ ననుభవింపవచ్చును.) కనుక ఇది రెండవ పద్ధతిగా అంగీకరింపఁబడినది. (విద్య చెప్పి ధనము గ్రహించుటయు, యజ్ఞములను చేయించి దక్షిణలను తీసికొనుటయుకూడ బ్రాహ్మణున కంగీకరింపఁబడినవి.)

యాత్రామాత్ర ప్రసిద్ధ్యర్థం
స్వైః కర్మభి రగర్హితైః

అక్లేశేన శరీరస్య కుర్వీత ధన సంచయం.

శరీరధారణము, కుటుంబపోషణము, నిత్యకర్మానుష్ఠానము - మున్నగునవి సాగిపోవుట కవసరమైనంత వరకే బ్రాహ్మణుడు ధనము సంపాదింపవలయును. భోగములకొరకు సంపాదింపరాదు. లోకముచే నింద్యములు కాని కర్మల చేతనే అతడు ధనము సంపాదింపవలయును. ధనార్జనము కొరకు ఇతరులను బాధపెట్టకూడదనట్లే తన శరీరమును కూడ బాధపెట్టరాదు.

న లోకవృత్తం వర్తేత
వృత్తిహేతోః కథంచన।
అజిహ్మా మశఠాం శుద్ధాం
జీవే ద్బ్రాహ్మణ జీవికాం.

జీవికకొరకు బ్రాహ్మణుడు ఇచ్చకములాడి యొకరిని మెప్పించుట మున్నగు పనులలోనికి దిగరాదు. వక్రమార్గములను, దంభమును పూనరాదు. తనకు కాని సద్గుణములున్నట్లు ప్రకటింపరాదు. స్వచ్ఛమైన బ్రాహ్మణ జీవికను ఆశ్రయింపవలయును.

సంతోషం పరమాస్థాయ
సుఖార్థీ సంయతో భవేత్
సంతోషమూలం హిసుఖం
దుఃఖమూలం విపర్యయః.

కుటుంబపోషణమునకును, పంచ మహాయజ్ఞాది నిత్యకర్మానుష్ఠానమునకును అవసరమగు ధనములతో బ్రాహ్మణుడు సంతోషపడి నిగ్రహము గల్గియుండవలయును. అట్లు సంతోషపడక అధికధనముకొరకు యత్నించుచో పాపములు చేయవలసివచ్చును. దానివలన నరకప్రాప్తికల్గును. సంతోషమువలన స్వర్గాదిసుఖములు లభించును.

విధాతా శాసితా వక్తా
మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే
తస్మై నాకుశలం బ్రూయా
న్న శుష్కాంగిర మీరయేత్.

బ్రాహ్మణుడు ధర్మానుష్ఠానము చేసికొనుచు తన యధీనమునందున్న వారికి ధర్మము నుపదేశించుచు శిక్షానము నితరుల కందించుచు సర్వభూతములయందు మైత్రిని గలిగి యుండవలయును. అట్టి బ్రాహ్మణుని గూర్చి కఠినోక్తులను పలుకరాదు; అమంగళముల నుచ్చరింపరాదు.

స్త్రీ గౌరవము

యత్రనార్యస్తు పూజ్యన్తే
రమన్తే తత్ర దేవతాః
యత్రైతాస్తు నపూజ్యన్తే
సర్వాస్తత్రాఽఫలాః క్రియాః.

స్త్రీ లెక్కడ పూజింప బడుదురో దేవత లక్కడ క్రీడింతురు, స్త్రీ లెక్కడ పూజింప బడరో అక్కడ ఎన్ని సత్కార్యములు జరిగి నను అవి వ్యర్థములు.

పితృభి ర్భ్రాతృభిశ్చైతాః
పతిభిర్దేవరై స్తథా
పూజ్యా భూషయిత వ్యాశ్చ
బహుకళ్యాణ మీప్సుభిః

తండ్రులచేతను సోదరులచేతను భర్తల చేతను మఱదుల చేతను స్త్రీలు పూజింపబడ దగినవారు, భూషణములచే అలంకరింపబడ దగినవారు. శుభమును గోరు వారెల్లరును స్త్రీలను పూజించి భూషింపవలయును.

జామయోయాని గేహాని
శపంత్య ప్రతిపూజితాః
తానికృత్యా హతానీవ
వినశ్యంతి సమంతతః

అక్కచెల్లెండ్రు పూజింప బడదగినవారు. వారు పూజింపబడనివారై శపించిన గృహములు దయ్యములచేత కొట్టబడినవి వలె నశించును.

దాంపత్య ధర్మము

శ్లో॥ అన్యోన్యస్యాఽవ్యభిచారో
భవేదామరణాంతికః
ఏషధర్మఃసమాసేన
జ్ఞేయః స్త్రీపురుషయోఃపరః

మరణపర్యంతము భార్యాభర్తలు వ్యభిచ రింపకూడదు. సంగ్రహముగా చెప్పవలయు నన్నచో నిదియే స్త్రీ పురుషుల యుత్కృష్ట ధర్మము.

శ్లో॥ సంతుష్టో భార్యయాభర్తా
భర్త్రాభార్యా తథైవచ
యస్మిన్నేవ కులేనిత్యం
కళ్యాణం తత్రవైధృవం॥

ఏ యింట భార్య భర్తతోను, భర్త భార్య తోను సంతుష్టితోనుందురో ఆయింట నిత్యము శుభము కల్గు చుండుట నిశ్చయము.

సర్వవర్ణ సామాన్య ధర్మములు

అహింసా సత్యమస్తేయం
శౌచమింద్రియ నిగ్రహః
ఏతం సామాసికం ధర్మం
చాతుర్వర్ణ్యేఽ బ్రవీన్ మనుః.

అహింస, సత్యము, పరద్రవ్యము నపహ రింపకుండుట, పరిశుద్ధి, యింద్రియ నిగ్రహము ఇవి నాల్గు వర్ణముల వారికిని సంగ్రహముగా మనువుచే చెప్పబడిన ధర్మము లు.

దురభ్యాసములు

దశకామ సముత్థాని
తథాష్టౌ క్రోధజానిచ
వ్యసనాని దురంతాని
ప్రయత్నేన వివర్జయేత్
మృగయాక్షోదివా స్వప్నః
పరివాదః స్త్రియోమదః
తౌర్యత్రికం వృథాట్యాచ
కామజో దశకో గణః
పైశున్యం సాహసం ద్రోహ
ఈర్ష్యాసూయార్థ దూషణం
వాగ్దండజంచ పారుష్యం
క్రోధజోపి గణోష్టకః

కామము వలన పుట్టిన దురభ్యాసములు పది. క్రోధమువలన పుట్టిన దురభ్యాసములు ఎనిమిది. కామము వలన పుట్టిన పది దురభ్యాసము లెవ్వి యన : వేట, జూదము, పగటి నిద్ర, పరదోష కథనము, పరస్త్రీ సంపర్కము, మద్యపానము, నృత్య గీత వాదిత్ర వ్యసనము, వ్యర్థముగా తిరుగుట.

క్రోధము వలన కలుగు ఎనిమిది దోషము లెవ్వియన :

ఇతరులమీద లేనిపోని నేరములు చెప్పుట, సాహసము, (సత్పురుషులను దండించుట,) కప టముగా అపకారము చేయుట, ఇతరుల గుణ ముసు సహింపలేక పోవుట, ఇతరుల గుణముల యందు దోషములను చూపుట, అర్థము నపహ రించుట, (ఇతరుల కీయవలసిన దాని నీయకుం డుటకూడ), పరదూషణము, పరులను హింసిం చుట.

ఈ పదునెనిమిది వ్యసనములు ఎవ్వరికినితగవు ప్రజాశాసకుడుగానున్న రాజునకు బొత్తుగా తగవు.

వ్యసనస్య చ మృత్యోశ్చ
వ్యసనం కష్ట ముచ్యతే
వ్యసన్యధోధో వ్రజతి
స్వర్యాత్యవ్యసనీమృతః

వ్యసనము, మృత్యువు లనెడి రెండింటిలో వ్యసనమే చెడ్డది. వ్యసనములు కలవాడు క్రమముగా క్రిందికి పోవును. దురభ్యాసములు లేనివాడు మరణానంతరముస్వర్గాదిలోకములకేగును.

ద్యూతం సమాహ్వయం చైవ
రాజా రాష్ట్రా న్నివారయేత్
రాజ్యాంతకరణా వేతౌ
ద్వౌదోషౌ పృథివీక్షితాం

ప్రాణములేని పాచికలు మున్నగువానితో నాడబడునది జూదము. కోళ్లు,పొట్టేళ్ళుమున్నగు ప్రాణులతో కూడిన పందెములకు సమాహ్వాయమని పేరు రాజు జూదమును, సమాహ్వాయమును తన రాష్ట్రములో లేకుండ చేయవలెను.

రాజు

శ్లో। యస్యస్తేనః పురేనాస్తి
నాన్యస్త్రీగో నదుష్టభాక్
నసాహసికదండఘ్నౌ
స రాజా శక్రలోకభాక్.

ఏ రాజుయొక్క పట్టణమందు దొంగలేడో, పరస్త్రీగామిలేడో, చెడ్డవాక్కును పలుకువాడు లేడో, చెడ్డపనులకు సాహసించువాడులేడో, ఇతరులను హింసించువాడులేడో ఆరాజు ఇంద్రలోకమున కేగును.

అదండ్యాన్ దండయన్ రాజా
దండ్యాంశ్చా ప్యదండయన్
అయశో మహదాప్నోతి
నరకంచైవ గచ్ఛతి.

రాజు దండింపవలసిన వారిని దండింపక పోయినను, దండింప కూడని వారిని దండించినను అపకీర్తిని, నరకమును పొందును. (రాజునకు పక్షపాత ముండరాదు. కసి యుండరాదు.)

నహిదండా దృతే శక్యః
కర్తుం పాప విగ్రహః

స్తేనానాం పాపబుద్ధీనాం
నిభృతం చరతం క్షితౌ.

దొంగలయొక్కయు, లోకములో స్వేచ్ఛగా సంచరించు నితర పాపుల యొక్కయు దండనము రాజునకు కర్తవ్యము. దండనముకాకుండా చోరాది పాపులను నిగ్రహించుట శక్యముకాదు.

త్రైవిద్యేభ్యస్త్రయీం విద్యాం
దండనీతిం చశాశ్వతీం
అన్వీక్షికీం చాత్మవిద్యాం
వార్తారం భాంశ్చ లోకతః

రాజు పండితుల నుండి వేదమును, పరంపరాగతమైన రాజనీతిని,తర్కశాస్త్రమును, వేదాంత శాస్త్రమును, వాణిజ్య వ్యవసాయాది శాస్త్రములను అభ్యసించవలెను.

ఇంద్రియాణాం జయే యోగం
సమాతిష్ఠే ద్దివానిశం
జితేంద్రియోహి శక్నోతి
వశేస్థాపయితుం ప్రజాః

రాజు రేయింబవలు ఇంద్రియ జయమును అభ్యసించవలెను. ఇంద్రియ జయము కలవాడు ప్రజలను వశమందుంచుకొనుటకు సమర్థుడగును.

రాజు తన రాష్ట్రములో నున్న శ్రోత్రియుని (వేదశాస్త్రములను అధ్యయనము చేసిన అనుష్ఠానపరుని) ఆదరముతో చూడవలెను. అతని విద్యను, ప్రవర్తనను తెలిసికొని యాతనికి ధర్మసమ్మతమైన జీవితమును కల్పించ వలెను. తండ్రి కుమారుని రక్షించునట్లాతనిని చోరాదులనుండి రక్షింప వలెను.

ఈ రీతిగా శ్రోత్రియుడు రాజుచే రక్షింపబడినవాడై యే ధర్మమును నిత్యము చేయుచున్నాడో దానిచేత రాజు యొక్క ఆయువు, ధనము, రాజ్యము వృద్ధినొందును.

శ్రుతవృత్తేవిదిత్వాస్య
వృత్తింధర్మ్యాం ప్రకల్పయేత్
సంరక్షేత్సర్వతశ్చైనం
పితాపుత్ర మి వౌరసం
సంరక్ష్యమాణోరాజ్ఞాయం
కురుతే ధర్మ మన్వహం
తే నాయు ర్వర్ధతే రాజ్ఞో
ద్రవిణం రాష్ట్ర మేవచ.

రాజునకు రాగద్వేషము లుండకూడదనియు, దయా దాక్షిణ్యము లుండవలెననియు గుర్తింపవలెను.

సర్వేషాంతు విదిత్వేషాం
సమాసేన చికీర్షితం
స్థాపయేత్తత్ర తద్వంశ్యం
కుర్యాచ్చ సమయ క్రియాం.
జిత్వాసంపూజయేద్దేవాన్
బ్రాహ్మణాంశ్చైవ ధార్మికాన్
ప్రదద్యాత్ పరిహారాంశ్చ
ఖ్యాపయేద భయానిచ.

రాజు తాను జయించిన రాష్ట్రములో మంత్రులు మున్నగువారి అభిప్రాయములను బాగుగా తెలిసికొని ఆ జయింపబడిన రాజు యొక్క వంశస్థుని రాజ్యమునకు పట్టాభిషిక్తుని చేయవలెను.

తాను జయించిన రాజ్యములోని దేవులను (ముఖ్యాలయములలోని దేవతలను) ధార్మికులైన బ్రాహ్మణులను పూజించి యుద్ధములో కలిగిన నష్టములకుగాను ఆ దేశస్థులకు పరిహారము నొసగి అదివరకు రాజభక్తిచేత ఎవరు యుద్ధము చేసినారో వారికి అభయము నొసగవలెను. (తనతో యుద్ధము చేసినవారిని దండించకూడదు.)

రాజెన్నడును కపటముగా వ్యవహరింపకూడదు. శత్రువులు తనపట్ల ప్రయోగించు మాయనుమాత్రము రహస్యముగా తెలిసికొనుచు దానికి ప్రతీకారము చేసికొనుచుండవలెను.

అమాయయైవవర్తేత
నకథంచన మాయయా
బుద్ధేతారిప్రయుక్తాంచ
మాయాం నిత్యం స్వసంవృతః.

రాజు యుద్ధమునకు సిద్ధముగాలేని శత్రువునెన్నడును కొట్టరాదు. యుద్ధాభిముఖుడైనవానినికూడ కపటాయుధములచే కొట్టరాదు.

నకూటైరాయుధైర్హన్యా
ద్యుధ్యమానో రణేరిపూన్.
నకర్ణికార్వైర్నాపిదిగ్ధై
ర్నాగ్నిజ్వలితతేజసైః

రాజు యుద్ధమందు శత్రువును కపటాయుధములచేతను (పైకి కొయ్యముక్కలవలె కన్పట్టి లోపల వాడియైన శస్త్రములుగల ఆయుధములచేతను) కర్ణికారములతో గూడిన (కొండగోగుతో గూడిన) బాణములచేతను మంటలను రేపు బాణములచేతను విషముతో కూడుకున్న బాణములచేతను కొట్టకూడదు.

బలవంతుడు బలహీనుని వద్ద బలాత్కారముగా నేదైనతీసికొన్న దానిని రాజుచెల్లనీయకూడదు. బలవంతుడు బలహీనుని భూమి నాక్రమించుకొని సస్యము ననుభవించినను, ఆ యనుభవింపబడిన పంటను భూమినికూడ రాజు ఆ బలహీనున కిప్పింపవలయును. బలవంతముగా వ్రాయించుకొన్న అన్యాయ్యము లయిన ఋణపత్రాదులను రాజు చెల్లనీయకూడదు.

బలాద్దత్తం బలాద్భుక్తం
బలాద్యచ్చాపి లేఖితం
సర్వాన్ బలకృతానర్థా
నకృతాన్ మను రబ్రవీత్.

ఈ రీతిగా రాజు దుర్బలులకు బలముగానుండవలయును.

*

మనిషి - మర

మహాత్మ గాంధీ

యంత్రములన్నియు లేకుండపోయినచో నేను విచారపడను. అట్లు పోవుట వలన నేదో యాపద రాగలదనియు భావించను.

నా ఆక్షేపణము యంత్రములను గురించికాదు, యంత్రములపై గల వ్యామోహమును గూర్చి, యంత్రముల వలన శ్రమ తగ్గుననియే ఈ వ్యామోహము. వేలకొలది మంది పని లేక, తిండిలేక వీధులపాలయి నశించి పోవువరకు, మనుష్యులు ఈ శ్రమను తగ్గించుకొనుచునే యుందురు నేను కాలమును శ్రమను తగ్గించుటనే కోరుదును కాని అది మానవజాతిలో నేకొద్దిమందికొరకోకాదు. అందరి కొరకును. సంపద కేంద్రీకృతమగుట నా కిష్టమే. అది కొద్దిమంది చేతులలో కాదు, అందరి చేతులలో. ఈనాడు కొద్దిమంది కోట్లకొలది జనులవీపులపై నెక్కి స్వారి చేయుటకే యంత్రములు సహాయపడుచున్నవి ఈ యంత్రముల పైనున్న వ్యామోహమునకు మూలము పేరాశయేగాని మానవశ్రమను తగ్గించవలెనను జీవకారుణ్యముకాదు నేనెట్టి పరిస్థితులకొరకు నాశక్తికొలది పోరాడుచున్నానో, ఆ తత్వమునకే ఈదురాశ వ్యతిరేకమైనది.

అన్నింటికంటె పరమముగా మానవునిగూర్చి విచారించ వలయును. యంత్రము మానవుని కాలుసేతులను కట్టివేయునది కాగూడదు. సంపూర్ణమైన ఆత్మ మోక్షణము పొందుటకు సహాయకారికాని శరీరమును నేనెటు తిరస్కరింతునో, అట్లే నా ఆదర్శమును బట్టి చూచినచో, అసలు యంత్రములనే నిరాకరింతును. ఈ దృష్టి ప్రకారము నేను యంత్రముల నన్నింటిని నిరాకరింతును కాని శరీరమువలె నవశ్యములు గనుక నవి నిలచియే యుండును. ఈ శరీరమే పరమ పరిశుద్ధమైన యొక యంత్రము. కాని ఆత్మోన్నత్యమున కది యడ్డు వచ్చినప్పుడు దానిని తిరస్కరించవలసి యున్నది

మానవస్వభావమునందు విశ్వాసము కలిగియుండుట మంచిది కాని తాము చేసిన అకృత్యముల ఫలితముగా కొన్ని జాతులు ఇంతకుపూర్వము నశించినవన్న సత్యమునునిరూపించుటకు రోము, గ్రీసు, ఈజిప్టు, బాబిలోన్ మున్నగునవి ప్రత్యక్షసాక్ష్యములు. యూరప్ తన ఉత్తమమైన, శాస్త్రీయమైన, బుద్ధిచే ఈ స్పష్టమైన యంశమును గుర్తించి తనమార్గమును సవరించుకొని నిస్పృహాజనకమైన ఈ యంత్రయుగమునుండి బయట పడగలదని మన మాశింపవచ్చును. అది తప్పనిసరిగా పురాతన నిరాడంబర జీవితమువంకకు, మరలుట కానక్కరలేదు. కాని గ్రామీణ జీవనము ప్రధానమగునట్టియు, పాశవికమైన భౌతికశక్తి ఆధ్యాత్మికశక్తికి లోబడునట్టియు వ్యవస్థ ఏర్పడి తీరవలయును.

అత్యధిక సంఖ్యాకులను దోపిడి చేయుటకును, కొద్దిమంది కొరకు ధనమును, అధికారమును కేంద్రీకరించుటకును యంత్రములను సమీకరించు

పద్ధతి పూర్తిగా తప్పని నా అభిప్రాయము చాలవరకు నేటి యంత్రముల పద్ధతిఅదే యంత్రముల ప్రత్యేక స్థితిని, వానివలని దోపిడిని తొలగించి వానికి తగు స్థానమునుచూపుటకు మన ఖాదీ ఉద్యమ మొక నిర్మాణాత్మకమైన ప్రయత్నము దీనినిబట్టి నా సూత్రములకు లోబడి, యంత్రములను నడుపువారు, తమను, తమజాతిని మాత్రమే దృష్టిలో పెట్టుకొని కాక, మానవజాతి నంతటిని దృష్టియందుంచుకొని ఆలోచించగలరు.

యంత్రముల కొక స్థానమున్నది. వానికి నిలుకడకూడ కలిగినది. కాని అవి అవసరమైన మానవశ్రమను తొలగించుటను మన మనుమతింపజాలము. కుటీర పరిశ్రమ యందలి చిన్న చిన్న యంత్రములలో వచ్చిన ప్రతి అభివృద్ధికి నేను స్వాగతమిత్తును. లక్షలాది రైతాంగమునకు వారి వారి ఇండ్లలో మరొక వృత్తిని కల్పించకుండ, విద్యుచ్ఛక్తిచే నడుపబడు మరకదుళ్ళను ప్రవేశపెట్టి, చేతి పనిని నాశనము చేయుట క్రూరమైన నేరమని నాకు తెలియును

భారతదేశము కూడ యంత్రమయమైనప్పుడు తక్కిన దేశములను దోచుకొనక తప్పదు. అట్టిచో భారతదేశము తక్కిన దేశములపాలిటి శాపముగను, ప్రపంచముపాలిటి ప్రళయముగను కాగలదు. మరి తక్కిన దేశములను దోచుకొనుటకు భారతమును యంత్రమయము చేయవలెనని నేనేల ఆలోచించవలయును? ముప్పదికోట్లమంది నిరుద్యోగులకు మనము పని చూపగలుగుచుండగా, ముప్పదిలక్షల మందికి పని చూపలేక ఇంగ్లాండు, ఆ దేశమందలి గొప్ప గొప్ప మేధావులను కలవర పెట్టుచున్న, నిరుద్యోగసమస్య నెదుర్కొనుచున్నది. ఈ సన్నివేశమందలి వైపరీత్యము మీకు కనిపించుటలేదా? ఈ యంత్రీకరణ యొక్క భవిష్యత్తు పాశ్చాత్య దేశములకు అంధకారమయమైనప్పుడు, అది భారతదేశమునకు, మరింత యంధకారమయము కాదా?

ప్రజలయొక్క నిజమైన అవసరమునుబట్టి పెద్ద పెట్టున నుత్పత్తి చేయుట యన్నది జరుగదు. పెద్దపెట్టున నుత్పత్తి చేయుటయే యొక గుణమైనచో, ఆ ఉత్పత్తి మితిలేకుండ అధికాధిక మగుటకు సమర్థము కావలెను. కాని ఈ పెద్దపెట్టున నుత్పత్తి చేయుటలో కూడ కొన్ని పరిమితులున్నట్లు స్పష్టముగా చూపవచ్చును. అన్ని దేశములును, పెద్దపెట్టున నుత్పత్తి చేయు పద్ధతి నవలంబించినచో ఆవస్తువులన్నింటికి తగినంత పెద్ద వ్యాపారముండదు. కనుక పెద్దపెట్టున చేయు నుత్పత్తి ఒకచో నాగవలసి వచ్చును.

పెద్దపెట్టున నుత్పత్తి చేయవలెనను వ్యామోహమే ప్రపంచ సంక్షోభమునకు మూలమని నావిశ్వాసము. యంత్రములు మానవుని అవసరములన్నింటిని సమకూర్పగలవని ఒక్కక్షణ మంగీకరింతము. అయినప్పటికి అవి ఆ ఉత్పత్తిని కొన్ని ప్రత్యేక ప్రాంతములలో కేంద్రీకరించును. అందువలన ఆ వస్తువుల వినియోగమును [illegible]

టకు మనము ద్రావిడప్రాణాయామము చేయవలసివచ్చును. అట్లుగాక ఉత్పత్తి పంపకము ఎక్కడికక్కడనే, ఆ వస్తువులు కావలసిన వారున్నచోట్ల, జరిగినప్పుడు ఈ వినిమయము దానంతటదే క్రమబద్ధమగును. అక్కడ మోసమునకవకాశము తక్కువ. స్పెక్యులేషన్ చేయుట కవకాశమే లేదు.

ఉత్పత్తియు దాని వినియోగమును ఒకేచోట జరిగినప్పుడు ముందేమగునో తెలియని స్థితిలో ఏధరకైనను తెగించి ఉత్పత్తిని అధికమొనర్చుట యనునది మటుమాయ మగును. మన ఈనాటి ఆర్థికవిధానమునందలి ఎడతెగని చిక్కులును, సమస్యలును అంతటితో నంతమగును. అప్పుడు అసహజముగా కొలది మంది జేబులు నిండవు. కావలిసినంత యుండియు తిండికి లేని దారిద్ర్యము తక్కినవారికి కలుగదు. నిశ్చయముగా పెద్దపెట్టున ఉత్పత్తి జరుగవలెననియే నా భావన. కాని అది బలవంతముగా కాగూడదు ఒక్కమాటలో మన ఖాదీ ఉద్యమ సందేశము అదే అదియు పెద్దపెట్టున నుత్పత్తి చేయుటయే, కాని ఎవరిండ్లలోవారు చేయుట. ఒక వ్యక్తి చేయగల ఉత్పత్తిని లక్షలచే గుణించినప్పుడు అద్భుతమైన పరిమాణమున గొప్ప ఉత్పత్తి జరిగినట్లు కాదా?

నా పద్ధతిలో మానవశ్రమయొక్కటే చెల్లదగిన నాణెము, లోహముచే చేయబడిన నాణెముకాదు తన శ్రమ నుపయోగించగలిగిన ప్రతివానికిని ఆ నాణెము కలుగును, సంపదయును కలుగును. వాడు తనశ్రమశక్తిని వస్త్రముగా మార్చుకొనును. ధాన్యముగా మార్చుకొనును. అతడు తనకు తానై తయారు చేసికొనలేని వస్తువు కావలసివచ్చినచో, తనకడ, అదనముగా నున్న ధాన్యమును పెట్టి దానిని కొని తెచ్చుకొనును, ఇది స్వతంత్రముగా న్యాయముగా అన్యోన్యముగా జరుపబడు శ్రమశక్తులయొక్క మారకము మాత్రమే. కనుక ఇందులో దోపిడి లేదు ఇది ఆదిమకాలమునాటి ఇచ్చిపుచ్చుకొను విధానమును పునశ్చరించుట యని మీరాక్షేపించవచ్చును. కాని అంతర్జాతీయ వ్యాపారమంతయు ఈయిచ్చిపుచ్చుకొను పద్ధతిపై నాధారపడినదికాదా?

మానవుల శ్రమశక్తిచే సాధ్యములు కాని ప్రయోజనములను సాధించుటకేర్పడిన భారీ యంత్రములకు తప్పని సరిగా స్థానమున్నది. కాని అట్టివన్నియు ప్రభుత్వాధీనమున నుండి పూర్తిగా ప్రజాప్రయోజనము కొరకు వినియోగింపబడవలెను.

నా కర్తవ్యమునందలి విశ్వాసమే నన్ను బ్రతికించుచున్నది. ఈ యంత్రయుగము మనుష్యులను మరలుగ మార్చుటకు ప్రయత్నించుచుండగా నేను మరగా మారిన మనిషిని అతని నిజస్థితికి తెచ్చుటకు లక్షించుచున్నాను

చేయవలసినంత పనిని చేయుటకు తగినంతమంది మనుష్యులు దొరకనప్పుడు, యంత్రముల నుపయోగించుట మంచిది. కాని ఆ పని చేయుటకువలసినవారికంటె నెక్కుడు మంది

యున్నప్పుడు యంత్రముల నుపయోగించుట హానికరము. మన గ్రామము లందలి లక్షలాది ప్రజలకు ఎట్లు తీరిక కల్పించుటా అనునది మనకు సమస్య కాదు. అసలు ఏటి కారు నెలలు మన గ్రామీణులు సోమరితనముతో గడుపుదురు. వారి ఆతీరిక కాలమును వినియోగించుకొనుటెట్లా యనునదియే మన సమస్య

ఈ యంత్రయుగము సాధించిన దంతయు మాయమైనప్పుడు కూడ ఈ మనచేతి పరిశ్రమలు నిలచియే ఉండును. దోపిడులన్నియు అరికట్టబడిన పిమ్మట సేవయు, త్రికరణశుద్ధిగల శ్రమ శక్తియు నిలువగలవు- అని నాలోనాకు నమ్మకమున్నది. ఈ విశ్వాసము నన్ను నిలబెట్టుచుండుటచే నేను నాకర్తవ్యము నందు ముందంజ వేయుచున్నాను. స్టీఫెన్‌సన్, కొలంబస్‌లవంటి వారిని వారి కర్తవ్యమునందు నిలువబెట్టినది ఇట్టి అజేయమైన విశ్వాసమొక్కటియే.

ఒక కర్మాగారము కొన్ని వందల మందికి పనిచూపి వేలకొలదిమందిని నిరుద్యోగుల నొనర్చుచున్నది నేనొక నూనెమర తెచ్చి టన్నులకొలది నూనె నుత్పత్తి చేయవచ్చును. కాని వేల కొలది మంద తెలికలవారికి నేను పని లేకుండ చేసినవాడ నగుదును దీనిని నేను వినాశకరమైన శక్తి అని చెప్పెదను. కాని లక్షలాది చేతులుకూడి చేసిన శ్రమవలన జరిగిన ఉత్పత్తి నిర్మాణాత్మకమును, బహుజనక్షేమ కరమును కాగలదు. ప్రభుత్వాధీనము నందున్న యంత్రములద్వారా నైనను ఋద్ధపెటున ఉత్పత్తిచేయుట వలన లాభములేదు. కాని ఈ లక్షలకొలది మందియొక్క శ్రమను తగ్గించి వారు వైజ్ఞానికముగా కృషిచేయుటకు ఏల విశ్రాంతినీయరాదని య డు గుచున్నారు విశ్రాంతి కొంతవరకు మాత్రమే అవసరము. మంచిదికూడ. మానవుడు చెమటోడ్చి తన తిండిని తాను తినునట్లుగా భగవంతుడు సృష్టించినాడు మన ఆహారపదార్థములతో సహా మనకు కావలసిన వన్నియు మనము గారడీవానిటోపీనుండి పుట్టింపగల పరిస్థితి ఏర్పడునేమోయని నా భయము. ఈ యంత్రవిధానము పాము పుట్టవంటిది. అందులో ఒకటినుండి వంద పాములవరకుండవచ్చును. ఎక్కడ యంత్రములు కలవో అక్కడ పెద్దపట్టణములున్నవి ఎక్కడ పెద్ద పట్టణములు కలవో అక్కడ ట్రాములు, రైళ్ళు ఉన్నవి అట్టిచోట్ల మాత్రమే, మనకు విద్యుద్దీపములు కానవచ్చును. ఎక్కడ కృత్రిమ ప్రయాణములు వృద్ధి యగునో అక్కడ ప్రజల ఆరోగ్యము చెడునని ఋజువర్తనులైన వైద్యులు చెప్పెదరు.

భారతదేశమున ఏడు లక్షల గ్రామములందు నివసించుచున్న ప్రజలనెడు కోట్లకొలది సజీవయంత్రములకు పోటీగా ఇప్పుడు ఈ నిర్జీవయంత్రములను పెట్టవలెను సక్రమముగా ఉపయోగించబడిన యంత్రములు మానవుని పరిశ్రమను సుకరమొనర్చి సహాయపడును. కాని ఇప్పటి యంత్రవిధానము అంతకంతకు కొద్దిమంది చేతుల లోనికి ధనమును ప్రోగుచేసి, లక్షలాది స్త్రీ పురుషులనోటి ముందర కూటిని తీసివేయుచున్నది

ఆయుర్వేదము - ఆహారము

శ్రీ ప్రకాశచంద్ర శతపథి

"ప్రాణినాం పునర్మూల మాహారో బలవర్ణౌజసాంచ" ప్రాణులకు బలము, వర్చస్సు, ఓజస్సు వీటన్నింటికి ప్రధాన కారణము ఆహారము. ఆహారమువలన ఆరోగ్యమేగాక శీలముకూడా చేకూరుతుంది. మిథ్యాహార విహారములవలన దోషవైషమ్యము కలిగి వ్యాధులు సంప్రాప్తమౌతవి.

"నిత్యంసన్నిహితామిత్రం
సమీక్ష్యాత్మాన మాత్మవాన్.
నిత్యం యుక్తంపరిచరేత్
ఇచ్ఛన్నాయురనిత్వరమ్.

లోకమున తనకు హితముకోరు వ్యక్తి తనకు శత్రువుగా, అపాయకరమైనది వ్యాధి రూపమయిన శత్రువు సర్వదా సన్నిహితమై యున్నదని తలచి, యింద్రియములను నిగ్రహించి, ఆహార విహారములను హితముగా నెరవేర్చుకొనుచు తగు జాగ్రత్త కల్గియుండు నెడ అనశ్వరమైన ఆయురారోగ్యములు కలుగునని ఆయుర్వేదము ప్రబోధించినది.

"తచ్చనిత్యం ప్రయుఞ్జీత
స్వాస్థ్యంయేనాను వర్తతే
అజాతానాం వికారాణాం
అను త్పత్తి కరంచయేత్.

ఆయుర్వేద సిద్ధాంతము ననుసరించి ఆహారమనునది ఒక్క స్థూల శరీరమును పోషించి పెంపుదల చేయునట్టిది మాత్రమే అయియుండరాదు. సత్వము, ఆత్మ, శరీరము యీ మూడింటికి హితమయినదే సరియైన ఆహారము. ఆహారము నాలుగు రకములుగా నుండును. అశితం, పీతం, లీఢం ఖాదితం అని.

అశితమనగా - విశేషముగా దంతములచే నమలవలసిన పనిలేక తినుటకు యోగ్యములయిన అన్నము మున్నగు మృదుపదార్థములు.

పేయమనగా - త్రాగదగినపాలు, నీళ్లు

లీఢమనగా- నాలుకచే నాకి చప్పరించి తినదగిన పచ్చడి మున్నగు పదార్థములు.

ఖాద్యమనగా - దంతములచే నమిలి తినదగిన కఠినపదార్థములు. ఈ చతుర్విధాహార పదార్థములును మనుజుల శరీరతత్త్వాదులకు అనుకూలముగా నుండునవయినచో ఆరోగ్యమును, ప్రతికూలముగా నున్నచో అనారోగ్య అశుభములను చేకూర్చును.

"అశిత - పీత - లీఢ - ఖాదిత
ప్రభవాశ్చాస్మిన్ శరీరేవ్యాధయోభవన్తి
హితాహితోపయోగ విశేషాస్త్వత్ర
శుభాఽశుభవిశేషకరా భవన్తి" ఇతి.

శుభమును హితమును-అశుభ, అహితములను కల్గించునది ఆహారమే గనుక, ప్రతి వ్యక్తి నిత్యమూ తనకు హితమయినది శుభమును చేకూర్చునదియగు ఆహారమునే గైకొనవలయును.

నరాగాన్నాప్యవిజ్ఞానాత్
ఆహారముపయోజయేత్
పరీక్ష్యహితమశ్నీయాత్
దేహోహ్యాహారసమ్భవః

దేహము ఆహారమువలన పుట్టి ఆహారము వలననే వృద్ధిపొందును కనుక పరిజ్ఞాతయగువాడు కేవలము రాగముచేతగాని, అజ్ఞుడు హితాహితముల వివేకము లేకయైననూ అహితములగు ఆహారములను సేవించరాదని చరకము ఉపదేశించినది.

పరిజ్ఞానముగల మనుజుడు తనకుఆహారము అహితము కానిదని తెలిసిననూ, జిహ్వా చాపల్యముచేత అహితాహారముల సేవించును. జ్ఞానహీనుడు హితాహిత పరిజ్ఞానములేక అహితాహారములను సేవించును. ఈరెండు పద్ధతులునూ తప్పిదములే. కనుక బుద్ధిమంతుడగు మనుజుడు హితాహితముల నెరిగి, అహితముల విడిచిపుచ్చి హితాహారముల సేవించదగునని భావము దేహము ఆహారమువలననే

పుట్టినది. ఆహారవైషమ్యముచేతనే గిట్టుటకును కారణమగుచున్నదని తెలిసికొనవలయును.

ఆయుర్వేద శాస్త్రము ననుసరించి ఆహారము యీదిగువరీతిన నిర్ణయింపబడియున్నది.

ఆహారత్వ మాహారస్యైకవిధ మర్థాఽభేదాత్
సపునర్ద్వియోనిః స్థావరజఙ్గమాత్మకత్వాత్,
ద్వివిధ ప్రభావోహితాహితోదర్క విశేషాత్,
చతుర్విధోపయోగః పాన-అశన -
భక్ష్య - లేహ్యోపయోగాత్,
షడాస్వాదోరసభేదతః షడ్విధత్వాత్,
వింశతిగుణోగురు-లఘు-శీత
ఉష్ణ-స్నిగ్ధ-రూక్ష
మన్ద-తీక్ష్ణ-స్థిర-సర-మృదు-కఠిన-విశద-
పిచ్ఛిల-శ్లక్ష్ణ-ఖర-సూక్ష్మ-స్థూల-సాన్ద్ర-
ద్రవాను గమాత్
అపరి సంఖ్యేయ వికల్పోద్రవ్య సంయోగ
కరణ బాహుళ్యాత్.

భుజింపబడునది ఆహారమనబడును. ఆ ఆహారముస్థావరము, జంగమమునని రెండు విధములనుండును. ఈ రెండు విధములైనపదార్థములు రెండు విధములుగా ప్రభావవంతములైయుండును. ధాన్యాదులు స్థావరములనబడును. ప్రాణులకు సంబంధించిన మాంసాలుదు జంగమములనబడును- ఈఆహారపదార్థములు భుజించిన పిదప కొన్ని హితమైన (ఆరోగ్య రూపమయిన) ఫలితమును కొన్ని అహితమైన (అనారోగ్యరూపమైన)ఫలితమును కల్గించును.

ఈ ఆహారము నాల్గురకములుగా నుండును. త్రాగదగిన ద్రవరూపమయినది మృదువుగానుండి భుజింపదగినది కొంచెము గట్టిగానుండి నమిలి తినదగినది నాలుకతో చప్పరించి తినదగినది మరియు యీ ఆహారము - తీపి, పులుపు ఉప్పు కారము చేదు, వగరు అనిరసభేదములచేత ఆరు విధములుగ నుండును

గురు, లఘు, శీత, ఉష్ణ,స్నిగ్ధ రూక్ష మన్ద తీక్ష్ణ స్థిర, సర, మృదు కఠిన,విశద, పిచ్ఛిల శ్లక్ష్ణ ఖర, సూక్ష్మ, స్థూల, సాంద్ర, ద్రవ అని నుండును. ఇంకనూ యిట్టి ఆహారపదార్థములు పక్వము చేయు సంస్కారములనుబట్టి అనేక రీతులుగా నుండును.

ఆయుర్వేద శాస్త్రము ననుసరించి సర్వ ద్రవ్యము పాంచభౌతికము. "సర్వం ద్రవ్యం పాంచభౌతికం" శరీరము పాంచభౌతికమయినదే. మనము గైకొను ద్రవ్యాదులు ఏభూత గుణమును కల్గియుండునో ఆ భూతగుణములనే శరీరమున పెంపొందించును. అవి హితములగునాహారపదార్థములై నవృద్ధిని,అహితములైన వ్యాధిని కలిగించును,

"హితాహారోపయోగఏక
ఏవపురుషవృద్ధి కరోభవతి
అహితాహారోపయోగఃపునః
వ్యాధినిమిత్త ఇతి.

అని చరకమునందుల్లేఖించబడియున్నది.

పార్థివద్రవ్యములు: స్థూలము, సారము, సాంద్రము, మందము, స్థిరము, గురువు, కఠినము, యీ గుణములును, ఎక్కువగంధమును తక్కువ కషాయరసమును,తరచు మధురముగ గల్గినది పార్థివద్రవ్యము. ఈపార్థివ ద్రవ్యము స్థిరత్వమును, బలమును, బరువును, కఠినత్వమును, వృద్ధిని కలుగజేయును.

ఆప్య ద్రవ్యములు : శీత, స్థిమిత, స్నిగ్ధ, మన్ద, గురు, సర, సాన్ద్ర,మృదు, పిచ్ఛిలములను గుణములు కల్గి, అధికముగా రస స్వరూపమై,కొంచెముగా కషాయము, ఆమ్లము, లవణము ఈ రసములుకల్గి మధురరస మధికముగా గల్గినది - ఆప్య ద్రవ్యము. ఈ ఆప్య ద్రవ్యము స్నేహనము, సంతోషము,క్లేదనము, బంధనము, విష్యంధనము వీనిని జేయును.

తైజసద్రవ్యములు : ఉష్ణము, తీక్ష్ణము, సూక్ష్మము, రూక్షము, ఖరము, లఘువు, విశదము, ఈ గుణములు గలిగి అధికముగా రూపమున్నూ, ఆమ్లలవణరసములు కొంచెముగనూ- కటురస మధికముగానూ గలిగి - అన్నాదుల పచనము చేయుట, శరీరాదుల తపింపజేయుట ప్రకాశనము, తేజస్సు, కాంతి వీటిని

వాయవ్యద్రవ్యములు: సూక్ష్మము, రూక్షము ఖరము, లఘువు, విశదము, యీ గుణములును- ఎక్కువస్పర్శయు కొంచెముతిక్త రసము, యెక్కువగా కషాయరసము గలది వాయవ్య ద్రవ్యము. అది విశదత్వము లాఘవము, శుక్రవృద్ధిని జేయలేకపోవుట, ఎక్కువగా కృషింపజేయుట, విచారణము వీనిని చేయును.

ఆకాశీయ ద్రవ్యములు: శ్లక్ష్ణము, సూక్ష్మము, మృదువు, వ్యసాయి (శరీరమంతటా వ్యాపించుట) విశదము, వివిక్తము (వేరగుట) యీ గుణములు, అధికమగుశబ్దము కలిగినది ఆకాశీయ ద్రవ్యము. దీనియందు మధురాదిరసములు తెలియబడవు. ఈ ద్రవ్యములు మృదుత్వము, శుషిరత్వము, లఘుత్వము వీటిని జేయును.

షడ్రసములు - వాటి గుణములు

ప్రాయికముగా షడ్రసములందుననూ పంచ భూతగుణములు చేరియున్ననూ కొన్ని కొన్ని రసములందు కొన్ని కొన్ని భూతముల గుణములు ప్రత్యేకించి యెక్కుడుగా నుండును.

మధురరసము జలభూత గుణవిశేషము కల్గియుండును.

పృథ్వియొక్కయు, అగ్నియొక్కయు గుణము లధికమగానుండుటచే ఆమ్లరసము పుట్టును.

ఉదకము యొక్కయు, అగ్నియొక్కయు గుణము లధికమగా నుండుటచే లవణరసము జనించును.

వాయువు యొక్కయు అగ్ని యొక్కయు గుణము లధికముగా నుండుటచే కటురసము పుట్టును.

వాయువుయొక్కయు, ఆకాశముయొక్కయు గుణము లధికముగా నుండుటచే తిక్తరసము పుట్టును.

వాయువు యొక్కయు, పృథివియొక్కయు గుణము లధికముగా నుండుటచే కషాయ రసము పుట్టును.

మధురరసగుణములు: మధురరసమును చేయుటవలన శరీరమందలి రసము, రక్తము, మాంసము, మేదస్సు, అస్థి, మజ్జ, శుక్రము, అను సప్తధాతువులను, ఓజస్సునువృద్ధిజేయును. ఆయువును పద్ధిచేయును. మనస్సుతోకూడి సత్వక్చక్షుశ్శోత్ర జిహ్వా ఘ్రాణములను, షడింద్రియములకు ప్రసాదమును చేకూర్చును. శరీరమునకు బలమును, వర్ణమును కల్గించును. పిత్తమును, విషమును, వాతమును హరించును. దప్పిని శమింపజేయును. చర్మమునకు మేలును చేకూర్చును. వెంట్రుకలను పెంపొందించును. కంఠస్వరమునకు హితకరము. సంతోషమును కల్గించును. ఆత్మేంద్రియములకు తృప్తి నొందించును. శరీరమునకు పుష్టినిచ్చును. సంధిబంధాదులను అవయవములను ధృఢముగ జేయును. ధాతువులు క్షీణించినవారికి ధాతువుల వృద్ధినొందించును. ఉరఃక్షతము కలదానిని స్వస్థత కలిగించును. ముక్కుకు, నోటికి, కంఠమునకు, పెదవులకు నాలుకకు ఆహ్లాదమును కలిగించును. తాపమును, మూర్ఛను శమింపజేయును. స్నిగ్ధము-శీతము గురుత్వగుణములు కల్గియుండును, అయితే యిన్ని మంచి గుణములను కల్గించునదియే యైననూ మధురసమును అదేపనిగా విశేషముగా నుపయోగించినయెడ - శరీరమును స్థూలముగ జేయును. శరీర పటుత్వమును తగ్గించి మృదువుగా జేయును. పనులయందు అలసత్వమును కలుగజేయును. నిద్రనధికముగ దెచ్చిపెట్టును. శ్వాసము, కాసము, ప్రతిశ్యాయము (పీనస), అలసకము, శీతజ్వరము, అనాహము (కడుపుబ్బరం) నోటితీపి, వాంతి, సంజ్ఞానాశము, కంఠస్వరహాని, గళగండము, గండమాల, శ్లీపదము, (బోదకాలు), కంఠమునందు వాపు వస్తియందును, ధమనుల యందును, కుత్తుకయందును కఫమును జేర్చును. అభిష్యందము మున్నగు నేత్రరోగములు కఫజవ్యాధులు కల్గించును.

ఆమ్లరసగుణములు: పులుపురసము-ఆహార పదార్థములకు రుచిపుట్టించును. జఠరాగ్నిని దీపింపజేయును. (ఆకలి పుట్టించును. శరీరమునకు బలమునిచ్చును. పుష్టిని చేకూర్చును.

జేయును. బలమును వృద్ధిజేయును. హృదయమునకు తృప్తినిచ్చును. నోట నీరును స్రవింపజేయును. భుజింపబడిన ఆహారమును జీర్ణింపజేయును. ఆహారమునందు ప్రీతిని కల్గించును. వాతమును అనులోమముగ సంచరింపజేయును. ఇది లఘుత్వము, ఉష్ణంబును, స్నిగ్ధంబునను గుణములు కల్గియుండును.

ఇంతగా మేలును చేకూర్చే పులుపును ఒక్కదానినే అధికముగా నుపయోగించిన దంతముల పులియజేయును. కన్నుల మూయునట్లు చేయును. అధికంగా తృప్తినొందించి యెక్కసము కల్గజేయును. వెంట్రుకలను తరుగనిచ్చును. గడ్డకట్టిన కఫమును పలుచనగ జేయును. పైత్యమును వృద్ధి నొందించును. శరీరమునందలి రక్తమును చెరచును. మాంసమును దహింపజేయును. శరీరావయవముల శిథిలములుగ జేయును. ధాతువులు క్షీణించిన వారికి, ఉరఃక్షతము కల్గినవారికి, కృశించిన వారికి బలహీనులకు వాపును కల్గించును. గాయము తగులుట, దెబ్బలు తగులుట, జంతువులచే కరవబడుట, నిప్పుచే కాలుట, అవయవములు విరుగుట, వాపు సంధిబంధాదులు జారుట మూత్రముగా విషముగా గల్గిన కీటకముల మూత్రము శరీరముపై సోకుట, విషజంతువులు శరీరముపై ప్రాకులాడుట, కత్తి మున్నగు ఆయుధములచే ఛేదింపబడుట, శూలము మున్నగు ఆయుధములు గ్రుచ్చుకొనుట, శరీరమునం దొరిపిడి కల్గుట - వీటిని పచింపజేయును, కంఠమునందును, రొమ్మునందును, హృదయమునందును మంట బుట్టించును. ఆమ్లరసము అగ్నితత్వము కలిగినదిగాన ఈ లక్షణములను కల్గించునదియై యుండును.

(సశేషము)

పెరటి మందులు

శ్రీ గూడూరి నమశ్శివాయ

'నా నౌషధీభూతం జగత్ సర్వాం ' ఈ జగత్తులో ఔషధం కాని మూలిక లేదు అన్నారు- అగ్నివేశులు. ప్రపంచంలో వైద్యానికి పనికిరాని మూలిక లేదు అని దీనిభావం మన ప్రాచీనులు ఔషధముల గుణవీర్య విపాకములను ప్రభావములను క్షుణ్ణంగా తెలుసుకొని వుండెడివారు ఏవ్యాధి సంభవించినా, ఏ ప్రమాదానికి లోనైనా "ఫలానా మూలిక మన పెరట్లోవున్నది; దానిని యిలా ఉపయోగించండి. బాధ నివారణ మవుతుంది." అని ఖచ్చితంగా చెప్పేవారు. ఇలాటి విషయాలను ఆడవాళ్లే తెలుసుకొని ప్రయోగిస్తూండే వాళ్ళు

మన దొడ్లో వుండే మూలికలు, ఇంట్లోవుండే ఓషధీద్రవ్యాలు మనకెంతవరకు ఉపయోగించునదీ తెలుసుకొనడం చాలా మంచిది

మునగచెట్టు సాధారణంగా ప్రతి దొడ్డిలో నుంటుంది. మునగ తీక్ష్ణ గుణము కలిగి వేడిచేస్తుంది, రుచికరమూను. జఠరదీపనము చేస్తుంది. వ్రణదోషములను హరిస్తుంది. బెణుకు నొప్పులను, కవుకు దెబ్బలను నివారించుతుంది, వాతము, కఫము, ముఖరోగములను విద్రధిని హరిస్తుంది. సంజువ్యాధులు, దప్పిక, తాపమును నివారించుతుంది, విరేచనకారకము, ఆకుస్వరసము త్రాగిన శూలనొప్పులు పోతాయి. జంతువాతము పోగొట్టుతుంది. మునగ చిగుళ్ల రసం చెవిపోటును హరిస్తుంది. వేసిన కళ్ళజబ్బులను, నీరు కారుటనువెరుపులను పోగొట్టుతుంది. మునగచెక్క రసం పిల్లల చిన్నబిడ్డ నొప్పులను హరిస్తుంది. స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడటంలో మునగచెట్టు చాలా ప్రభావం కల్గినది. ముట్టుస్నానం చేసిన రోజున మునగాకుకూర వండుకు తింటే ముదితకు ఋతుసంబంధమైన వ్యాధులు సంక్రమించవు. సంతానంకూడా కల్గుతుంది అందుకునే అట్లతద్దినాడు కన్య చేత మునగచెట్టుకు పూజ చేయించే ఆచారం హిందూ కుటుంబాలలో కలదు. మునగకాయ వేసంగిలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆకాలంలో వాతహరంగా పనిచేస్తూ ఆకలిని కలిగిస్తుంది మునగపూవురసం మగవానికి మగసిరిని పెంపు చేస్తుంది.

మునగవలెనే మనకు బాగా ఉపయోగించేది- కాకరకూడా ఒకటి. కాకరచెట్టు ప్రతిదొడ్డిలోను దొరుకుతుంది కాకరకాయ రక్తదోషాన్ని హరిస్తుంది. మధుమేహములో కాకరకాయ బహుళ ప్రయోజనకారి. రెండు మూడు కాకరకాయలు తొక్కి- రసం తీసి ఆ రసం ప్రాతఃకాలంలో పరగడుపున త్రాగాలి ఇలా ఒక మండల కాలంచేస్తే డైబెటీసులో షుగరు హరిస్తుంది. మూత్రంలో మధువుపోవటం కట్టువడుతుంది పైత్యహారముకూడాను. కాకర త్రిదోషహరము అన్ని వ్యాధులలో పథ్యకరము. కాకర క్రిమిదోషాన్ని, పాండురోగాన్ని, రక్తహీనతను

థంలో కాకర ప్రశస్తమైంది. అందు కనే కవిచౌడప్పగారు అన్నారు.

"వేయారువగల కూరలు కాయ లనేకములు గలవు
అందులలో నాయకములురా బలు కాకర కాయలు"

అని. కాకరకాయలు నిత్యా అతిగా తింటే శుక్రబలిమిని సడలింపజేస్తుంది.

కాకరాకు రసం తాగితే కామిర్ల రోగం నయ మవుతుంది. కాకరాకు రసంలో పసుపువేసుక తాగితే మసూచీ జ్వరం కట్టుతుంది. మసూచీపుండ్లు నయమవుతాయి కాకరాకురసంలో కొద్దినిమ్మరసం కలిపి తాగిస్తే మసూచీ వ్యాధిరాకుండా కాపాడుతుంది. కాకరాకురసం కంటిలో వేస్తే దోషజ్వరం ప్రమాదమునుండి రక్షణ లభిస్తుంది.

సహదేవి అనేమూలిక ప్రతిదొడ్డిలోను మదుళ్ళమీద మొలుస్తుంది. సహదేవి ఆకుచూర్ణం నేయి కలిపితింటే ఎటువంటి అజీర్ణమునైనా హరిస్తుంది. బాగా ఆకలికలుగుతుంది. ఆహిక జ్వరాలను నివర్తిస్తుంది. ఆహిక జ్వరమంటే నాల్గురోజులకొలకసారి, మూడు రోజులకొకసారి, రోజువిడిచి రోజు వస్తుంది. వానిలో సహదేవి బాగా పనిచేస్తుంది. ముచ్చిలిగుంటనుంచి వెన్ను మీదుగా ఆసనంవరకు సహదేవి పసరు యింకరాయాలి. జ్వరం వెంటనే తగ్గుతుంది. ఇక రాదుకూడాను సహదేవివేరు పుష్యమీనక్షత్రమున తీసినది తలకు కట్టితే చాతుర్థికజ్వరం నయమవుతుందని "జ్వరంహంతిశిరోబద్ధా సహదేవి జటాయథా" అని శార్ఙ్గధరా జ్వరమునుగురించి నీలకంఠకొట్టూరు బసవరాజుగారు ఒకవిచిత్రమైనయోగం చెప్పారు.

ఇలతమ్ముల మున నల్లుల
విలసితముగ వరుసతోడ విడియము సేయన్
జలిబెట్టు త్రిరాత్రజ్వర
కుల మెల్లను ద్రుంచు టరుదెగో పతిగమనా.

అన్నారు నల్లులను తాంబూలంలో వేసుకుంటే త్రిరాత్రజ్వరం హరిస్తుంది. తేలుకుట్టినప్పుడు తాంబూలం వేసుకుంటే తేలువిషం హరిస్తుంది.

"మక్షికాగుడ సంయుక్తా జ్వరా మన్థరకే హితా"
భ్రమమోహాతి సారాంశ్చనాశయత్య విలమ్బితః"

ఈగను బెల్లమునందు పొదిపి మ్రింగించిన యెడల భ్రమ, మోహము, అతిసారము లక్షణములుగల మన్థరజ్వరము నసించునని యోగరత్నాకర కారుడు చెప్పాడు.

ద్రోణపుష్పి అనే తుమ్మిచెట్టు ఒకటి వుంది. ఇది శివప్రీతి ద్రవ్యం అని అంటారు. కాళహస్తిలో ఎక్కువగా యీ పూలనే స్వామిపూజకు ఉపయోగిస్తారు. ఈతుమ్మిచెట్టు చాలా ప్రభావం కలది. విషహారం. ఈ తుమ్మి సమూలంగా తెచ్చి సమముగా తులసి ఆకు వేసి రెండు మిరియాలు కలిపి నూరి మాత్రచేసి తింటే విషమజ్వరాలు, శీత జ్వరాలు, మలేరియా జ్వరాలు కట్టుకుంటాయి. కామిలా, మేహజ్వరం పక్షవాతం హరిస్తుంది.

పూలతో నిండారుతున్న.

మిరియాలు చేర్చి బాగా మర్దించి ఉంచుకొని దానిని కండ్లలో కలికము గాను, దానినే మంచినీళ్ళతో లోనికి సేవించిన సర్పదష్టుడు వెంటనే లేచి కూచుంటాడు. విష దోషములలోను విషమజ్వరములు కామెల రోగము నందుకూడా యీ ఓషధి పెట్టినదిపేరు.

తుమ్మిలాగుననే ప్రొద్దు తిరుగుడు చెట్టుకూడా విషహర ద్రవ్యంగా ప్రఖ్యాతి గాంచింది. ఈ ప్రొద్దుతిరుగుడు సూర్య దేవునకు అంజలిచేస్తూంటుంది. ఈ ఆకు నలిపి వాసనచూస్తే తేలుబాధ హరిస్తుంది ఈ ప్రొద్దు తిరుగుడు సమూలంగా సేవిస్తే కుష్టుకూడా పోతుంది ఈ ప్రొద్దుతిరుగుడు గింజలు చూర్ణము చేసి దానిని ఉదయం సాయంత్రం ఒక చంచా చూర్ణము మంచి నీళ్ళతో సేవించిన కంటి శుక్లాలు (క్యాటరాక్టు) హరించుకపోతుంది. ఆపరేషను అక్కర లేదు. సూర్యోపాసన చేస్తే ఏవ్యాధులు హారిస్తాయో ఆ యీ రోగాలన్నీ ప్రొద్దుతిరుగుడు ఓషధిని సేవిస్తే నిమ్మళిస్తాయి.

నేలఉశిరిక అని ఒక చిన్న మూలికను అందరూ ఎరిగే వుంటారు. దానిని సమూలంగా నాల్గు మిరియాలు వేసి తొక్కి కుంకుడుగాయంత ఉండలు చేసి తిని కాస్త బియ్యపు కడుగు తాగాలి. అలాచేస్తే ఆడవాళ్ళ బట్టవిడుపు వ్యాధులు కుదురుతాయి.

పిల్లలకు నేడు లివరు జబ్బులు చాలా విపరీతముగా వస్తున్నాయి అలాటి వాళ్ళకు నీటిగొబ్బి ఆకురసం తాగిస్తే ఎటువంటి స్థితిలోనున్న లివరుజబ్బు

బంతిచెట్టుకూడా చాలా ఉపయోగంగల మూలిక. పూలతోనున్న బంతి మొక్కను రసంతీసి ఆరసంలో నువ్వుల నూనె కలిపి కాచి ఉంచుకొనవలయును దానిని టింక్చర్ అయొడిన్ వలె ఉపయోగించుకోవచ్చును. నరుకులు బెణుకులు కురుపులు గజ్జి నయమౌతాయి. ఇంటి గుమ్మాలముందు తోరణాలు గట్టుకునే బంతిపూలు కషాయం కాచి త్రాగితే ఆడవాళ్ళ ఋతుస్రావాలు కట్టిపోతాయి. పురుషుల శగవ్యాధులలోను మంచిది.

చాలామంది శూలనొప్పివచ్చిందని గిలగిలా తన్నుకుంటూంటారు. శూలనొప్పులకు పాతసున్నపుతేటపంచదారకలిపి తాగితే ఎటువంటి శూలఅయినా లేకఋతుశూల అయినాతగ్గిపోతుంది అందులో కాస్తపసుపు వేసి తాగితే ఎంతటితీవ్రమయిన జలుబుజ్వరమయినాహరిస్తుంది

చాలామందికి రక్తస్రావం హఠాత్తుగా కల్గుతుంది. గొంతు వెంటగాని ముక్కువెంట గాని విరేచనము వెంట గాని కలుగవచ్చు అట్టివాళ్ళకామంచి ఆకురసం మేకపాలలో వేసి శర్కర తేనె కలిపి తాగితే వెంటనే కట్టువడుతుంది. లేక కొబ్బరిపీచుబూడిద పంచదారలో కలిపితింటే కూడా రక్తస్రావాలు కట్టువడతాయి.

చాలామంది పళ్ళవెంట రక్తం కారుతోందని పళ్ళు కదుల్తున్నాయని చీము కారుతోందని పయోరియా వచ్చింది పళ్ళు పీకించుకోవాలని చెప్తూతారు. అటువంటి వాళ్ళు పొగడచెక్క

బడి పయోరియా పోతుంది. "వకుళస్యతు పుష్పాణి చర్వణార్థే ప్రయోజయేత్" అని శాస్త్రకారులు చెప్పారు గుంటకలగర రసం పుక్కిలిపట్టినా, ఆకుతో పళ్ళు తోముకొనినా పోటు, సలుపు చేత్తో తీసివేసినట్లు బాధ హరిస్తుంది. ఏ విధమైన వాతరోగములోనయినా బాగా గుణమిస్తుంది. గుంటగలగర. గుంటగలగర చిగుళ్ళు, రససిందూరం, రెండు మిరియాలు కలిపి నూరి మాత్రచేసి పిల్లలకు తినిపించి గుమ్మపాలు తాగిస్తారు ఎరుగరూ. ఇలా చేస్తే నిక్కాకతో ముసలితొడుగులా ఎండిపోయే పిల్లలు చువ్వలాగా ఎదిగి కళకళలాడుతారు.

మనము తినే ఆహారాలలో కంద చాలామంచిది. దురదకంద తింటూంటే మూలవ్యాధి రాదు. యపెండిసైటీసు ఆపరేషనుఅక్కర్లేదు. బాగా ఆకలి అయి సుఖవిరేచనం కలుగుతుంది. ఇలాగే యాలకులు మోడిచూర్ణంచేసి తేనెతో తింటే గుండెజబ్బుల భయం లేదు. నీరసపడి ఆగిపోతుందనే భయం గుండెకు కలుగనీయదు గుండె నొప్పులలో జీలకర్ర రసం తాగితే నొప్పి వెంటనే సర్దుకుంటుంది.

ఇలాగే మన పెరటిలోని మూలికలు మన ఆరోగ్య భాగ్యానికి పెన్నిధి లాంటివి. వాటిని ఉపయోగించుకొనే తీరు తెలుసుకొంటే అవి మన ఆరోగ్యాన్ని తీర్చి దిద్దుతాయి.

సంస్కృత బాలశిక్ష

శ్రీ జి. సత్యనారాయణ, ఎం. ఏ.

3

ఈ క్రింది ఉకారాన్తమగు 'మధు' అనెడి నపుంసక లింగ శబ్దమును పరిశీలించి దానిని బట్టి 'అమ్బు, జత్రు శ్మశ్రు' శబ్దముల ఆయా విభక్తి వచన రూపములను సాధించునది. 'మధు' శబ్దమునకు 'తేనె' యని యర్థము.

మధు – మధునీ – మధూని
హే మధో / హే మధు } – హే మధునీ – హే మధూని
మధు – మధునీ – మధూని
మధునా – మధుభ్యామ్ – మధుభిః
మధునే – మధుభ్యామ్ – మధుభ్యః
మధునః – మధుభ్యామ్ – మధుభ్యః
మధునః – మధునోః – మధూనామ్.
మధుని – మధునోః – మధుషు॥

ఈ క్రింది ఋకారాన్తమగు 'ధాతృ' శబ్దమును పరిశీలించి దాని ననుసరించి పట్టికలోని యా యా శబ్దముల విభక్తి-వచనరూపములను సాధించునది ధాతృ శబ్దమునకు బ్రహ్మయని యర్థము.

ధాతా – ధాతారౌ – ధాతారః
హే ధాతః – హే ధాతారౌ – హే ధాతారః
ధాతారమ్ – ధాతారౌ – ధాతౄన్
ధాత్రా – ధాతృభ్యామ్ – ధాతృభిః
ధాత్రే – ధాతృభ్యామ్ – ధాతృభ్యః
ధాతుః – ధాతృభ్యామ్ – ధాతృభ్యః
ధాతుః – ధాత్రోః – ధాతౄణామ్
ధాతరి – ధాత్రోః – ధాతృషు.

విధాతృ = సృష్టికర్త
కర్తృ = చేయువాడు, చేయునది
గన్తృ = వెళ్ళువాడు; వెళ్ళునది
యన్తృ = నియమించువాడు; నియమించునది
రక్షితృ = రక్షించువాడు; రక్షించునది
హర్తృ = హరించువాడు, హరించునది
అనుమన్తృ = అంగీకరించువాడు, అంగీకరించునది

'కర్తృ' శబ్దమునుండి అనుమన్తృ శబ్దమువరకును గల శబ్దములు నపుంసక లింగములో గూడ నుండును. కాని పై శబ్దమునకు సంబంధించిన యా యా విభక్తి – వచన రూపములు నపుంసక లింగమున విశేషముగ భేదించును. ఈ క్రింది కర్తృ శబ్దమును నపుంసక లింగమున పరిశీలించి తదితర శబ్దముల వేర్వేరు విభక్తి – వచన రూపములను సాధించుకొనునది.

కర్తృ – కర్తృణీ – కర్తౄణి
హే కర్తృ / హే కర్తః } – హే కర్తృణీ – హే కర్తౄణి
కర్తృ – కర్తృణీ – కర్తౄణి
కర్తృణా / కర్త్రా } కర్తృభ్యామ్ – కర్తృభిః
కర్తృణే / కర్త్రే } కర్తృభ్యామ్ – కర్తృభ్యః
కర్తృణః / కర్తుః } కర్తృభ్యామ్ – కర్తృభ్యః
కర్తృణః / కర్తుః } కర్తృణోః / కర్త్రోః } కర్తౄణామ్
కర్తృణి / కర్తరి } కర్తృణోః / కర్త్రోః } – కర్తృషు

కర్తృ శబ్దమును పరిశీలించునపుడా శబ్దమునకు సంబోధన ప్రథమా విభక్తికిని, తృతీయా, చతుర్థీ, పంచమీ విభక్తులకు సంబంధించిన యేకవచనములకును, షష్ఠీ, సప్తమీ విభక్తులకు జెందిన యేకవచన ద్వివచనములకును,

రెండేసి రూపము లుండుట గమనింపదగిన విషయము. ఉదాహరణమునకు: కర్తృశబ్దమున, సంబోధన ప్రథమా విభక్తికి సంబంధించిన యేకవచన రూపములు రెండు. అవి హే కర్తృ, హే కర్తః. అట్లే రెండు రూపములు గల తదితర విభక్తులకు సంబంధించిన వచనములను పరిశీలింప నగును.

ఈ క్రింది ఋకారాన్తమగు 'పితృ' అనెడి పుంలింగ శబ్దమును పరిశీలించి జామాతృ, భ్రాతృ శబ్దముల ఆ యా విభక్తి - వచన రూపములను సమన్వయించుకొనునది. పితృ శబ్దమునకు తండ్రి యని యర్థము.

పితా - పితరౌ - పితరః
హే పితః - హే పితరౌ - హేపితరః
పితరమ్ - పితరౌ - పితౄన్

మిగిలిన యన్ని విభక్తి-వచన రూపములను ధాతృ శబ్దమును బట్టియే యన్వయించు కొనవలెను. ఈ క్రింది ఋకారాన్తమగు 'మాతృ' అనెడి స్త్రీలింగ శబ్దమును పరిశీలించి 'యాతృ, దుహితృ, ననాన్దృ' అను తదితర శబ్దముల యా యా విభక్తి- వచన రూపములను సాధించుకొనునది.

మాతా - మాతరౌ - మాతరః
హే మాతః - హే మాతరౌ - హే మాతరః
మాతరమ్ - మాతరౌ - మాతౄః

మిగిలిన యన్ని విభక్తి-వచన రూపములను ధాతృ శబ్దమును బట్టి సమన్వయించుకొనవలెను.

ఈ క్రింది ఆకారాన్తమగు 'రమా' యనెడి స్త్రీలింగ శబ్దమును పరిశీలించి పట్టికలోనున్న యితరములగు శబ్దముల యా యా విభక్తి - వచనరూపముల సాధించునది. రమా శబ్దమునకు లక్ష్మి యని యర్థము.

రమా - రమే - రమాః
హేరమే - హేరమే - హేరమాః
రమామ్ - రమే - రమాః
రమయా - రమాభ్యామ్ - రమాభిః
రమాయై - రమాభ్యామ్ - రమాభ్యః
రమాయాః - రమాభ్యామ్ - రమాభ్యః
రమాయాః - రమయోః - రమాణామ్
రమాయామ్ - రమయోః - రమాసు.

1 అమ్బికా = పార్వతి
2. దుర్గా = ,,
2. సీతా = శ్రీరాముని భార్య
4 భామా = స్త్రీ
5 పద్మా = లక్ష్మి
6. కమలా = లక్ష్మి
7. ఇందిరా = లక్ష్మి
8. కన్యకా = కన్య

ఈ క్రింది ఈకారాన్తమగు 'గౌరీ శబ్దమును బరిశీలించి పట్టికలోని యా యా శబ్దముల విభక్తి - వచనరూపములను సాధించునది. గౌరీ శబ్దమునకు పార్వతి యని యర్థము.

గౌరీ - గౌర్యౌ - గౌర్యః
హేగౌరి - హేగౌర్యౌ - హేగౌర్యః
గౌరీమ్ - గౌర్యౌ - గౌరీః
గౌర్యా - గౌరీభ్యామ్ - గౌరీభిః
గౌర్యై - గౌరీభ్యామ్ - గౌరీభ్యః
గౌర్యాః - గౌరీభ్యామ్ - గౌరీభ్యః
గౌర్యాః - గౌర్యోః - గౌరీణామ్
గౌర్యామ్ - గౌర్యోః - గౌరీషు

వల్లీ = తీగ
పల్లీ = పల్లె
ఆభీరీ = గోపిక
నారీ = స్త్రీ
కౌమోదకీ = విష్ణుదేవుని గదాయుధము

ఈ క్రింది ఊకారాన్తమగు వధూ అనెడి స్త్రీలింగ శబ్దమును పరిశీలిం

పట్టికలోని శబ్దముల ఆ యా విభక్తి - వచనరూపములను సాధించునది. వధూ శబ్దమునకు 'కోడలు' అని యర్థము.

వధూః - వధ్వౌ - వధ్వః
హేవధు - హేవధ్వౌ - హేవధ్వః
వధూమ్ - వధ్వౌ - వధూః
వధ్వా - వధూభ్యామ్ - వధూభిః
వధ్వై - వధూభ్యామ్ - వధూభ్యః
వధ్వాః - వధూభ్యామ్ - వధూభ్యః
వధ్వాః - వధ్వోః - వధూనామ్
వధ్వామ్ - వధ్వోః - వధూషు
చమూ - సైన్యము
రమ్భోరూ - స్త్రీ
కణ్డూ - దురద

ఈ క్రింది ఓకారాన్తమగు 'గో' శబ్దమును పరిశీలించి దాని ననుసరించి సుద్యో, స్మృతో శబ్దముల యాయా విభక్తి - వచన రూపములను సాధింపనగును. గో శబ్దమునకు 'ఆవు' యని యర్థము.

గౌః - గావౌ - గావః
హేగౌః - హేగావౌ - హేగావః
గామ్ - గావౌ - గాః
గవా - గోభ్యామ్ - గోభిః
గవే - గోభ్యామ్ - గోభ్యః
గోః - గోభ్యామ్ - గోభ్యః
గోః - గవోః - గవామ్
గవి - గవోః - గోషు॥

ఇంతవరకును అజన్తశబ్దములు నిజాన్త్రమముగ నుదాహరింపబడినవి.

ఈ క్రింది చకారాన్తమగు 'జలముక్' శబ్దమును పరిశీలించి దాని ననుసరించి సువాక్, పయోముక్ అను శబ్దముల యా యా విభక్తి - వచన రూపములను సాధించునది.

జలముక్ - జలముచౌ - జలముచః
హేజలముక్ - హేజలముచౌ - హేజలముచః
జలముచమ్ - జలముచౌ - జలముచః
జలముచా - జలముగ్భ్యామ్ - జలముగ్భిః
జలముచే - జలముగ్భ్యామ్ - జలముగ్భ్యః
జలముచః - జలముగ్భ్యామ్ - జలముగ్భ్యః
జలముచః - జలముచోః - జలముచామ్
జలముచి - జలముచోః - జలముక్షు

ఈ క్రింది జకారాన్తమగు భిషక్ఛబ్దమును పరిశీలించి తనుత్యక్, ఋత్విక్, శబ్దముల యాయా విభక్తి-వచన రూపములను సాధింపనగును.

భిషక్ - భిషజౌ - భిషజః
హేభిషక్ - హేభిషజౌ - హేభిషజః
భిషజమ్ - భిషజౌ - భిషజః
భిషజా - భిషగ్భ్యామ్ - భిషగ్భిః
భిషజే - భిషగ్భ్యామ్ - భిషగ్భ్యః
భిషజః - భిషగ్భ్యామ్ - భిషగ్భ్యః
భిషజః - భిషజోః - భిషజామ్
భిషజి - భిషజోః - భిషక్షు

ఈ క్రింది తకారాన్తమగు 'మరుత్' అను పుంలింగ శబ్దమును పరిశీలించి దాని ననుసరించి పట్టికలో నున్న శబ్దముల యా యా విభక్తి - వచన రూపములను సాధించునది. మరుచ్ఛబ్దమునకు వాయువని యర్థము.

మరుత్ - మరుతౌ - మరుతః
హేమరుత్ - హేమరుతౌ - హేమరుతః
మరుతమ్ - మరుతౌ - మరుతః
మరుతా - మరుద్భ్యామ్ - మరుద్భిః
మరుతే - మరుద్భ్యామ్ - మరుద్భ్యః
మరుతః - మరుద్భ్యామ్ - మరుద్భ్యః
మరుతః - మరుతోః - మరుతామ్
మరుతి - మరుతోః - మరుత్సు.

1 ఇన్ద్రజిత్ = రావణునితమ్ముడిన్ద్రజిత్తు, ఇంద్రుని జయించినవాడు.
2 జాగ్రత్ = మేల్కొనుచున్న
3 చకాసత్ = ప్రకాశించుచున్న
4 దధత్ = ధరించుచున్న
5 దదత్ = ఇచ్చుచున్న
6 జుహ్వత్ = హోమము చేయుచున్న

ఈ క్రింది తకారాన్తమగు 'పచత్' అను పుంలింగ శబ్దమును పరిశీలించి దాని ననుసరించి పట్టికలోని యితర శబ్దముల యా యా విభక్తి-వచనరూపములను సాధించునది. పచచ్ఛబ్దమునకు వంట వాడని యర్థము.

పచన్ – పచన్తౌ – పచన్తః
హే పచన్ – హే పచన్తౌ – హే పచన్తః।
పచన్తమ్ – పచన్తౌ – పచతః।

మిగిలిన శబ్దములకు సంబంధించిన విభక్తి- వచనరూపములను మరుచ్ఛబ్దమును బట్టి సమన్వయించు కొనవలెను.

అదత్ – తినువాడు
కుర్వత్ – చేయువాడు
కారయత్ - చేయించువాడు
చికీర్షత్ – చేయగోరువాడు
రున్ధత్ – అడ్డగించువాడు

అదత్ మొదలగు శబ్దములు నపుంసక లింగములో గూడ నుండును.

అదత్ – అదతీ – అదన్తి
అదత్ - అదతీ - అదన్తి,

మిగిలిన శబ్దములకు సంబంధించిన విభక్తి- వచనరూపముల పుంలింగ శబ్దములకు సంబంధించిన విభక్తి వచన రూపములవలెనేయుండును.

ఈ క్రింది తకారాన్తమగు మహచ్ఛబ్దమును పరిశీలించునది.

మహాన్ - మహాన్తౌ - మహాన్తః
హే మహన్ - హే మహాన్తౌ - హే మహాన్తః
మహాన్తమ్ - మహాన్తౌ - మహతః

మిగిలిన శబ్దములకు సంబంధించిన యాయా విభక్తి – వచన రూపములను మరుచ్ఛబ్దము ననుసరించి సాధించుకొనునది.

ఈ క్రింది తకారాన్తమగు 'మహత్' అనెడి నపుంసకలింగ శబ్దమును పరిశీలించునది. మహచ్ఛబ్దమునకు గొప్పదని యర్థము.

మహత్ - మహతీ - మహాన్తి

ఇట్లే ద్వితీయా విభక్తికి సంబంధించిన వచన రూపముల నుండును. మిగిలిన శబ్దమంతయు 'మహత్' అనెడి పుంలింగ శబ్దమునకు సంబంధించిన విభక్తి-వచనరూపముల వలెనుండును.

ఈ క్రింది దకారాన్తమగు 'దివిషత్' అనెడి పుంలింగశబ్దమును పరిశీలించి దాని ననుసరించి శాస్త్రజిత్, క్రవ్యాత్ అనుశబ్దముల యాయావిభక్తి- వచన రూపములను సమన్వయించు కొనునది. దివిషచ్ఛబ్దమునకు దేవతయని యర్థము.

దివిషత్ - దివిషదౌ - దివిషదః
హే దివిషత్ -హే దివిషదౌ - హే దివిషదః
దివిషదమ్ - దివిషదౌ - దివిషదః
దివిషదా - దివిషద్భ్యామ్ - దివిషద్భిః
దివిషదే - దివిషద్భ్యామ్ - దివిషద్భ్యః
దివిషదః - దివిషద్భ్యామ్ - దివిషద్భ్యః
దివిషదః - దివిషదోః - దివిషదామ్
దివిషది - దివిషదోః - దివిషత్సు

వెనుకటి పాఠమున వారి శబ్దమునకు ద్వితీయా – విభక్తికి సంబంధించిన యేకవచన రూపము 'వారీ'కి బదులు వారి యని సరిజేసికొనవలెను. ధేను శబ్దమున ప్రథమా విభక్తికి సంబంధించిన యేకవచన రూపము ధేనుకు బదులు 'ధేనుః' అని సరిజేసికొనవలెను. నపుంసక లింగ శబ్దములను ఆయా విభక్తులకును అనుటకు బదులు నపుంసక లింగ శబ్దముల యాయా అని సరిజేసికొనవలెను. శబ్దముల విభక్తి – వచన ప్రత్యయములలో పూర్ణబిందువునకు బదులు 'మ్' అని యుండవలెను.

మాసఫలములు

(ఆగస్టు 1958)

శ్రీ 'బుధ'

[ఏ సంవత్సరమున పుట్టినను, పుట్టిన తేది గల రాశిని బట్టి, ఫలము తెలిసికొనునది.]

గ్రహస్థితి : సింహ, కన్యలలో రవి కన్యా, సింహములలో బుధుడు. కర్కాటక సింహములలో శుక్రుడు, వృషభమందు కుజుడు, తుల యందు గురు రాహువులు. ధనుస్సున శని, మేష, కేతులు. సింహమున ఇంద్రుడు. వృశ్చికమున వరుణుడు గ్రహగతులు. 9 వ తేదీన. బుధవక్రత. 24 వ తేదీన శని వక్రత్యాగము.

దేశారిష్టయోగములు. అగ్నిగోళ నక్షత్రములగు భరణి, కృత్తికలందు కుజగతి; ఇట్టి కుజునితో శనికి షష్టాష్టకము ఇది దేశమునకు మిగుల అరిష్టదాయకము. ప్రజలలో రోగ, యుద్ధ భయములు. ఈనెల మొదటి వారములో సింహరాశియందున్న ఇంద్రునితో, రవి యుతిచే పంచభూతశక్తులు విపరీత పరిణామముజెందును. తుపానులు, భూకంపములు మొదలగు ఉత్పాతములు. ప్రజలు చిత్ర విచిత్రములైన దుస్సంఘటనలకు పాలగుదురు. ద్రవ్యమారకము స్తంభించును. ధరలు పెరుగును. కఱవు కాటకము లేర్పడును.

14, 15, 16 తేదీలలో, రవి, శుక్ర, చంద్ర, ఇంద్రుల కేకరాశి స్థితి. విపరీతవర్షములు – తుపానులు. నదీనదములు పొంగి, భూమి జలమయ మగు సూచనలు.

మేషము

మార్చి 21 నుంచి ఏప్రిల్ 20 వరకు

గ్రహస్థితి అనుకూలము. కుజుడు జన్మరాశిని వదలినందున, స్థితిగతులు స్థిమితపడును. శత్రు రోగ, ఋణ బాధలనుండి విముక్తి. నూతన కార్యములలో పాల్గొందురు. యత్నకార్యము లన్నియు నిర్విఘ్నముగా కొనసాగగలవు. బుద్ధి బలముతో సాధించగల పరిశోధనలందు జయము. తంతి, తపాలా, మిలిటరి, ఇంజనీరింగు శాఖలలోపని చేయువారు, పై అధికారుల మన్ననలకు పాత్రులగుదురు. చతుర్థ, పంచమ స్థానములలో శుక్రస్థితివలన కుటుంబ, సాంఘిక, విషయములు సుఖమునిచ్చును. నూతన, గృహనిర్మాణ విషయమై లేక శుభకార్యముల గూర్చిన ప్రయత్నములు అనుకూలించును. గొప్పవారితో స్నేహము కలుగును. పారిశ్రామిక రాజకీయ రంగములలో పనిచేయువారికి మాత్రము కొన్ని ఆటంకములు కలుగును. వ్యాపారస్థులకు నెలాఖరులో మంచి లాభము. ఆదాయమునకు మించిన వ్యయము గుచుండును. సంతతికి అనారోగ్యము 23 తేది తరువాత ప్రయాణములు తగవు.

వృషభము

ఏప్రిల్ 21 – మే 22

ఆత్మకారక రాశియందు అంగారక స్థితి మంచిదికాదు. స్వాభావికముగా సహనశక్తి సన్నగిల్లుతుంది. కోపావేశములు, పట్టుదలలు పెరుగును. కఠిన సమస్య లనేకము ఎదుర్కొన వలసివచ్చును. అనారోగ్యము, యత్నకార్యములలో ఆటంకములు కష్టములకు లొంగక ధైర్యముతో ఎదుర్కొన గలరు. చతుర్థ రవియును మంచివాడు కాడు. కుటుంబ, సామాజిక విషయములు సుఖము నివ్వవు. తనవారే తనకు శత్రువు లగుదురు మాతా, పితరులకు గండకాలము. పంచమ స్థానములో, బుధ వక్రస్థితి, మీ ఆలోచనలలో కార్యకలాపములలో, అనేక పొరపాట్లు జరుగ గలవు. షష్టాష్టమ ములలో గురు శనులుండి రాజ్యభావమును చూచుచుండుటచే, వ్యవహారము లన్నియు అనేక చిక్కులతో సాగిపోవుచుండును.

మిథునము

మే 23 – జూన్ 21

విక్రమ స్థానములో రవి, వ్యయమందు కుజుడు, ఈ రెండు మహా శక్తివంతములైన గ్రహాలు. రవి సత్ఫలితమును కుజుడు దుష్ఫలితమును ఇవ్వవలె. మిశ్రమ ఫలితము. అంగారక

వ్యయస్థితివలన ఆర్థిక ఇబ్బంది. ఋణబాధ, అనారోగ్యము, అసౌఖ్యము. కళత్ర అనారోగ్యము. తఱచుగా ప్రయాణములు. ఆకస్మిక ప్రమాదములు. కాని, విక్రమ స్థానములో నున్న రవికి గురుదృష్టి యుండుటచే పై దుష్ఫలితముల నెదుర్కొన గలరు. యత్నకార్య సాఫల్యము. ధనలాభము. ఉన్నతాధికారులతో, సత్పురుషులతో స్నేహము. 15వ తేది పిమ్మట ఇట్టివారితో కాగల పనులు నెరవేరును. సాంఘిక బాధ్యతలు ఎక్కువగును, వీటిని గురించి స్వప్రయోజనాన్ని చెడగొట్టుకొనవద్దు. మీ ప్రయత్నములన్ని 23 వ తేది లోపుగనే ముగించుట మంచిది.

కర్కాటకము

జూన్ 22 – జులై 22

చతుర్థ లాభాధిపతియైన శుక్రుడు, మీ రాశియం దుదయించు చుండుట, లాభస్థానములో కుజు డుండుట కొన్ని సత్ఫలితము లివ్వగలవు. గృహనిర్మాణము లేక వివాహాదిశుభకార్య నిర్వహణకై ప్రయత్నములు. ముఖ్యులగు వారితో పేచీ, నూతన వస్తు, వాహనము లేర్పడుట తథ్యము. కథలు వ్రాయువారికి, సినిమా రంగములో పనిచేయు ప్రతివారికిని మంచి కాలము. వ్యాపారస్థులు మంచి లాభములను గడింతురు. రాజకీయములలో తిరుగువారి ప్రయత్నములు ఫలించక పోగా కష్ట నష్టముల పాలగుదురు. కుటుంబ స్థానములోనున్న రవివలన, కళత్రము లేక సంతతికి అనారోగ్యము. శత్రుస్థానములోనున్న శని వలన చిక్కులు, రహస్య శత్రుత్వము.

సింహము

జులై 23 ఆగస్టు 22

మీ ఆత్మకారకుడైన రవి స్వక్షేత్రగతుడైనందున, కొన్ని సత్ఫలితములు. ముఖ్యముగా ఉద్యోగాధికారములలో ఆధిక్యత. యత్నకార్య జయము. సంఘము గుర్తించి గౌరవిస్తుంది. సంగీత, సాహిత్య చిత్రకళలో పరిశ్రమ చేయు వారికిది మంచికాలము. శత్రువ్యవహార జయము. వర్తక, వ్యాపారములకై నూతన మార్గము లవలంబించుట. ఇతర పట్టణ నివాసము. గృహసౌఖ్యము. శుభ సంబంధముగా ఖర్చు. ధనస్థానములో బుధ వక్రత్వముచే, రావలసిన ధనము తరుణమున రాక ఇబ్బంది. కాని దానధర్మములు తప్పవు. నూతన ప్రయత్నముల చేయుటకు 15వ తేది పిమ్మట మంచిది. ఈ రాశిలో జన్మించిన కొంతమందికి జ్ఞాతుల ఆస్తి సంక్రమించే యోగము, స్థిరవసతులకై ప్రయత్నము.

కన్య

ఆగస్టు 23 – సెప్టెంబరు 22

మీ గ్రహస్థితి ఈ నెలలో మిగుల ప్రతికూలము. జన్మరాశియందు బుధవక్రము, వ్యయమందు రవి స్థితి, మిగుల చెడ్డవి. తప్పనిసరిగా వ్యాపారాది కృషులు నడుపుకొనవలసి వచ్చును. ఆర్థికముగా మేలు చేకూరదు. 15 వ తేది పిమ్మట ఆర్థిక ఇబ్బందులు క్రమేపి తగ్గిపోగలవు. గురు, శను లిద్దరు మంచి స్థానములో నున్నందున-పై ఇబ్బందుల నన్నింటిని సర్దుకొని భంగము రానీయక గౌరవ ప్రతిష్టలను కాపాడుకొన జాలుదురు.

తుల

సెప్టెంబరు 23 – అక్టోబరు 22

జన్మాష్టమములలో గురు, కుజులున్నప్పటికిని దశమైకాదశ రవి శుక్రులవలన ఎక్కువగా సత్ఫలితములనే పొందగలరు. విజ్ఞానాత్మక కృషి ఫలించి ఆదాయాన్ని చేకూర్చును. గొప్పవారి ప్రాపకము. మిత్రసహాయం. సాంఘికగౌరవము, ఈ రాశిలో జన్మించిన ప్రతివారికిని, వారివారి వృత్తి ధర్మముల ననుసరించి మంచిఆదాయము. వ్యాపారస్థులకు మంచిలాభము. 22 వ తేదీలోగా చేసిన ప్రయత్నములన్నియు నెరవేరును. లాభకరమగు ప్రయాణములు. అష్టమ కుజస్థితిచే గృహమందు అసౌఖ్యము, అనారోగ్యము. ధనవ్యయము, కళత్ర అనారోగ్యము.

వృశ్చికము

అక్టోబరు 23 – నవంబరు 21

గురు శను లిద్దరు దుస్థానములలో స్థిరముగా నుండుట మంచిదికాదు. కాని రవి బుధ శుక్రులు మంచిస్థానములలో నుండుటచే కొన్ని సత్ఫలితములు. మీ శక్తిసామర్థ్యములను తెలుసుకొన గలుగుతారు. చైతన్య శక్తి ముందుకు వస్తుంది. ప్రయోజనాన్ని, ఫలితాన్ని ఇచ్చే పనులు కొన్ని చేయుదురు.

మీ ఆర్థిక ఇబ్బందు లన్నియు 15 వ తేదీ పిమ్మట తీరిపోగలవు నెలాఖరులో వ్యాపార లాభము. 22 వ తేదీ పిమ్మట గొప్పవారి ప్రేమా దరణలు. సప్తమ కుజస్థితి మంచిదికాదు.

ధనుస్సు

నవంబరు 22 - డిసెంబరు 22

గ్రహస్థితి 22 వ తేది వరకు మంచిది కాదు. 23 నుండి దశమస్థితిని పొందిన రవి వలన పై చిక్కులన్నియు తొలగిపోయి, కొన్ని సత్ఫలిత ములుకలుగును. యత్న కార్యములందనుకూలత, ఉద్యోగాధి కారములలో ఆధిక్యత. వ్యాపారాది కృషులవలన ధనలాభము. నెలాఖరులో మిత్రుల వలన కార్యసిద్ధి. గొప్పవారి సహాయము గురు శనులకోణ స్థితివలన మాతాపితరులకు హాని. జన్మరాశి యందున్న శనిని, శత్రుస్థానములో నున్న అంగారకుడు వీక్షించుటచే కొందరికి ఈనెల రెండవవారంలో, ఆకస్మిక ప్రమాదము.

మకరం

డిసెంబరు 23 - జనవరి 20

4,8,12 స్థానములలో కేతు,రవి, శనులుండుటచే వ్యవహార చిక్కులు కర్మస్థానములో బుధ వక్ర ముచే యత్న కార్యముల ఆలస్యము. కృషివ్యాపా రాదులు కలసిరావు దశమ గురుడు ప్రతిష్టా భంగము, స్థితిగతులకు లోపము రానీయక కాపాడును. 22 వ తేది అనంతరం, దశమ రవివలన దైనికముగా మేలు. గొప్పవారి సహాయం. స్థిర వసతుల నుండియు తన అజ్మా యిషీక్రింద నున్న మరియొక ఆస్తివలన ఆదాయము. భూ, విక్రయమువలన కూడా ఆదాయము. 22 వ తేది అనంతరం, వ్యాపా రాదులలో లాభము. సంతతికి అశుభము.

కుంభము

జనవరి 21 - ఫిబ్రవరి 19

మీ గ్రహస్థితిని బట్టి - కుటుంబ, సాంఘిక విషయములలో బాధ్యత ఎక్కువ. పరస్పర భేదాభిప్రాయాలతో నిర్ణయశక్తి లోపిస్తుంది. మీకార్యకలాపాలు ఎక్కువగాపారమార్థికాలు. ఉద్యోగ, వ్యాపారాది కృషులలో లాభము. సాహిత్య విజ్ఞానాది కృషి ఫలిస్తుంది. గృహ సౌఖ్యము. శుభకార్యాలోచన. గృహనిర్మాణా దులకై ప్రయత్నములు స్త్రీ ధనప్రాప్తి. చతుర్థ అంగారక స్థితివలన బంధువైరము. ఇతర పట్టణ నివాసము.

మీనము

ఫిబ్రవరి 20 - మార్చి 20

తృతీయ షష్టములలోనున్న రవి, కుజులు, పంచమస్థాన మందున్న శుక్రుడు చిక్కులను తొలగించి ఉత్సాహాన్ని కలిగిస్తారు. అప్రయ త్నంగా అనేక అవకాశములు కలుగుతై. ప్రయ త్నాలు నూటికి నూరుపాళ్ళు ఫలిస్తై. ఉద్యో గాధికారులకు ప్రమోషన్. వర్తకులకు మంచి లాభము. సాంఘికవైరములు తొలగిపోతై. శత్రు వులు మిత్రులగుదురు. గొప్పవారి ప్రాపకము. శత్రు, వ్యవహార జయము. మీ ప్రయత్నము లన్నియు 22 లోపుగనే ముగించుకోనవలె.

Edited, Printed & Published by Sri J. Radhakrishna Reddy, Vijayawada-2.
Printed at Sri Ramakrishna Printing Works, Vijayawada-2.